తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-11-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 288 పేజీలు: 8+4 వెల: 6.50







మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను చూపుతున్న పోలీసులు

# నిఘా పెట్టి మట్టుపెట్టాం

**రంపచోడవరం నవంబర్ 18 ప్రభాతవార్త** చతిస్గడ్ రాష్ట్రంలో పోలీస్ నిఘా తో ఉక్కిరిబిక్కిరి అయిన మావోలు షెల్టర్ తీసుకునేందుకు ఆంధ్ర వైపు వచ్చినట్లు పోలీసులకు పక్కా సమాచారం ఉన్నట్లు ఇంటిలిజెంట్ ఐజి మహేష్ చంద్రలడ్డ తెలిపారు. మంగళవారం ఉదయం రంపచోడవరంలో మంగళవారం రాష్ట్ర ఇంటిలిజెంట్ డీజీ మహేష్ చంద్రలడ్డ విలేకరులతో మాట్లాడారు. గత రెండు నెలలుగా నిఘా పెంచి మావోల కదలికలను నిశితంగా గమనిస్తున్నట్లు వెల్లడించారు. మావోలు పట్టణాలలో షెల్టర్ తీసుకునేందుకు ప్రయత్నించారని అన్నారు. గత రెండు రోజులుగా అందుతున్న పక్కా సమాచారంతో అల్లూరి జిల్లా పోలీసులు మారేడుమిల్లి అటవీ ప్రాంతాన్ని జల్లెడ పట్టడం మొదలుపెట్టారని అన్నారు. మంగళవారం ఉదయం 6 నుండి 7 గంటల మధ్యలో మావోలు ఎదురుపడ్డారని ఎన్కౌంటర్లో ఆరుగురు మృత్యువాత పడ్డారని అన్నారు. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత సెంట్రల్ కమిటీ కమాండర్ హిడ్మా అతని భార్య రాజే, మరో నలుగురు మావోయిస్టులు చనిపోయినట్లు తెలిపారు. పదిహేను మంది మావోయిస్టులు తప్పించుకున్నట్లు తెలిపారు. తమకు లభించిన సమాచారంతో విజయవాడ కాకినాడ లో భారీ సంఖ్యలో మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

# నిందితుల పోలీసు కస్టడీకి అనుమతి

>>కోవచ్చని తెలిపింది. గతంలో వారం రోజుల పాటు నిందితులను ఎక్సైజ్ అధికారులు విచారించారు. మరిన్ని కీలక విషయాలు రాబట్టేందుకు నిందితులను విచారించనున్నారు. ప్రస్తుతం నిందితుడు జనార్ధన్ రావు నెల్లూరు కేంద్రకారాగారం, జగన్మోహన్ రావు విజయవాడ జిల్లా జైల్లో జ్యుడీషియల్ రిమాండ్ లో ఉన్నారు.

# తిరుమల 'వైకుంఠద్వారం' ఆన్‌లైన్

>> నేరుగా తిరుమలకు వచ్చినా సామాన్యభక్తులను యధావిధిగా సర్వదర్శనంలో అనుమతిస్తారు. డిసెంబర్ 30,31,జనవరి 1తేదీల్లో మూడురోజులు ఆన్‌లైన్‌లో సర్వదర్శనం టోకెన్లు తప్ప మిగిలిన అన్ని దర్శనాలు రద్దుచేశారు. వివిఐపిలు, విఐపిలు స్వయంగా వస్తేనే వారికి వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తారు.జనవరి 2వతేదీ నుండి 8వరకు ఆన్‌లైన్‌లో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశదర్శనాల టిక్కెట్లురోజుకు 15వేలు, శ్రీవాణి ట్రస్ట్ దర్శనాలు రోజుకు వెయ్యిలెక్కన ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. గత ఏడాది వరకు సామాన్యభక్తుల కోసం ఆఫ్‌లైన్‌లో అమలైన టోకెన్ల విధానం పూర్తిగా రద్దుచేశారు. ఈ ఏడాది డిసెంబర్ 30,31తేదీల్లో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి దర్శనాలతోబాటు అదనంగా మరో ఎనిమిదిరోజులవైకుంఠ ద్వార దర్శనాల విధానంపై మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ధర్మకర్తలమండలి అత్యవసర సమావేశమైంది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఇఒ ఎం.లోకనాథం, వింగ్ విఎస్ఒ ఎన్టీవిరామ్‌కుమార్, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నర్సిరెడ్డి, పనబాకలక్ష్మి, శాంతారామ్, జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎంఎస్ రాజు,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి,పిఆర్ఒ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

**గతంకంటే భిన్నంగా:** 2020వ సంవత్సరం వరకు తిరుమల ఆలయంలో వైకుంఠద్వార దర్శనం ఏకాదశి,ద్వాదశి ఘడియల్లోమాత్రమే 48గంటలు పాటు ద్వారాలు తెరచి భక్తులను అనుమతించేవారు. ఆ తరువాత సామాన్యభక్తుల నుండి వచ్చిన వినతులు, వైష్ణవాలయం శ్రీరంగంలో అమలవుతున్న పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాలను అప్పటి వైసిపి బోర్డు అమలుచేసింది. అయితే ఆన్‌లైన్‌తోబాటు ఆఫ్‌లైన్‌లో తిరుపతిలో పదికౌంటర్లలో ఉచిత సర్వదర్శన టోకెన్లు జారీచేసి అనుమతించేవారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన విషాద ఘటనలతో టోకెన్లకోసం వచ్చి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం, యాభైమందివరకు క్షతగాత్రులయ్యారు.ఈ ఘటనతో టిటిడి ప్రస్తుత బోర్డు కొన్ని మార్పులు చేపట్టింది. గత ఏడాది వరకు పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో అమలైన ఆఫ్‌లైన్‌ను పూర్తిగా రద్దుచేశారు. ఆ స్థానంలో ఆన్‌లైన్‌లో ఈ డిప్ విధానం అందుబాటులోకి తీసుకువచ్చారు. మంగళవారం జరిగిన బోర్డు సమావేశంలో కీలకంగా నిర్ణయాలు తీసుకున్నారు. డిసెంబర్ 30నుండి 2026 జనవరి 8వతేదీ వరకు పదిరోజులు వైకుంఠద్వార దర్శనాలు అమలవుతాయి. 182 గంటలు దర్శన సమయంలో 164 గంటలు దర్శనం సామాన్యభక్తులకుకేటాంచారు. సామాన్యభక్తులకు ప్రాధాన్యతనివ్వడం కోసం తొలిమూడురోజులు ఎస్ఇడి టిక్కెట్లు, శ్రీవాణి టిక్కెట్లు రద్దుచేశారు. అన్ని ఆర్జితసేవలు,ప్రత్యేక దర్శనాలు నిలుపుదలచేశారు. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే దర్శనాలు అనుమతిస్తారు. సిఫార్సు లేఖలు స్వీకరించరు.

**పవిత్రమైన 30,31తేదీల్లో ఆన్‌లైన్‌లోనే టోకెన్లు:** డిసెంబర్ 30,31 వైకుంఠ ఏకాదశి,ద్వాదశి పర్వదినాలతోబాటు జనవరి 1కి సంబంధించి అన్ని టోకెన్లు ఆన్‌లైన్‌లో ఈ డిప్ ద్వారానే కేటాయించేందుకు నిర్ణయించారు. ఇందుకు పారదర్శకంగా అమలుచేసేందుకు భక్తులు టిటిడి వెబ్‌సైట్, మొబైల్‌యాప్, వాట్సాప్‌ద్వారా ఈ డిప్‌కోసం తెలుగు,తమిళం, హిందీ,కన్నడ,ఆంగ్ల భాషల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. నవంబర్ 27వతేదీ నుండి డిసెంబర్ 1వతేదీ వరకు టోకెన్ల కోసం ఈ డిప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. డిప్‌లో ఎంపికైన వారికి డిసెంబర్ 2వతేదీ దర్శన సమాచారాన్ని పంపుతారు. తిరుపతి,తిరుమలలో ఉంటున్న స్థానికులకు జనవరి 6,7,8తేదీల్లో వైకుంఠద్వార దర్శనాలకు రోజుకు ఐదువేల టోకెన్లు మొదట వచ్చినవారికి మొదట అనే విధానంలో ఆన్‌లైన్‌లో టోకెన్లు జారీచేస్తారు. పదిరోజులు తొమ్మిదిలక్షలమందివరకు భక్తులకు వైకుంఠద్వార దర్శనాలు చేయించాలని ప్రణాళికలు సిద్ధంచేశారు. అయితే ఆఫ్‌లైన్‌లో టోకెన్లు విడుదల లేకపోవడంతో సామాన్యభక్తులు నిరాశచెందుతున్నారు.

# జోగి రమేష్‌పై మరిన్ని కేసులు

>> నరసాపురానికి చెందిన తమ్ము కల్యాణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కృత్తివెన్ను జడ్పీటీసీ మైలా రత్నకుమారి, జోగి ప్రధాన అనుచరుడు శ్రీనివాసరెడ్డి, మైలా రమేశ్, మైలా మహేశ్‌రాజు, వై.వెంకటరాజుపై ఐపీసీ సెక్షన్లు 420, 386, 506 రెడ్ విత్ 34 కింద కేసు కట్టారు. ఇంతేరులో సర్వే నం.94లోని 30 ఎకరాల మడ, పంచాయతీ భూమిని ప్రైవేటు భూమి అని చెప్పి ఎకరం రూ.3 లక్షలకే ఇస్తున్నామంటూ బేరం పెట్టారు. ఒక్కొక్కరికి 2.5 ఎకరాలు అగ్రిమెంట్ చేస్తామని 12 మంది నుంచి రూ.7.50 లక్షలు చొప్పున వసూలు చేశారు. భూమి తమదేనని నమ్మించేందుకు అగ్రిమెంట్లు చేసుకొని తొలుత అడ్వాన్స్ తీసుకుని జోగి వద్దకు వెళ్లి మాట్లాడాక మిగిలిన డబ్బులు తీసుకున్నారని బాధితులు వాపోతున్నారు. నెలలు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ చేయట్లేదని కృత్తివెన్ను తహసీల్దార్ కార్యాలయంలో భూముల గురించి విచారించారు. అవి మడ భూములని తేలడంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని జోగి, ఆయన అనుచరులను అడిగితే ప్రభుత్వం తమదేనని, ఏదో విధంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇబ్బంది లేకుండా చూస్తామని నమ్మించారు. 2021లో ఘటన జరిగినా అప్పుడు జోగి మంత్రిగా ఉండడం, డబ్బులు అడిగితే చంపుతామంటూ అనుచరులు బెదిరింపులకు దిగడంతో ఎక్కడా ఫిర్యాదు చేయలేదు. ప్రభుత్వం మారాక తమ డబ్బులు ఇప్పించాలని పోలీసులను ఆశ్రయించారు. దీంతో జోగి రమేష్, ఆయన అనుచరుల అరాచకాలు వెలుగులోకి వచ్చాయి. ఆధారాలను బాధితుడు పోలీసులకు అందించారు. త్వరలో జోగిపైనా కేసు నమోదు కానుందని సమాచారం.

# మావోయిస్టు అగ్రనేత హిడ్మా హతం

>> ఆక్టోపస్ బలగాలు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో మొత్తం 57 మంది మావోయిస్టులను అరెస్టు చేశారు. అరెస్టయిన మావోయిస్టులందరూ ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారుగా, హిడ్మా అనుచరులుగా పోలీసులు గుర్తించారు. అరెస్ట్ అయిన వారిలో 12 మంది మహిళలు కూడా ఉన్నారు. నలుగురు కీలక నేతలు ఉన్నట్లు సమాచారం. స్థానిక పోలీసుల సహాయంతో ఆక్టోపస్ బలగాలు మావోయిస్టులను అరెస్ట్ చేసింది. అరెస్టయిన మావోయిస్టులు కానూరు పరిసర ప్రాంతాల్లో నాలుగు చోట్ల డంపులు (ఆయుధాలు, పేలుడు పదార్థాలు దాచిన స్థావరాలు) ఏర్పాటు చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. ప్రస్తుతం ఈ డంపులను స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

**అపార్ట్‌మెంట్లో తనిఖీలు..**

కృష్ణా జిల్లా పెనమలూరు, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలో ఆయుధాల కలకలం రేగింది. ఈ ప్రాంతంలోని ఒక భవనంలో ఆయుధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

**ఇంటలిజెన్స్-ఆక్టోపస్ బృందాల జాయింట్ ఆపరేషన్ : ఎస్పీ విద్యాసాగర నాయుడు**

విజయవాడ,ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో ఇంటలిజెన్స్,ఆక్టోపస్ బృందాలు జాయింట్ ఆపరేషన్ చేపట్టినట్లు కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తెలిపారు. ఖచ్చితమైన సమాచారంతో సోదాలు చేస్తున్నారు. విజయవాడతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల సోదాలు నిర్వహించామని,మావోయిస్టులకు సంబంధించి 5 జిల్లాల్లో ఆపరేషన్ జరుగుతోందని చెప్పారు.ఆటోనగర్ లోని కానూరులో మావోయిస్టులు షెల్టర్ తీసుకున్నట్లు సమాచారం వచ్చింది. వారందర్నీ అదుపులోకి తీసుకున్నాం. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారున్నారు. మావోయిస్టు సెంట్రల్ కమిటీ సెక్రటరీ తిప్పిరి తిరుపతి బృందాన్ని పట్టుకున్నాం. పట్టుబడిన మావోయిస్టులకు సంబంధించిన సమాచారం రేపు వెలుతురులోకి తెస్తాం అన్నారు.

**ఏపీ పోలీసు మావోయిస్టులకు గట్టి షాక్:** ఏపీ పోలీసు మావోయిస్టులకు గట్టి షాక్ ఇచ్చింది. ఇప్పటి వరకు విజయవాడలో 28, కాకినాడలో 2, ఏలూరులో 15 మందిని మిగతా ప్రాంతాల్లో మరికొంతమందితో కలుపుకుని మొత్తంగా రాష్ట్రంలో 57 మందికి పైగా మావోయిస్టులను అరెస్టు చేశారు. అలానే రాష్ట్రవ్యాప్తంగా మావోయిస్టు డంపుల కోసం గాలింపు కొనసాగుతుంది. హిడ్మా డైరీ ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసు సోదాలు నిర్వహిస్తున్నారు. సోదాలు జరిపిన బలగాలు సుమారు 28 మందిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించేందుకు రహస్య ప్రాంతాలకు తరలించారు. ఇంకా ప్రత్యేక వాహనంలో పేలుడు పదార్థాలు, తుపాకులు పోలీసులు తరలించారు. మొత్తం భవనాన్ని కొత్త ఆటోనగర్ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని విస్తృతంగా తనిఖీలు జరుపుతున్నారు. భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్న మావోయిస్టుల్లో 21 మంది మహిళలు, మరో ఏడుగురు కీలక హోదాల్లోని వ్యక్తులున్నట్లు పోలీసులు తెలిపారు. సానుభూతిపరులు, మిలీషియా సభ్యులను విజయవాడతోపాటు ఇతర ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించేందుకు తమవెంట తీసుకొచ్చి ఉంటారని అనుమానిస్తున్నారు. నాలుగు చోట్ల డంప్‌లు ఏర్పాటు చేసినట్లు పోలీసులకు అందిన సమాచారంతో వాటి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

**ఊరు మారినా తప్పని హిడ్మా తప్పని మృతి:** పోలీసులు అత్యంత అవసరమైన క్రిమినల్.మావోయిస్టు హిడ్మా మృతి అనుహ్య పరిణామం,మావోయిస్టు ఉద్యమంల్లో కీలకం వ్యవహరిస్తూ వచ్చినవాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దక్షి ణ సుక్మాలోని పూర్వర్తి గ్రామంలో హిడ్మా జన్మించాడు. 10వ తరగతి పూర్తి చేసిన తర్వాత, మావోయిస్టు పార్టీలో చేరాడు. సైనిక ఆపరేషన్, గెరిల్లా యుద్ధతంత్రంలో ప్రధాన వ్యూహకర్తగామారాడు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బెటాలియన్ నంబర్ 1 యొక్క ఏరియా కమాండర్ గా ఎదిగాడు. సుక్మా, దంతేవాడ, బీజాపూర్ ప్రాంతాల్లో పనిచేసే దిశ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలో క్రియాశీల సభ్యుడిగా వ్యవహరించాడు. 2017లో సుక్మా దాడితో పాటు 2021లో సీఆర్పీఎఫ్ జవాన్లపై దాడిలో ప్రధాన నిందితుడు హిడ్మా. దాదాపు ఇరవై ఆరు వేర్వేరు దాడులకు హిడ్మా బాధ్యుడని పోలీసుల సమాచారం.

# రాష్ట్రమంతా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం

>> పోల్చుకుంటే ఇప్పటివరకు ధాన్యం అమ్మిన రైతుల సంఖ్య 36 కు పెరిగిందన్నారు. వీరిలో ఎక్కువగా చిన్న సన్నకారు రైతులు ఉన్నారని దాదాపు 6,600 మంది కౌలు రైతులు కూడా సద్వినియోగం చేసుకోగలిగారన్నారు.

గత సంవత్సరం సుమారు రూ. 12 వేల కోట్ల దాకా ధాన్యం కొనుగోలు చేసినప్పుడు 48 గంటల్లో డబ్బులు చెల్లిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చెప్పిన మాట నెరవేర్చుతూ రైతుల ఖాతాల్లో నగదు చెల్లిస్తున్నామన్నారు. దేశంలోనే తొలిసారి 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. ఈసారి ఒక ఛాలెంజ్ గా రైతులకు నగదు చెల్లింపుల విషయాన్ని సవాల్ గా తీసుకుని 48 గంటలు కాస్తా 24 గంటలకే రైతుల ఖాతాలో నగదు జమ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటివరకు రూ. 560 కోట్ల 48 లక్షల మంది రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. దీనికొక ఉదాహరణగా గుంటూరు మండలంలోని పత్తిపాటి సుబ్బారావు అనే రైతు ఆయన ఖాతాలోకి రూ. 2 లక్షల 8 వేల ను 6 గంటల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ఏలూరు జిల్లా భీమడోలు లో నీలం త్రిమూర్తులు అనే రైతు ఖాతాలోకి 5 గంటల్లోనే జమ చేయడం జరిగిందన్నారు. గోనె సంచుల సమస్య లేకుండా 6 కోట్ల 34 లక్షల గోతాలను రైతు సహాయ కేంద్రాల్లో రైతాంగానికి అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి వాహనానికి జిపిఎస్ డివైస్ ఏర్పాటు చేసి పూర్తి పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. ఈ నెల 23, 24 తేదీల్లో అల్పపీడన తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో 50 వేల టార్పాలిన్ లు ప్రతి రైతు సహాయ కేంద్రాల్లో జిల్లా స్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. అందులో భాగంగా ఇప్పటివరకు సుమారు 19 వేల టార్పాలిన్ లు రైతు సహాయ కేంద్రాల్లో రైతాంగానికి ఉచితంగా అందించడం జరిగిందన్నారు. దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ద్వారా రైతాంగానికి వాళ్ళు ధాన్యాన్ని ఎక్కడ, ఏ టైమ్ కు, ఏ రోజు, ఏ మిల్లుకి అమ్ముకోవాలనేది వాళ్ళే నిర్ణయించుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఈరోజు వరకు దాదాపు 500 మంది రైతులు ఈ వాట్సాప్ సేవలను సద్వినియోగం చేసుకున్నారన్నారు.

## వారం - వర్జ్యం

19-11-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
చతుర్దశి ఉ.9.44
స్వాతి ఉ.7.59, విశాఖ కార్తె
వర్జ్యం : మ.2.17-4.05
దు.ఉ.11.31-12.36
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** పట్టుదల, ఓర్పుతో ముందుకుసాగుతారు. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం:** సంఘంలో మీ మాటకు గౌరవం లభిస్తుంది. నూతన ఉద్యోగాలలో ప్రవేశిస్తారు. ఆచితూచి నిర్ణయాలు తీసుకోంటారు.

**మిథునం:** నూతన ప్రయత్నాలకు సన్నిహితులు సహాయ సహకారాలు లభిస్తాయి. దూర ప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**కర్కాటకం :** వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.వాహన సౌఖ్యం కలదు.

**సింహం:** నూతన పెట్టుబడులు అనుకూలంగా ఉంటాయి. పోటీ పరీక్షలలో పాల్గొంటారు. చర్చలు, శుభకార్యాలలో ఎక్కువగా పాల్గొంటారు.

**కన్య :** భాగస్వామ్య వ్యాపారాలలో ఆశించిన నిర్ణయాలు తీసుకోవడం మంచిది.జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు.

**తుల :** ముఖ్యమైన వ్యవహారాలు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగులకు పదోన్నతులు.క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. బంధువుల కలయిక. సంతానం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు.

**ధనుస్సు:** సంతాన విషయంలో కొంత ఆందోళన చెందుతారు. దైవ సంబంధిత కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు.

**మకరం:** నిర్మొహమాటమైన మీ మాటల వల్ల సన్నిహితులు దూరమవుతారు. మెలుకువలో వ్యవహరించండి. సోదరుల కలయిక.

**కుంభం:** విదేశాలలో ఉన్న మిత్రుల నుండి కానుకలు అందుకుంటారు. సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు.

**మీనం :** నూతన వ్యాపార యత్నములను. కొద్ది కాలం వాయిదా వేయడం మంచిది. వివాదాలకు దూరంగా ఉండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వైభవంగా సత్యసాయి రథోత్సవం

>>ను హత్తుకొనే స్వామి వారి కీర్తనలతో గతంలో కంటే భిన్నంగా వేణుగోపాల స్వామి రథోత్సవం స్థానంలో సత్యసాయి రథోత్సవాన్ని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ వర్గాలు నిర్వహించాయి. వేద పండితుల వేద పఠనంతో మంగళవారం ఉదయం నుండే సాయినామ స్మరణలు, వివిధ కళారూపాల ప్రదర్శనలతో ఆధ్యాత్మికత శోభతో పుట్టపర్తి పుర వీధులు పులకించాయి. భానుడి ఉదయపు కిరణాలు తాకగానే పెద్దవెంకమరాజు కళ్యాణ మండపం వద్ద రథోత్సవం వైభవోపేతంగా ముందుకు కదిలింది. సత్యసాయి రథోత్సవాన్ని పురస్కరించుకొని నూతనంగా తయారు చేసిన వెండి రథం కళాకృతులు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా రథం పైభాగంలో గోపురాకార శిరస్సు, చుట్టూ స్వామివారి జీవన సందేశాలను స్మరింపజేసే శిల్పాలు, గంటల అలంకరణలతో దేదీప్యమానంగా వెలుగొందుతున్న శ్రీసత్యసాయి రథం యొక్క పసిడి కాంతుల తేజస్సు చూస్తూ భక్తులు తమను తాము మైమరచి పోయారు. తొలుత జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సత్యసాయి నూతన రథాన్ని రిమోట్ సహాయంతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవితమ్మ, సత్యకుమార్ యాదవ్, పయ్యావుల కేశవ్, ట్రస్ట్ సభ్యులు నాగనంద, స్థానిక శాసనసభ్యులు సింధూరరెడ్డి, పరిటాల సునీతమ్మ, మాజీమంత్రిపల్లె రఘునాథ్ రెడ్డి, స్వచ్ఛందకార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి రామ్, సినీ నటుడు మురళీమోహన్, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి తదితర ప్రముకులు పాల్గొన్ని బాబా పసిడి విగ్రహం, వెండి రథం, ఆధ్యాత్మిక కళాప్రదర్శనలను ప్రత్యక్షంగా వీక్షించి మధురానుభూతి చెందారు. ప్రత్యేక డ్రోన్‌ల ద్వారా సత్యసాయి రథోత్సవం సందర్భంగా పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయంలో 1,100 మంది దంపతులు భక్తిశ్రద్ధలతో శ్రీ సాయి సత్యనారాయణ వ్రతంను ఆచరించారు.

**సాయివిగ్రహ దర్శనానికి ఎగబడిన భక్తకోటి:** నూతనరథం ప్రశాంతి నిలయం ఉత్తర గోపుర ద్వారం వద్దకు చేరుకోగానే ప్రత్యేకంగా తయారు చేయించిన భగవాన్ సత్యసాయి పసిడి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచుతున్న వేళ భక్తులు సంభ్రమాశ్చర్యాలతో వీక్షించాలన్న ఆకాంక్షతో భారీ సంఖ్యలో ఎగబడ్డారు.

# నేడు ప్రధాని పుట్టపర్తి రాక

### సత్యసాయి సమాధి సందర్శన, ప్రత్యేక నాణెం, పోస్టల్ స్టాంపు విడుదల

**అనంతపురం, నవంబరు 18 ప్రభాతవార్త బ్యూరో:** శ్రీ సత్యసాయి బాబా 100వ జయంతి (శత జయంతి) వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబర్ 19వ తేదీన పుట్టపర్తిలో పర్యటించనున్నారు. పుట్టపర్తి విమానాశ్రయంలో ప్రధాని నరేంద్ర మోడీకి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్ , ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,తదితర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, శ్రీ సత్య సాయి సెంటర్ ట్రస్ట్ తరపున రత్నాకర్, తదితర ప్రతినిధులు స్వాగతం పలుకుతున్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఉదయం 10 గంటల ప్రాంతంలో సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకొని నివాళులర్పిస్తారు. తదనంతరం సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో జరిగే శత జయంతి ఉత్సవాల ప్రధాన కార్యక్రమంలో ఆయన పాల్గొనిప్రసంగిస్తారు. అనంతరం 100 (వంద రూపాయల) స్మారక నాణెం , ప్రత్యేక పోస్టల్ స్టాంపు సెట్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విడుదల చేయనున్నారు. అనంతరం ప్రధానమంత్రి తమిళనాడులోని కోయంబత్తూరుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1:30 గంటలకు నిర్వహించే దక్షిణ భారత సహజ వ్యవసాయ సదస్సు ను ఆయన అధికారికంగా ప్రారంభిస్తారు.ఈ వేదికపై ప్రధానమంత్రి పిఎం ప్రధాన మంత్రి యోజన 21వ విడతను విడుదల చేస్తారు.

# 21న రాష్ట్రపతి ముర్ము శ్రీవారి దర్శనం

**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** భారతరాష్ట్రపతి ద్రౌపదిముర్ము 21వతేదీ శుక్రవారం తిరుమలకు వస్తున్నారు. రెండు రోజుల తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా 20వతేదీ సాయంత్రం 3.25గంటలకు రేణి గుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుండి రోడ్డుమార్గంలో తిరుచానూరుకు చేరుకుని పద్మావతిఅమ్మవారిని దర్శనం చేసుకుని రోడ్డు మార్గంలో సాయంత్రం తిరుమల పద్మావతి అతిధిగృహం వస్తారు. రాత్రికి ఇక్కడే బస చేస్తున్న రాష్ట్రపతి 21వతేదీ ఉదయం 9.30 గంటలకు ఆలయ క్షేత్ర ప్రాశస్త్యాన్ని పాటిస్తూ వరాహస్వామిని దర్శించుకుంటారు. అనంతరం ఉదయం 10గంటలకు తిరుమల ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకుంటారు.అనంతరం తిరుపతి విమానాశ్రయం నుండి హైదరాబాద్‌కు ప్రయాణమవుతారు.



మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

# ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

**పుట్టపర్తి, నవంబరు 18, ప్రభాతవార్త:** భగవాన్ సత్యసాయి బాబా శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్య, ఐటి, శాఖల మంత్రి నారాలోకేష్ లకు మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గన్నవరం విమానాశ్రయం నుండి ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5:20 గంటలకు శ్రీసత్యసాయి విమానాశ్రయంకు చేరుకున్నారు. అక్కడ మంత్రులు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మంత్రి సవితమ్మ, ఎంపి బి.కె.పార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, ఎం.ఎస్.రాజు, దగ్గుపాటి ప్రసాద్, బండారు శ్రావణి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, బిజెపి సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ధర్మవరం టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, ఆర్‌టిసి ఛైర్మన్ పూలనాగరాజు, చీఫ్ సెక్రెటరీ విజయానంద్, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్, జెసి మౌర్య భరద్వాజ్ తదితర ప్రముఖులు వారికి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏయిర్‌పోర్ట్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బస చేయడం జరిగింది.

# ఎపిని కేన్సర్ రహితం చేస్తాం

>>పాటు ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్‌సీడీ 3.0 సర్వేలో ఆరోగ్యశాఖ 225 ప్రశ్నలు అడిగింది. అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడం అనేది ఇబ్బందిగా మారింది. 4.0 సర్వేలో ప్రశ్నలను 28కి తగ్గించారు. 18 ఏళ్ల పైబడిన 4.10 కోట్ల మంది ఉన్నారు. వారి నుంచి ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబడతారు. పురుషుల్లో నోటి క్యాన్సర్, మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారి వివరాలు సేకరిస్తారు. ప్రాథమిక స్థాయిలో సర్వేతో ఓ అంచనాకు వచ్చిన తరువాత వైద్యుల సమక్షంలో మరోసారి పరీక్షి స్తారు. అనుమానిత కేసులని తేలితే వారిని బోధన ఆసుపత్రుల్లోని ప్రివెంటివ్ ఆంకాలజీ విభాగాలకు పంపిస్తామన్నారు. ఎన్‌సీడీ 4.0 సర్వేలో ఇప్పటి వరకు అనుమానిత నోటి క్యాన్సర్ కేసులు 31,391 గుర్తిస్తే, గర్భాశయ ముఖద్వార కేసులు 20,298, రొమ్ము క్యాన్సర్ కేసులు 11,694 గుర్తించారు. వీరిని నిపుణుల సమక్షంలో మరోసారి పరీక్షి ంచి 125 గర్భాశయ ముఖద్వార, 170 రొమ్ము, 137 నోటి క్యాన్సర్ అనుమానిత కేసులను ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్లకు రిఫర్ చేశారు. ఆయా కేసుల్లో ఇప్పటి వరకు యూనిట్లకు వెళ్లి పరీక్షి ంచుకున్నది 32 కేసులే. క్యాన్సర్ లక్షణాలు ఉన్నా కొందరు పరీక్షలకు వెనకాడడంతో క్షేత్రస్థాయి వాస్తవ చిత్రం మాత్రం వెలుగులోకి రావట్లేదు. అవగాహన కల్పిస్తే పరిస్థితిలో మార్పు రావచ్చు. ఎన్‌సీడీ 3.0 సర్వేలో క్యాన్సర్ పీడితుల స్క్రీనింగ్‌లో 225 ప్రశ్నలు అడిగేవారు. వీటికి సమాధానాలు రాబట్టడం సాధ్యం కాక ఆ సర్వేలో స్పష్టమైన ఫలితాలు రాలేదు. దాంతో 4.0 సర్వేలో ప్రశ్నలను 28కి కుదించారు. క్షేత్రస్థాయిలో మరింత అవగాహన కల్పించేందుకు సీహెచ్‌వోలు, ఏఎన్ఎంలు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, సెర్ప్ విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్లనూ భాగస్వాములను చేశారు.శాఖల మధ్య సమన్వయం, కచ్చితమైన సమాచార సేకరణ, అవగాహన కార్యక్రమాలు, పర్యవేక్షణ, వైద్య పరీక్షలతో బాధితులను గుర్తించి ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్లలో చేర్పించడం లాంటి లక్ష్యాలను వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నిర్దేశించుకుంది. ఇవి సాకారమైతే లక్ష్యాలు చేరుకునే వీలుంది.

# పరకామణికేసులో నిష్పాక్షిక విచారణ

>> టిటిడి బోర్డులో కూడా చర్చచేశారు.ఓ ఉద్యోగి ఏకంగా కానుకలనే చోరీచేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందనేది బలమైన ఆరోపణలు. ఈ నేపథ్యంలో సిఐడి అధికారులు లోతైన విచారణ చేస్తున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రెండో ప్రాకారం నిర్మాణానికి ఈనెల 27వతేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూమిపూజలో పాల్గొంటారని ఛైర్మన్ నాయుడు తెలిపారు. ఈ సమావేశంలో టిటిడిఆలయ డిప్యూటీ ఇఒ ఎం.లోకనాథం, వింగ్ విఎస్ఒ ఎన్టీవిరామ్‌కుమార్, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నర్సిరెడ్డి, పనబాకలక్ష్మి, శాంతారామ్, జాస్తిపూర్ణసాంబశివరావు, సదాశివరావు, ఎంఎస్ రాజు,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి,పిఆర్ఒ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## సానుకూల స్పందన

>> కూడా దశలవారీగా ప్రారంభమయ్యాయని, కొనుగోలు ప్రక్రియ మొదలైందని తెలిపారు.అయితే మోంథా తుఫాన్ ప్రభావంతో పత్తి నాణ్యత సిసిఐ నిర్దేశించిన ప్రమాణాలకు విరుద్ధంగా ఉండడంతో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని,మిగిలిన మూడు అంశాలైన ఎల్1,ఎల్2,ఎల్3 జిన్నింగ్ మిల్లులను ఒకేసారిప్రారంభి ంచేలాచర్యలు,వాతావరణం కారణంగా తేమ శాతం 12శాతం నుండి 18శాతం వరకు ఉన్న పత్తిని కొనుగోలు చేస్తారని తెలిపారు.

## షాక్‌కు గురయ్యాం: హైకోర్టు

>> అధికారులు సైతం పాల్గొనేందుకోర్టు వెసులుబాటు కల్పించింది. తదుపరి విచారణను న్యాయస్థానం డిసెంబరు 2కి వాయిదా వేసింది.

## రాష్ట్రంలో స్థానిక ఎన్నికల సందడి

**విజయవాడ, నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు సంబంధించిన సందడి ఆరంభం కానున్నది,ఈ నెలాఖరు లోగా ఓటర్ల జాబితా ప్రచురణ ఎన్నికల అధికారుల నియామకం పూర్తి చేయాల్సి ఉందని ఇటీవల ఎస్ఇసి వెల్లడించారు.

ఈ నెల 30లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు చేసి, ఈవీఎంల సన్నాహాలు పూర్తిచేయాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. ఓటింగ్ ఈవీఎంలపై నిర్వహించాలా, బ్యాలెట్ బాక్స్‌ల్లో నిర్వహించాలనే అంశం దిశలో ఎన్నికల సంఘం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. పోటీల్లో నిలిచే ఎస్ఇసీ ప్రణాళిక సిద్ధం చేసిందని సమాచారం.నోటిఫికేషన్ తరువాత ప్రస్తుతం అధికారంలో ఉన్న స్థానిక సంస్థల పాలక వర్గాలు తమ పవర్స్ కోల్పోతాయి.

## అమిత్ షా డెడ్‌లైన్‌కు ముందే హిడ్మా ఎన్‌కౌంటర్!

**న్యూఢిల్లీ, నవంబర్ 18:** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా మృతిచెందాడు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విధించిన డెడ్‌లైన్ కంటే ముందే హిడ్మాను ఎన్‌కౌంటర్ చేశారు. నవంబర్ 30లోపే హిడ్మా ఆటకట్టించాలని భద్రతా బలగాలను అమిత్‌షా ఆదేశించినట్లు సమాచారం. 2026 మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించాలని అమిత్ షా గడువు విధించారు. ఈ క్రమంలో జరిగిన భద్రతా సమీక్షా సమావేశంలో నవంబర్ 30లోగా హిడ్మా పనిపట్టాలని భద్రతా బలగాలకు ఆదేశాలు ఇచ్చారు. అయితే ఆ డెడ్‌లైన్ కన్నా ముందుగానే ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో హిడ్మా మృతిచెందడం గమనార్హం అని సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతోన్న ఆపరేషన్లను చూస్తుంటే మార్చి కంటే ముందుగానే నక్సలిజం తుడిచిపెట్టుకుపోతుందని అంచనావేశాయి.

ఆదివారం అనుబంధం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
19-11-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 288 పేజీలు: 8 వెల: 6.50

# రాష్ట్రమంతా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం



ఇప్పటిదాకా 2.36 లక్షల మె.ట ధాన్యం కొనుగోలు

పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పారదర్శకంగా 32,793 మంది రైతుల నుండి 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేసి దాదాపు రూ. 560 కోట్ల రైతుల ఖాతాల్లో జమ చేశామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడ రూరల్ లోని కానూరు సివిల్ సప్లైస్ భవన్ లో మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రైతులు మాపై ఉంచిన నమ్మకం, భరోసా తో నిజాయితీగా, పారదర్శకంగా ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేస్తున్నామన్నారు. రైతులు ఆశించిన మేరకు క్షేత్ర స్థాయిలో దాదాపు 16,000 మంది సిబ్బంది ఇందుకు కృషి చేస్తూ జిల్లా స్థాయిలో కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు నిరంతరం కొనగోళ్ల ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. దీనిలో భాగంగా నేటి వరకు 32,793 మంది రైతుల నుండి 2,36,284 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేసి రూ. 560 కోట్ల 40 లక్షలు రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. ఇది గత సంవత్సరంతో పోల్చితే 30 అదనంగా పెరిగిందన్నారు. గత ఏడాది ఇదే రోజున 1,81,885 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ల ప్రక్రియ నిర్వహిస్తూ రైతాంగానికి కనీస మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో కొంతమంది రైతులకి కొన్ని ప్రాంతాల్లో రైస్ మిల్లర్లకు లబ్ధి చేకూర్చేలా గత ప్రభుత్వాలు చేసిన నిర్వాహకాలు అందరికే తెలిసిందేనన్నారు. గత ఏడాదితో >>2

## మారేడుమిల్లిలో భారీ ఎన్‌కౌంటర్

# మావోయిస్టు అగ్రనేత హిడ్మా హతం

భార్య రాజె సహా మరో నలుగురు ఎన్‌కౌంటర్

హిడ్మాపై కోటి రూపాయల రివార్డు, రాజెపై 50 లక్షలు


మరి కొందరు మావోయిస్టులను అదుపులోకి తీసుకొన్న పోలీసులు

విజయవాడ, రాష్ట్రంలోనే వివిధ ప్రాంతాల్లో మొత్తం 57 మంది అరెస్టు



హిడ్మా(ఫైల్)

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత మద్ది హిడ్మా,మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో ఖతమైనట్లు ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ధృవీకరించారు. పోలీసులతో మావోయిస్టులు జరిపిన ఎదురు కాల్పుల్లోఆరుగురు చనిపోయారని,వారిలో అతని భార్య రాజే ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మావోయిస్టుల ఆటలను సాగనిచ్చేది లేదన్నారు. రాష్ట్రంలో మావోయిస్టుల కదలికలను గుర్తించిన నేపథ్యంలో అయిదు జిల్లా మావోయిస్టులను అదుపులో తీసుకున్నామని తెలిపారు. క్యూంబింగ్ ఇంకా జరుగుతుందన్నారు. కృష్ణాజిల్లా, విజయవాడ, కాకినాడలో మావోయిస్టులను అరెస్టు చేశాం. మెత్తం 31 మంది మావోయిస్టులను అరెస్టు చేశాం. అరెస్ట్ చేసిన వారిలో 9 మంది సెంట్రల్ కమిటీ సభ్యులు ఉన్నారు. ఈరోజు ఉదయం 6.30 నుంచి 7 గంటల సమయంలో ఎన్‌కౌంటర్ జరిగింది. రెండ్రోజులుగాఇంటలిజెన్స్ సమాచారంతో గాలింపుచర్యలువిస్తృతం చేశామనివివ రించారు.



మంగళవారం విజయవాడ ఆటోనగర్ ప్రాంతంలో మావోయిస్టుల కోసం వెతుకుతున్న పోలీసులు

**విజయవాడలో 57 మంది మా వోయిస్టుల అరెస్టు:** కానూరు లోని కొత్త ఆటో నగర్ ప్రాంతంలో పోలీసులు, >>2

## సతీష్ మృతిపై షాక్‌కు గురయ్యాం: హైకోర్టు

**విజయవాడ,నవంబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:**పరకామణి చోరీ కేసు ఫిర్యాదుదారు సతీష్ మృతిపై షాక్‌కు గురయ్యామని ఏపీ హైకోర్టు పేర్కొంది. ఫిర్యాదుదారులు,సాక్షులకు భద్రత కల్పించాలని ఆదేశించింది.పరకామణి చోరీ కేసుపై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. టిటిడి మాజీ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ మృతి నేపథ్యంలో కోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. సాక్షులతో పాటు నిందితుడు రవికుమార్‌కు పోలీసు రక్షణ కల్పించాలని ఆదేశించింది. దర్యాప్తు పూర్తయ్యేవరకు రక్షణ కల్పించాలని సీఐడీ డీజీకి ఆదేశాలు ఇచ్చింది. ఈ కేసు దర్యాప్తులో సీఐడీ డీజీ, కింది స్థాయి >>2

## జోగి రమేష్‌పై మరిన్ని కేసులు!

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి జోగి రమేష్‌పై పోలీసులు మరిన్ని కేసులు నమోదు చేసే దిశలో కీలక సాక్ష్యాధారాలు సేకరిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఆయన అనుచరులు అయిదుగురిపై ఈ కేసులు నమోదు చేసారు.ఈ కేసుల్లో జోగిని నిందితునిగా నమోదు చేసేందుకు అవసరమైన సాక్ష్యాలు పోలీసులు దగ్గర ఉన్నాయంటున్నారు. కృత్తివెన్ను మండలం ఇంతేరులోని మడ, పంచాయతీ భూములను ప్రైవేటు భూములని చెప్పి పలువురు నుంచి రూ.90లక్షలు వసూలు చేసిన వైనంపై ఆయన అనుచరులు ఐదుగురిపై కృత్తివెన్ను పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. >>2

# ఎపిని కేన్సర్ రహితం చేస్తాం

ఆ వ్యాధితో రాష్ట్రంలో యేటా 30వేలమంది మృతి

కొత్తగా 75 వేల కేసులు వస్తున్నాయి

బాధితుల గుర్తింపునకే ఎన్‌సిడి 4.0కు శ్రీకారం: సిఎం చంద్రబాబు



**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీని క్యాన్సర్ రహితంగా మార్చాలనే ప్రభుత్వ సంకల్పానికి ప్రజలు అండగా ఉండాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు నిచ్చారు. క్యాన్సర్ బాధితులను గుర్తించడానికి వీలుగా నిర్వహిస్తున్న ఎన్‌సీడీ 4.0 సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేసారు.సకాలంలో గుర్తిస్తే కాన్సర్స్‌ను ప్రాణాంతకం కాకుండా రోగులను సంరక్షించవచ్చునన్నారు. రొమ్ము క్యాన్సరును నియంత్రించడం చాలా సులభతర పరిస్థితులు అందుబాటులోకి వచ్చాయన్నారు.ఈ దిశలో ప్రపంచ స్థాయిలో వైద్యరంగ సంస్థలతో ప్రభుత్వం పలు ఒప్పందాలు చేసుకుందని తెలిపారు.ఈ మేరకు సీఎం చంద్రబాబు స్థానిక సంస్థలు, విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు,ఆస్పత్రులకు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా సమాచార పత్రాలను పంపించారు.ఈ పత్రాల్లోని సమాచారాన్ని అనుసరించి రాష్ట్రంలో క్యాన్సర్‌తో ఏటా 30 వేల మంది చనిపోతున్నారు. 75 వేల కొత్త కేసులు వెలుగు చూస్తున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్‌ను గుర్తించి వారికి సరైన వైద్యం అందించి తీవ్రతను తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. బాధితులను గుర్తించడానికి గతంలో చేపట్టిన ఎన్‌సీడీ (అసాంక్రమిక వ్యాధుల) 3.0 సర్వే ఫలితాలు సంతృప్తికరంగా రాలేదు. దీంతో ఈ సంవత్సరం ఏప్రిల్ 21 నుంచి సెప్టెంబరు 10వరకు 18 వేల మంది వైద్యులు, సహాయకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. క్యాన్సర్ బాధితులను గుర్తించడానికే ఎన్‌సీడీ 4.0 సర్వేకు శ్రీకారం చుట్టారు. 2026 ఏప్రిల్ నాటికి ఈ సర్వే పూర్తి అయితే వాస్తవ పరిస్థితిపై స్పష్టత రానుంది. క్యాన్సర్ కేసులను గుర్తించే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ క్రమంలోనే ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని సలహాదారుగా నియమించింది. ఈయన నేతృత్వంలో రాష్ట్రంలో క్యాన్సర్ కట్టడి చర్యలు మొదలయ్యాయి. ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలో నమోదైన క్యాన్సర్ కేసులతో పాటు ఇతర వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న కేసుల వివరాలను ఒకచోట క్రోడీకరించడం, ఎన్‌సీడీ 4.0 సర్వే ద్వారా గుర్తించిన కేసుల ఆధారంగా రాష్ట్రంలో వాస్తవ పరిస్థితిపై స్పష్టతకు రానున్నారు.ఈ డేటా, మ్యాపింగ్‌లతో ఏయే జిల్లాల్లో, మండలాల్లో, ప్రాంతాల్లో కేసుల తీవ్రత ఎక్కువగా ఉంది? ప్రమాద కారకాలేంటి? నివారణ చర్యలకు ప్రణాళికలు తదితర అంశాలతో క్యాన్సర్ అట్లాస్ రూపొందిస్తారు. ఈ సమగ్ర నివేదిక రాచపుండు కట్టడికి మార్గదర్శకమవుతుందని భావిస్తున్నారు. గత సంవత్సరం నవంబర్‌లో నిర్వహించిన ఎన్‌సీడీ 3.0సర్వేలో రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ బాధితులను గుర్తించారు. నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిలో కొందరు వివరాలు చెప్పడానికి, పరీక్షలకు చేయించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు. తద్వారా వాస్తవ పరిస్థితులు అనేవి వెలుగులోకి రావడం రాలేదు. తాజా సర్వేలో కేవలం క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారిని మాత్రమే గుర్తించనున్నారు. సర్వే లక్ష్యాలపై జనంలో అవగాహన కల్పించేందుకు సామాజికమాధ్యమాల్లో విస్తృతప్రచారంతో >>2



## పత్తిరైతుల సమస్యలపై కేంద్రం సానుకూల స్పందన: మంత్రి అచ్చెన్నాయుడు

**సచివాలయం,నవంబరు 18,ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పత్తరైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరిచేందుకు గతంలో కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలపై మంచి పురోగతి జరుగుతోందని వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక, మార్కెటింగ్, పాల, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచెన్నాయుడు తెలిపారు.గతంలో లేఖద్వారా కేంద్రానికి సూచించిన ఆరు కీలక అంశాలపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని మూడు అంశాల అమలు ప్రక్రియను ప్రారంభించింది.దీనివల్ల పత్తి కొనుగోలులో ఏర్పడిన సమస్యలు పరిష్కారం వైపు సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాలు >>2

# పరకామణికేసులో నిష్పాక్షిక విచారణ

టిటిడి బోర్డు నిర్ణయం

బాధ్యులెవరైనా క్రిమినల్ కేసులు నమోదుచేయాలని తీర్మానం

**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన తిరుమల పరకామణిలోచోరీ కేసు ఉదంతంపై భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని, నిష్పక్షపాతంగా విచారణచేయాలని టిటిడి బోర్డు నిర్ణయించింది. ఇందుకు సిఐడి అధికారులకు అవసరమైన సహకారం టిటిడి అందిస్తుందన్నారు. ఈ కేసులో ఎంతటివారున్నా, ఎంతటివారైనా క్రిమినల్ కేసులు నమోదు చేసి సమగ్రదర్యాప్తు చేయాలని తీర్మానించారు. మంగళవారం తిరుమల అన్నమయ్యభవనంలో తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ధర్మకర్తలమండలి అత్యవసర సమావేశమైంది. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి,సివిఎస్‌ఒ కెవి మురళీకృష్ణ,బోర్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవునికి భక్తులు విశ్వాసంతో సమర్పించే కానుకలు పరకామణి భవనంలో లెక్కించేసమయంలో రవికుమార్ అనే ప్రైవేట్ ఉద్యోగి 2023లో 920 అమెరికన్ డాలర్లు చోరీ చేసినవిషయం పై సిఐడి విచారణ సాగిస్తోంది. ఈ కేసులో కీలకమైన,ఫిర్యాదిదారుడు పూర్వ ఏవిఎస్ఒ వై.సతీశ్‌కుమార్ హత్యకు గురవడంతో టిటిడి బోర్డులో తీవ్రంగా చర్చించారు. అనేక మలుపులు తిరిగిన ఈ చోరీ కేసు ఉదంతంలో లోక్‌అదాలత్‌ద్వారా రాజీ చేసిన వెనుక కుట్ర ఎవరిది,ఎవరు హస్తం ఉందనేది ఇప్పుడు తేలిపోనుంది. ఇందులో దర్యాప్తు పారదర్శకంగా, వేగంగా సాగుతున్న సమయంలో పూర్వ ఏవిఎస్ఒ హత్యకు గురైనట్లు ఆరోపణలపై >>2



రథాన్ని లాగుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఆర్‌జె.రత్నాకర్, మంత్రులు సత్యప్రసాద్, అనగాని

# వైభవంగా సత్యసాయి రథోత్సవం

హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పలువురు మంత్రులు, ప్రముఖులు

సత్యసాయి శతజయంతి వేడుకలకు భారీ ఏర్పాట్లు

**శ్రీసత్యసాయి జిల్లా, నవంబరు 17, ప్రభాతవార్త ప్రతినిధి:**సత్యసాయి బాబా శతజయంతి మహోత్సవాలలో భాగంగా పుట్టపర్తి పుర వీధులు సర్వం సాయి మయంగా మారాయి. అశేష జనవాహిని మధ్య 'సత్యసాయిరథోత్సవం' వైభవంగా జరిగింది. భక్తుల హృదయాల >>2

నేడు ప్రధాని మోడీ పుట్టపర్తి రాక

## నకిలీ మద్యం కేసు

## నిందితుల పోలీసు కస్టడీకి అనుమతి

**విజయవాడ,నవంబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:**నకిలీ మద్యం కేసులో నిందితుల పోలీసు కస్టడీకి 2వ సారి న్యాయస్థానం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది . నకిలీ మద్యం కేసులో కీలక నిందితులు జనార్ధన్ రావు, జగన్మోహన్ రావులను 5 రోజుల పాటు కస్టడీకి కోరుతూ ఎక్సైజ్ అధికారులు పిటీషన్ దాఖలు చేశారు. పిటీషన్ పై విచారణ జరిపిన ఎక్సైజ్ కోర్టు ఏ1 జనార్ధన్ ,ఏ2 జగన్మోహన్ లను 4 రోజుల పాటు కస్టడీకి అనుమతించింది. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు విచారించుకోవచ్చని ఎక్సైజ్ అధికారులను ఆదేశించింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు విచారించు >>2

# తిరుమల 'వైకుంఠద్వారం' ఆన్‌లైన్

తొలి మూడురోజులు ఇ-డిప్ సర్వదర్శన టోకెన్లు

ఆ వారంరోజులు నేరుగా వస్తే సాధారణ సర్వదర్శనమే

టిటిడి బోర్డు కీలక నిర్ణయం



మంగళవారం సమావేశమైన టిటిడి బోర్డు

**తిరుమల,నవంబరు 18ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమంప్రకారం పూజలందుకుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వారదర్శనాలను పూర్తిగా ఈ ఏడాది ఆన్‌లైన్‌లోనే విడుదలచేసేలాతిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయించింది. గతంకంటే భిన్నంగా డిసెంబర్ 30వతేదీ వైకుంఠ ఏకాదశి, 31న ద్వాదశి ,2026 నూతన ఆంగ్ల సంవత్సరం జనవరి 1న దర్శనాలకు సంబంధించి పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఈ డిప్ ద్వారా సర్వదర్శనం టోకెన్లు విడుదల చేస్తారు. ఈ టోకెన్లు పొందిన వారిని మాత్రమే వైకుంఠద్వార దర్శనానికి అనుమతిస్తారు. జనవరి 2వతేదీ నుండి 8వతేదీ వరకు వారం రోజులు ఎటువంటి దర్శన టిక్కెట్లు, టోకెన్‌లు లేకుండా >>2

వార్త

సరిదిద్దకుండా వదిలేసిన తప్పులను
మించిన ఆపదలు మరేమీ ఉండవు.

-స్వామి వివేకానంద

# అసైన్డ్ భూములు కార్పొరేట్లకు అప్పగింత!

**రాష్ట్రంలోకార్పొరేట్, కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని ముమ్మరం చేయచూస్తున్నారు. లీజుకి తీసుకున్న భూముల్లో తమ ఇష్టం వచ్చిన పంటలను కార్పొరేట్లు పండిస్తారు.ఫలితంగా ఆహార పంటల కొరత ఏర్పడుతుంది. ఏదేశమైనా, రాష్ట్రమైనా భూసంస్కరణలు అమలు జరపకుండా పారిశ్రామిక అభివృద్ధిని సాధించలేవు. రాష్ట్రంలో భూసంస్కరణల అమలు బూటకంగా మారి పేదలకుభూమి దక్కలేదు. భూసంబంధాల్లో మౌలికమైన మార్పులు రాలేదు. పాలక ప్రభుత్వాలు పేదలకు భూములు పంచకుండా, అసైన్డ్ భూములు, నిషేధిత భూములు, చిన్న, సన్నకారు రైతుల భూములు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలు అమలు చేస్తున్నది. కార్పొరేట్ సంస్థలకు భూములు కట్టబెట్టే రాష్ట్రం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకిస్తూ, లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములు, నిషేధిత 22ఎ భూములు, మిగులు భూములు, అటవీ బంజరు భూములు పేదలకు పంపిణీ చేయాలని గ్రామీణ పేదలు, పేద రైతులు ఉద్యమించాలి.**

బొల్లిముంత సాంబశివరావు

అసైన్డ్ చట్టసవరణకు చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వ మంత్రివర్గం ఆమోదించింది. ఈ చట్టసవరణతో తమ భూములను రైతులు లీజుకి ఇచ్చుకోవచ్చని, లీజు ద్వారా 30నుంచి 40 వేలు పొందవచ్చని రైతాంగాన్ని మభ్యపెడుతుంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలకు ఇక నుంచి కూటమి ప్రభుత్వం అసైన్డ్ భూములు కేటాయిస్తుంది. ఆయా కంపెనీలు రాష్ట్రానికి రావడానికి ఆసక్తి చూపడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రివర్గం నిర్ణయం ప్రకటించింది. ప్రైవేట్ కంపెనీలకు లీజుకు ఇచ్చేందుకు 26,43,500 ఎకరాలను గుర్తించారు. న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎన్ఆర్ఇడిసిఎపి) రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేసే రూరల్ బోర్డు ద్వారా లీజు ప్రక్రియ జరుగుతుంది.ఇప్పటికే పరిశ్రమలు నెలకొల్పినవారు, విస్తరణ అవసరాలకు భూములు తీసుకోవచ్చని చెప్పింది. ఇప్పటికే గుర్తించిన ప్రాంతాల్లోనూ కంపెనీలు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు.కంపెనీలు ప్రైవేట్ భూములను లీజుకి తీసుకుని ఉంటే, ఆ భూ యజమానులు ప్రయోజనం పొందేలా విధివిధానాలు రూపొందించారు. లీజు కింద అసైన్డ్ రైతులు పొందినట్లే ఏడాదికి లీజు డబ్బులు పొందవచ్చు.కౌలుకి ఇచ్చిన రైతుకుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని నిబంధనల్లో పేర్కొన్నారు. దీనివల్ల రైతుకు నికర ఆదాయం వస్తుందని చెప్పటమంటే, రైతులను మోసగించడమే. అధికారం చేతులు మారకముందు నుంచి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన వ్యవసాయకూలీలు (వీరిలో ఎక్కువ మంది దళితులు ఉన్నారు), పేద రైతులు బంజరు, ఫోరంబోకు భూములు, సముద్ర తీర భూములు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు.ఈభూములకు పట్టాలు ఇవ్వాలని కమ్యూనిస్టు పార్టీ, వ్యవసాయకూలీ సంఘం అనేక ఆందోళనలు చేశాయి. ఆందోళనల ఫలితంగా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం భూములకు డిపట్టాలు ఇవ్వటం జరిగింది. ప్రభుత్వం ఇచ్చిన కొన్ని భూములు వెంటనే సేద్యానికి అనుకూలంగా లేకపోవడంతో, అలాంటి భూములు అన్యాక్రాంతం అయ్యాయి. భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం బలంగా ముందుకు రావడంతో ఆనాటి ప్రభుత్వం 9/1977 లో అసైన్డ్ చట్టం చేయడం జరిగింది. ఈ చట్టంలో అసైన్డ్ భూములు అమ్మటం,కొనటం నేరం. అలా చేసినవారు శిక్షలకు గురౌతారు. అన్యాక్రాంతమైన భూమి తిరిగి గుర్తించడానికి ఇవ్వటం అలా కాని పక్షంలో అర్హులైన మరో లబ్దిదారునికి ఇవ్వాలి. ఈచట్టం చేసిన తర్వాత కూడా కొందరు బడాబాబులు అసైన్డ్ భూములు కబ్జా చేయటం జరిగింది. 2002లో అసైన్డ్ భూములు అమ్ముకోవటానికి అవకాశం కల్పిస్తూ జీవో తీసుకువచ్చే ప్రయత్నం చేయగా తీవ్ర వ్యతిరేకత వల్ల ఉపసంహరించుకుంది. అసైన్డ్ ఉన్నా భూములు కబ్జాఅవుతున్నా,దాన్ని నివారించకుండా,రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం అసైన్డ్ చట్టాన్ని సవరిస్తూ 2006లో ఆర్డినెన్స్ జారీచేసి శాసనసభ ఆమోదం పొందింది. చట్టంలోని 4వ సెక్షన్, బిక్లాజు సవరణ ద్వారా అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకుని తిరిగి పేదలకే ఇవ్వాలనే నిబంధన నుంచి మినహాయింపు పొంది అమ్మేహక్కు, ఇష్ట



మైనవారికి ఇచ్చే అధికారం ప్రభుత్వం పొందింది. ఈ చట్ట సవరణ పేదలను భూములకు దూరం చేయడమే కాకుండా సెజ్లకు కట్టబెట్టే చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం అసైన్డ్ భూముల లెక్కలు తేల్చేందుకు జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తూ రెవిన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు రెవిన్యూ ప్రత్యేక కార్యదర్శి, ఏపీల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జీవో 104 జారీచేశారు. ఈ జిల్లా కమిటీకి ఇన్‌చార్జ్ మంత్రి చైర్మన్‌గా ఉంటాడు. జిల్లాకి చెందిన మంత్రులు సభ్యులుగా, జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా ఉంటారు. ఈక్రమంలో నిషేధిత 22ఎ జాబితా నుంచి తొలగించిన భూములు 13,59,000 ఎకరాలు ఉన్నాయని, ఇందులో 13,57,000 లక్షల ఎకరాల భూములను ప్రభుత్వం వెరిఫై చేసిందని చెబుతున్నారు. నిషేధిత 22ఎ భూములంటే ప్రభుత్వ యాజమాన్యం,చట్టపరమైన వివాదాలు, సీలింగ్ పరిమితుల కారణాలవల్ల రిజిస్ట్రేషన్ కాకుండా నిషేధించబడిన భూములు. ఈభూములు అమ్మడం, కొనడం, రుణం కోసం తనకా పెట్టడం సాధ్యంకాదు. ఇవి రిజిస్ట్రేషన్ చేయబడవు. అలాంటి భూములను నిషేధం నుంచి తొలగించి వాటిని లీజుకి ఇచ్చుకోవచ్చని పేర్కొంది. అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైతే, ఆ భూములు తిరిగి స్వాధీనం చేసుకుని పేదలకే పంపిణీ చేయాలి.కాని కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధమైన చర్యలు తీసుకుంది. అన్యాక్రాంతం పేరుతో అసైన్డ్ భూములను, నిషేధం నుంచి తొలగించిన 22ఎ భూములు 13.59,000 ఎకరాలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నది. కార్పొరేట్లకు ఆ భూములను 99 సంవత్సరాల లీజుకి ఇవ్వటం అంటే, శాశ్వతంగా భూములు వారికి కట్టబెట్టటమే. పేదలను భూములకు దూరం చేసి వారిని కూలీలుగా మార్చడమే. గతంలో చంద్రబాబు ప్రోద్బలంతో కుప్పంలో కాంట్రాక్ట్ వ్యవసాయానికిభూములు ఇచ్చిన రైతులకు వచ్చిన చేదు అనుభవాలు ఇంకా వారిని వెంటాడుతూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాగుకి యోగ్యమైన భూమి కోటి, లక్ష ఎకరాలు. రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 37 శాతం ఉంది. సాగు యోగ్యంగాని భూమి మూడు లక్షల ఎకరాలు ఉంది. సాగు భూమి సేద్యం చేసేవారికి చెందాలి. దేశంలో, రాష్ట్రంలో అందుకు విరుద్ధంగా సేద్యం చేయని పరాన్న బుక్కులైన భూస్వాముల వద్ద భూమి బంధించబడి ఉంది. 1973లో చేసిన భూసంస్కరణల చట్టం ద్వారా మిగులు భూమి 18 లక్షల ఎకరాలు. దాన్ని కుదింపులతో 7.9 లక్షలుగా తేల్చారు. అందులో 6.46 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని 5.92 లక్షల ఎకరాలను 4లక్షల,79 వేలమందికి పంపిణీ చేసినట్లు పాలకులు లెక్కలు చెబుతున్నారు. దీన్ని గమనిస్తే భూసంస్కరణల చట్టం ఎంత బూటకంగా అమలు జరిగింది తెలుస్తున్నది. చంద్రబాబునాయుడు భూసంస్కరణలకు, చిన్న రైతుల వ్యవసాయానికి వ్యతిరేకం. వ్యవసాయం దండగ అని చెప్పిన వ్యక్తి చంద్రబాబు. దాన్ని ఆచరణలో పెట్టడానికే లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలుఅమలు చేస్తున్నారు. ఆ విధంగా రాష్ట్రంలో కార్పొరేట్, కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని ముమ్మరం చేయ చూస్తున్నారు.లీజుకి తీసుకున్న భూముల్లో తమ ఇష్టం వచ్చిన పంటలను కార్పొరేట్లు పండిస్తారు.ఫలితంగా ఆహార పంటల కొరత ఏర్పడుతుంది. ఏదేశమైనా, రాష్ట్రమైనా భూసంస్కరణలు అమలు జరపకుండా పారిశ్రామిక అభివృద్ధిని సాధించలేవు. రాష్ట్రంలో భూసంస్కరణల అమలు బూటకంగా మారి పేదలకుభూమి దక్కలేదు. భూసంబంధాల్లో మౌలికమైన మార్పులురాలేదు. పాలక ప్రభుత్వాలు పేదలకు భూములు పంచకుండా,అసైన్డ్ భూములు, నిషేధిత భూములు, చిన్న, సన్నకారు రైతుల భూములు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలు అమలు చేస్తున్నది. కార్పొరేట్ సంస్థలకు భూములు కట్టబెట్టే రాష్ట్రం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకిస్తూ, లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములు,నిషేధిత 22ఎ భూములు, మిగులు భూములు, అటవీ బంజరు భూములు పేదలకు పంపిణీ చేయాలని గ్రామీణ పేదలు, పేద రైతులు ఉద్యమించాలి. ●

# సౌదీలో చిదిమేసిన రోడ్డు ప్రమాదం!


అవాంఛనీయ సంఘటనలు, అనుకోని దుర్ఘటనలు ఎదురైతే ఇక మిగిలేది శోకమే. ప్రమాదాలు జరిగి కుటుంబ సభ్యులు యావత్తూ మరణించినా, ఆ కుటుంబానికి సాన్నిహిత్యమున్న వారు మరణించినా ఇంటిల్లిపాదీ శోకసముద్రంలో మునిగిపోతే ఆ సన్నివేశాలు గమనించిన వారెవరికైనా హృదయం ద్రవించక మానదు. సంఘటన స్థలం సౌదీ అరేబియా. మక్కా నుంచి మదీనా మార్గమధ్యంలో ముషహరత్ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి 1.30 ప్రాంతంలో డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సొకటి 45 మంది ప్రయాణికులను పొట్టన పెట్టుకుంది. ఆ ప్రమాదంలో వారంతా అగ్నికీలలకు సజీవ దహనమయ్యారు. వారిలో ఇద్దరు కర్ణాటక వాసులూ మృత్యువాతపడ్డారు. ప్రయాణికులందరూ భారతీయులే. అదీ ముఖ్యంగా దాదాపు అందరూ మక్కా యాత్రికులే. దైవ సన్నిధానికి వచ్చిన వారు తాము తొక్కిసలాటలో చనిపోతామనో, తాము ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదాలకు గురవుతుందనో అనుకుని బయలుదేరరు. అపశకునం మాటలు మాట్లాడుకోకుండా ఆ దైవం దివ్యానుగ్రహంతో తీర్థయాత్రలకు శ్రీకారం చుడతారు. కానీ విధి మరోలా జీవితాలతో ఆటలాడుకుంటోంది. భక్తి భావం నిండుగా గుడులు, గోపురాలు, మసీదులకు వెళ్తే అక్కడ అనుకోని తొక్కిసలాటలు ఎదురు చూస్తుంటాము. పరాయివ్యక్తిని నమ్మితే మోసం కాటేస్తుంది. ఎన్నో ఆధునిక సాంకేతిక వనరులు అందుబాటులో ఉన్నా అప్రమత్తంగా ఉన్నా, అనుకోని అవాంతరాలు, అంతరాయాలు, చివరికి ఎలా వెళ్లి ఎలా ఇళ్లు చేరుతామో అంచనాకందదు. అయినా అనుకున్నట్లుగా అంతా జరుగదు. సౌదీ దుర్ఘటనలో బుగ్గిపాలైన వారి మృతదేహాలు గుర్తుపట్టేందుకు కూడా మిగల్లేదు. వారిని గుర్తించాలంటే డిఎన్ఎ టెస్టుల వల్లే సాధ్యం. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఉమ్రా యాత్రకు హైదరాబాద్ నుంచి 54 మంది బయలుదేరారు. వారిలో 8 మంది అదృష్టవశాత్తూ మక్కాలో ఆగిపోయారు.అదే వారికి అదృష్టానికి దారి చూపింది. బస్సు ఎక్కలేకపోయారు. వారు మాత్రమే సురక్షితంగా ఉన్నారు. బస్సెక్కిన వారంతా మృతజీవులే. ఒక్కరంటే ఒక్కడే మృత్యుంజయుడిగా మిగిలారు. చెప్పాలంటే హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం తమ మూడుతరాల వ్యక్తుల్ని కోల్పోయింది. ఆ ఇంటి పెద్ద నసీరుద్దీన్, ఆయన భార్యతో సహా 8 మంది పెద్దలు, పది మంది మనవలు, మనవరాళ్లు దుర్మరణం పాలయ్యారు. చితిలో భస్మాన్ని డిఎన్ఎకి పంపిన తర్వాతే వారెవరో గుర్తించగలిగేది. ఇలా ఒకే కుటుంబానికి చెందిన 18 మంది మృతి చెందడం అత్యంత విషాదకర సంఘటన. ఎవరికైనా మనసు కలచివేస్తుంది.మక్కా యాత్రే తమ అంతిమ ఆఖరి మజిలీయని వారు అనుకొని ఉండరు. ఈ మధ్యకాలంలో తొక్కిసలాటలు, అగ్నిప్రమాదాలు, ఘోర రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అప్పుడే కలికాలం వచ్చేసిందనుకునే రోజుల్ని చూస్తున్నాము. అందుకే ఎన్నడూలేని దుస్సంఘటనలను ప్రతిరోజూ చూస్తున్నామా? అనిపిస్తుంది. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, అతివేగం ప్రమాదకరమని అన్నివేళలా హెచ్చరిస్తూనే ఉన్నా జరుగరాని విషాదాలు జరిగిపోతూనే ఉన్నాయి. భారతదేశంలో జరిగే ప్రమాదాలకే మనం బెంబేలెత్తిపోతున్నాం. అతివేగం, అమిత నిర్లక్ష్యం పేరిట ఇచ్చే నినాదాలు వ్యర్థమైపోతున్నాయి. ముఖ్యంగా అర్ధరాత్రి ప్రయాణాల్లో ఎక్కువ ప్రమాదాలు జరిగేవి నడిరోడ్డు మీదనే, చీకటిలోనే. ఆ సమయానికి బస్సుల్లో ప్రయాణికులు గాఢ నిద్రలోనే ఉంటారు.నిద్రలోనే గాల్లో కలిసిపోయే ప్రయాణికులు ప్రాణాలు ఎన్నో. భారత కాలమానం ప్రకారం సౌదీలో ప్రమాదం జరిగిన సమయం సోమవారం తెల్లవారుఝాము. డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొని బస్సుకు నిప్పంటుకోగానే బస్సులోని 45 మంది అగ్నికి ఆహుతయ్యారు. ఆ సమయానికి అందరూ నిద్రలోనే ఉన్నారు. 2019లో ఒకబస్సు మరో భారీ వాహనాన్ని ఢీకొని 35మంది,2023 నుంచి మక్కా నుంచి వెళ్తున్న మరో బస్సు బ్రిడ్జిని ఢీకొట్టగా మంటలో చిక్కుకోగా 20 మంది మృత్యువాతపడ్డారు. నెలరోజుల క్రితం కర్నూలు శివారుల్లో ప్రైవేటు బస్సు మోటారు సైకిల్‌ను ఢీకొనగాగా రేగిన అగ్ని జ్వాలాలలకు ప్రయాణికులు పూర్తిగా దగ్గమయ్యారు.15 రోజుల్నాడు చేవెళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని మరచిపోలేము. బస్సు డ్రైవర్ ఏమరుపాటుగా ఉండడం వల్లే ప్రమాదం జరిగిందని విశ్లేషిస్తున్నా అతనిప్పుడు బతికిలేడు. కనుక నిజాలు తెలియవు. నిజానికి భారతీయ రోడ్లపై ప్రమాదాలకు, సౌదీలో రోడ్లకు మధ్య జరుగుతున్న ప్రమాదాలను విశ్లేషించాలంటే సాపత్యం ఉండదు. ఒకసారి ఆ ప్రాంతానికి వెళ్లిన కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ చెబుతున్న దానిని బట్టి మక్కాలో బస్సులు, కార్లు గంటకు 180కి.మీ వేగంలో వెళ్తుంటాయి. అదే నిజమైతే అతివేగం నుంచి కట్టడి సాధ్యం కాదేమో. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో ఏ దేశంలోనైనా అతివేగాన్ని అరికట్టడం అత్యంత అవసరం.ప్రతి ముస్లిం తమ జీవితకాలంలో ఒకసారైనా మక్కా యాత్రకు వెళ్లిరావాలని తలపోస్తారు. ఈ యేడాది తెలంగాణ నుంచి 9వేల మందికిపైగా మక్కాకు బయలుదేరారు. నాలుగు ప్రైవేట్ ట్రావెల్ ఏజెన్సీలు వారి ప్రయాణపు ఏర్పాట్లు చూసాయి అనీసజావుగానే జరిగాయి. కానీ ఊహించని ప్రమాదానికి విగత జీవులౌతారని ఎవరూ అనుకొని ఉండరు.అందులో ప్రయాణించిన వారుహైదరాబాద్‌లోని 8 కుటుంబాలకు చెందినవారు. కుటుంబ పెద్దలు కోల్పోయిన వారూ ఉన్నారు. అలాంటి కుటుంబాల ఆలనా పాలనా చూసుకునేందుకు కూడా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం అవసరం.

"పేదరికం కారణంగా ఇంతవరకూ ఏ దేశం సమిసిపోలేదు. అవినీతి కారణంగానే దేశాలు నేలమట్టమయ్యాయి."



నానీ పాల్కీవాలా

"ఓరిమికి అపారమైన శక్తి ఉంది. దండించే అధికారం ఉన్నా దండించకపోవడం నిజమైన ఓర్మి."



ఎమ్.కె.గాంధీ

# ఉబకాయులలో నానాటికీ పెరుగుతున్న గుండె జబ్బులు!

బుగ్గన మధుసూదనరెడ్డి

ప్రపంచవ్యాప్తంగా గడిచిన నాలుగు దశాబ్దాల్లో ఊబకాయుల సంఖ్యరెట్టింపు అవుతుండటం అత్యంత ఆందోళనకరమైన విషయం.ఎందుకంటే ఇలా మానవాళి ఓ పద్ధతి పాడు లేకుండా ఇష్టానుసారం తమ ఒళ్లను పెంచుకుంటూ పోతేమాత్రం ప్రాణాంతకర వ్యాధులు అయిన గుండె జబ్బులు టైపు 2 డయాబెటీస్ బారిన పడే అవకాశాలు మూడు రెట్లు అధికం అని ఎంతో అనుభవజ్ఞులు, తల పండిన డాక్టర్లు సైతం సెలవిస్తుండటాన్ని బట్టి స్థులకాయం అనేది మానవాళి జీవితాలను ఎంతటి ప్రమాదకర పరిస్థితులలోకి నెట్టి వేస్తున్నదో మనం ఇట్టే ఊహించవచ్చు. ముఖ్యంగా జంక్ ఫుడ్స్‌ను ఎక్కువగా తీసుకుంటుండటం, వేళ కానీ వేళల్లో భోజనానికి ఉపక్రమించడం, తాము చేసే పనిలో పూర్తిగా నిమగ్నం అయ్యి, పీకలదాకా కూరుకుపోయి భోజనాన్ని సైతం వాయిదా వేయడంతో పాటు, ఎడాపెడా చిరుతిండ్లు అంటే బిస్కెట్లు, స్నాక్స్, మిక్చర్, ఐస్ క్రీమ్స్, సమోసా వంటి వాటిని తీసుకుంటూ ఉండటం మూలాన మన శరీరం అదుపుతప్పి కొలెస్ట్రాల్, కొవ్వు శాతం మన శరీరంలో పెరిగిపోయి అధిక బరువు మనకు సంప్రాప్తించే ఆనారోగ్య పరిస్థితులు ప్రస్తుత సమాజంలో ఎక్కువగా పొడచూపుతుండటం ఎంతైనా కడు బాధాకరమైన, శోచనీయమైన విషయం. ఒక విధంగా చెప్పాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఊబకాయం, స్థులకాయం అనేది మానవాళికి ఓ పెను శాపంగా పరిణమించింది అనే మాట సత్యదూరం కాదు. అందులో భాగంగా పరిస్థితులు అనేవి ఎంతటి దారుణ, దయనీయ పరిస్థితుల్లోకి నెట్టివేయబడిందో అనే విషయానికి వస్తే ప్రతి ముగ్గురు ఊబకాయుల్లో ఇద్దరి మరణాలకు గుండె జబ్బులే ప్రధాన కారణమని ఇటీవల ఓఅధ్యయనం తెలియజేసింది అంటే ఊబకాయం అనేది మానవాళి జీవితాలను ఏ స్థాయిలో ఆడుకుంటుందో, ఏ తరహాలో వారిని ప్రాణాపాయ స్థితిలోకి నెట్టివేస్తున్నదో తెలుసుకుంటుంటేనే మన గుండెలు, హృదయాలు ఒక్కసారిగా జలదరించడంతో పాటు, బరువెక్కుతాయి. అంతేకాదు మన శరీరానికి సైతం ఒక్కసారిగా తీవ్ర ఆందోళనతో ముచ్చెమటలు పట్టడం తథ్యం. ఇక ముఖ్యంగా స్థులకాయుల్లో పొడచూపే జబ్బుల విషయానికి వస్తే గుండె వైఫల్యం,కొవ్వు పేరుకుపోవడం,రక్తం గడ్డ కట్టడం,గుండె కొట్టుకోవడంలో అసమతుల్యత వంటి ప్రమాదాలు ఎల్లవేళలా మన వెన్నంటివుంటాయని ఓ పేరు మోసిన సర్వే సంస్థ వారు తమ అభిప్రాయాన్ని కుండలు బద్దలు కొట్టినట్లు తెలియజేయడంతో ఖచ్చితంగా మనమంతా స్థులకాయాన్ని తక్కువ అంచనా వేయడానికి వీలులేదని, ఆ విషయంలో ఏమరుపాటు ఏ మాత్రం తగదనే చేదు వాస్తవాన్ని వీలయినంత త్వరగా ప్రతి ఊబకాయుడు గ్రహించి సత్వరమే తన హెవీ బాడీని,భారీ శరీర ఆకృతిని తగ్గించుకునే దిశగా చాలా తీవ్ర కసరత్తు చేయక తప్పదు కాక తప్పదు. ఏదిఏమైనా సాధారణ బరువు వున్న వారితో పోలిస్తే అధిక బరువు వున్న 29-49ఏళ్ల వయసు గల పురుషుల్లో 78 శాతం, మహిళల్లో 65 శాతం అధిక రక్తపోటును బాడీమాస్ ఇండెక్స్ (బిఎంఐ) ఎక్కువగా ఉండటమే కారణం. అదేమాదిరి స్థులకాయుల గుండెకు రక్తం సరాఫరాలో ఏర్పడే ఇబ్బందిని 'ఇస్కామిక్ హార్ట్ డిసీజ్' అంటారు. దీనికి ప్రధాన కారణం పొగ త్రాగడం,బీపీ,షుగర్,రక్తంలో కొలెస్ట్రాల్ వంటివి ప్రధాన భూమికను పోషిస్తాయి అన్న మాట. అంతిమంగా మానవాళి చేయాల్సిన తక్షణ కర్తవ్యం ఏమంటే తమ తమ శరీర బరువును అదుపులో పెట్టుకోవడం,ఎందుకంటే చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకునే కన్నా ముందే మేల్కొని తమ శరీరాన్ని ఎలాంటి పరిస్థితుల్లో ఊబకాయం బారిన పడకుండా చూసుకుంటే మంచిది. ●



# ప్రజావాక్కు

## మనిషికి సాటిరాని కృత్రిమ మేధస్సు

డిజిటల్ యుగం వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో కృత్రిమమేధస్సు సమాజాన్ని కొత్తదిశల్లో నడుపుతోంది. భాష, గణితం, డేటావిశ్లేషణ ఇలాంటి అనేక రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతవేగంతో ముందుకు సాగుతున్నప్పటికీ, అది మనిషి సహజమేధస్సును భర్తీ చేయగలదనే అపోహమరింత ప్రమాదకరం. ఎందుకంటే యంత్రాలువేగాన్ని,ఖచ్చితత్వాన్ని అందించగలిగినా, భావోద్వేగం, నైతికత, సానుభూతి, సృజనాత్మకత ఇలాంటి మానవ విలువలను అవి పునరుత్పత్తి చేయలేవు. కృత్రిమ మేధస్సు అతిపెద్ద శక్తి దాని విశ్లేషణ సామర్థ్యం. వైద్యం నుంచి రవాణా వరకు,పంటల ఆరోగ్యం నుంచి వాతావరణ అంచనాల వరకు అన్నిరంగాల్లో ఇది సమర్థతను పెంచుతోంది.వ్యాధులను ప్రారంభదశలో గుర్తించడం,ట్రాఫిక్‌నియంత్రణ, లాజిస్టిక్స్‌లో వృథా తగ్గించడం వంటి అభివృద్ధులుప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలను అందిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## టీజీ సీడ్స్ బిల్లుపై రైతుల ఆందోళనలు

తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన టీజీ సీడ్స్ బిల్లు, 1966,1983లో అమలులోకి వచ్చిన పాత విత్తన చట్టాలను భర్తీచేస్తూ,విత్తనాలనాణ్యత నియంత్రణను మరింత కఠినతరం చేయాలనే లక్ష్యంతో ముందుకు వస్తోంది. వ్యవసాయ రంగం వేగంగా మారుతున్న ఈ కాలంలో, జీవ సాంకేతికత ప్రాభవం పెరుగుతున్న నేపథ్యంలో, నూతన చట్టం అవసరం అనడం సందేహం లేదు. పాడు విత్తనాల కారణంగా సంవత్సరాలుగా నష్టపోతున్న రైతు లకు ఇది కొంతవరకు రక్షణనిచ్చే ప్రయత్నమే. అయితే, ఈ బిల్లుకు సంబంధించి రైతులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలు గణనీయమైనవే.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

చలికాలం వచ్చింది. చలి తీవ్రత పెరుగుతుంది. మంచు కురుస్తుంది.మంచులోఎదుటివాహనాలు కనిపించక పోవటం వల్ల, డ్రైవర్లు సరైన జాగ్రత్తలు పాటించక పోవటం వల్ల, రోడ్డు ప్రమాదాలు జరిగి, పలువురి ప్రాణాలు గాలిలోకలిసేప్రమాదంవుంది.మంచు కురుస్తున్నప్పుడు ప్రయాణాలకివిరామమిచ్చి,సరైనప్రణాళికలుసిద్ధం చేసుకోవాలి.

- మా. శ్రీ. రాజు, పాల్వంచ

## సుప్రీం ఆదేశాలను అమలు చేయాలి

గ్రామాలలో మున్సిపల్ కార్పొరేషన్ వీధిలలో కుక్కలే మనుషుల ప్రాణాలు తోడేస్తున్నాయి. రక్తంరుచి మరిగినట్టుగా మనుషులపైదాడిచేసి కరుస్తున్నాయి.ఈ మధ్యకాలంలోవీధి కుక్కలు సృష్టిస్తున్న బీభత్సం అంతా ఇంతా కాదు. చిన్నపిల్లలపై అవి క్రూరంగా దాడిచేస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. ఆ రాష్ట్రం, ఈ రాష్ట్రమన్న తేడాలేదు. దేశమంతా ఇదే పరిస్థితి. ఈనేపథ్యంలో సర్వోన్నత న్యాయస్థానం జనసమ్మర్ధ ప్రాంతాల్లో అస్సలు వీధికుక్కలు కనబడకూడదంటూ తీర్పునిచ్చి సంచలనం సృష్టించింది. జనం తిరిగే ప్రాంతాల్లో వీధికుక్కలు ఉండకూడదు.. తక్షణమే వాటిని రక్షణ కేంద్రాలకు తరలించి సంతాన నియంత్రణ చికిత్సలు చేయాలని కీలక ఆదేశాలు జారీచేసింది.

- సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

## ధర్మపురిలో సమస్యల తిష్ట

జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మి నరసింహస్వామి ఆలయంలో సమస్యలు తిష్ట వేశాయి ఎక్కడ చూసిన చెత్త చెదారంతో నిండి వుంది. నిత్యం వేలాది మంది భక్తులు ఈ ఆలయానికి వచ్చి గోదావరిలో పుణ్య స్నానం చేసి దర్శనం చేసుకుంటారు. కార్తీక మాసంలో ఎక్కువగా వస్తారు. ఆలయం లోపల కుక్కలు గుంపులుగా తిరుగుతూ ఉన్నాయి. ఎక్కడ దాడి చేస్తాయో అని భక్తులు భయం గుప్పిట్లో దర్శనం చేసుకుంటున్నారు. ధర్మపురి బస్టాండ్‌లో వున్న మరుగు దొడ్లు కంపు కొడుతూ ఉన్నాయి.నీటి సౌకర్యంలేదు. నగర పాలకసంస్థ అధికారులు ఆలయ అధికారులు స్పందించిధర్మపురి ఆలయ పవిత్రతను కాపాడాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## జూనియర్ కాలేజీల అడ్మిషన్ల దందా

తెలంగాణలో ప్రైవేట్ జూనియర్ కాలేజీలు వచ్చే రానున్న విద్యాసంవత్సరానికి ముందస్తు అడ్మిషన్లు తీసుకోవడం అనేది ఒక దందాగా మారింది. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా, ముఖ్యంగా పదోతరగతి పరీక్షలు ముగియకముందే అడ్మిషన్లు మొదలుపెట్టి, అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఈముందస్తు అడ్మిషన్ల ద్వారా విద్యార్థులను ఆకర్షించడానికి, ఫీజులు ఎక్కువ వసూలు చేయడానికి విద్యాశాఖ నిర్దేశించిన అడ్మిషన్ల షెడ్యూల్‌కు ముందే ప్రైవేట్ కాలేజీలు అడ్మిషన్లు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధం అయినప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఫీజులు వసూలు చేస్తున్నాయి. మరో మూడు నెలలకు కొత్త ఫీజు ఉంటుందని ఒత్తిడి చేస్తున్నాయి.

- పొద్దుటూరి జగదీశ్వర్, కరీంనగర్ జిల్లా

# పరిశుభ్రత చర్యలే అభివృద్ధికి తొలిమెట్టు

డి జయరాం

స్వచ్ఛ భారత్ వంటి జాతీయ కార్యక్రమాల ద్వారా దేశం బహిరంగ మల విసర్జన రహితస్థితిని సాధించడంలో గణనీయమైన ప్రగతి సాధించింది. అయితే మరుగుదొడ్ల నిర్మాణం వలన కలిగే అపారమైన ప్రయోజనాలను పూర్తిగా అందుకోవాలంటే, నిర్మాణానంతరం ఎదురయ్యే నిర్వహణ, వినియోగ అలవాట్ల సవాళ్లను కూడా అదే స్థాయిలో అర్థం చేసుకోవాలి. పరిశుభ్రత అనేది కేవలం ఒక సౌకర్యం కాదు. ఇది దేశ పౌరుల ఆరోగ్యం, గౌరవం ఆర్థిక అభివృద్ధికి మూల స్తంభం. మరుగుదొడ్ల కల్పన అనేది కేవలం ఒక పౌర సదుపాయంగా కాకుండా బహుముఖ ప్రయోజనాలు అందించే సామాజిక పెట్టుబడిగా చూడాలి. మరుగుదొడ్ల కల్పన వలన కలిగిన అతి ముఖ్యమైన ప్రయోజనం మహిళల భద్రత, గౌరవం మెరుగుపడటం. బహిరంగ మల విసర్జనకు వెళ్లవలసి వచ్చినప్పుడు ముఖ్యంగా చీకటి పడిన తర్వాత, మహిళలు లైంగిక వేధింపులు, ప్రమాదాలు, మానసిక ఆందోళన వంటి సమస్యలను ఎదుర్కొనేవారు. వ్యక్తిగత మరుగుదొడ్ల లభ్యత వలన, మహిళలు ఈ రకమైన సామాజిక భయం నుండి విముక్తి పొందారు. ఇది మహిళల ఆత్మగౌరవాన్ని పెంచింది. సమాజంలో వారి భద్రతా స్థాయిని బలోపేతం చేసింది. యుక్త వయస్సు బాలికలు సరైన మరుగుదొడ్ల సదుపాయం కారణంగా పాఠశాలలకు హాజరు కావడం పెరిగింది. పరిశుభ్రమైన మరుగుదొడ్ల వినియోగం వలన అతి ముఖ్యంగా ప్రజా ఆరోగ్యం మెరుగుపడుతుంది. బహిరంగ మల విసర్జన పద్ధతులు నీరు, ఆహారం, నేలను కలుషితం చేస్తాయి. దీని వలన పిల్లలు, వృద్ధులలో డయేరియా, టైఫాయిడ్, కలరా వంటి తీవ్రమైన అంటువ్యాధులు వేగంగా వ్యాపిస్తాయి. మరుగుదొడ్ల వినియోగం, ఈ వ్యాధులకుకారణమయ్యే వ్యాధి కారకాలు పర్యావరణంలోకి చేరకుండా అడ్డుకుంటుంది. ఈ వ్యాధుల నియంత్రణ వలన అటు ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థపై భారం తగ్గడంతో పాటు, ఇటు పేద కుటుంబాలు చికిత్స కోసం ఖర్చుపెట్టవలసిన ఆదాయ నష్టంతగ్గుతుంది. పరిశుభ్రమైన వాతావరణం, ఆరోగ్యవంతమైన సమాజాన్ని సృష్టిస్తుంది. ప్రజలు తరచుగా అనారోగ్యంబారిన పడకుండా ఉన్నప్పుడు, వారి ఉత్పాదకత పెరుగుతుంది. అనారోగ్యంతో సెలవులు తీసుకోవడం తగ్గుతుంది. తద్వారా ఉద్యోగులు, కూలీలు నిరంతరంగా పనిచేయగలుగుతారు. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం, పారిశుద్ధం, పరిశుభ్రతలో పెట్టుబడి పెట్టడం వలన ఆరోగ్య ఖర్చులు తగ్గి, జాతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఈ విధంగా, మరుగుదొడ్ల కల్పన దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)కి పరోక్షంగా దోహదం చేస్తుంది. డబ్ల్యూహెచ్ఓ నివేదిక ప్రకారం 2014తో పోలిస్తే 2019లో దేశంలో మూడు లక్షల డయేరియా మరణాలు నివారించబడ్డాయి. ఆరోగ్య ఖర్చులు తగ్గినందున సగటున ఒక కుటుంబం సాలీనా 50,000 రూపాయలు ఆదా చేసింది. భూగర్భ జలాల కాలుష్యం 12.70 రెట్లు తగ్గాయి. ఆగస్టు 2017 లో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన ఒక స్వతంత్ర సర్వే,మొత్తం జాతీయ గ్రామీణ గృహ పారిశుద్ధ్య కవరేజ్ 62.5 కి,



మరుగుదొడ్ల వినియోగం 91.3కు పెరిగిందని నివేదించింది. గ్రామీణ ప్రాంతాల్లో 99శాతం గృహాలు,100శాతం మరుగుదొడ్ల వినియోగంతో హరియాణా అగ్రస్థానంలో నిలిచింది. మరుగుదొడ్డి లేని వారిసంఖ్య 55 కోట్ల నుంచి 50 కోట్లకు తగ్గిందని యునిసెఫ్ తెలిపింది. మరుగుదొడ్డిని 96 శాతం మంది ఉపయోగిస్తున్నారని ప్రపంచ బ్యాంకు నివేదించింది. మరుగుదొడ్ల నిర్మాణంలో విజయం సాధించినప్పటికీ ఆ ప్రయోజనాలను పూర్తిగా అందుకోవాలంటే అనేక వ్యవస్థాపరమైన, సామాజిక సవాళ్లను అధిగమించాలి. మరుగుదొడ్ల నిర్మాణానంతరం ఎదురయ్యే అతిపెద్ద సమస్య సరైన నిర్వహణ, నీటి లభ్యత లేకపోవడం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో లేదా నీటికొరత ఉన్న ప్రాంతాలలో, మరుగుదొడ్లు నిర్మించినా, వాటిని శుభ్రపరచడానికి తగినంత నీరు ఉండకపోవడం వలన అవి ఉపయోగించడానికి వీలు లేకుండా పోతున్నాయి. మరుగుదొడ్లు మురికిగా ఉంటే, ప్రజలుతిరిగి బహిరంగ మల విసర్జనకు మొగ్గు చూపుతారు.మురుగునీటి నిర్వహణ వ్యవస్థ సరిగా లేకపోవడం వలన, ఆ వ్యర్థాలు తిరిగి పర్యావరణంలోకి చేరి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. సాంకేతిక పరిష్కారం కంటే ప్రవర్తనా మార్పు తీసుకురావడం చాలా కష్టం. తరతరాలుగా బహిరంగ మల విసర్జనకు అలవాటు పడిన వర్గాలలో మరుగుదొడ్లను ఉపయోగించడం అనేది ఆమోదయోగ్యం కాని సామాజిక, సాంస్కృతిక అలవాటుగా మారింది. చాలా మంది బహిరంగ మల విసర్జనను 'స్వచ్ఛత'గా భావిస్తారు, ఎందుకంటే మరుగుదొడ్లు 'మురికిని' ఒకే చోట నిల్వ చేస్తాయి. ఈ మానసిక ప్రతిఘటనను అధిగమించడానికి నిరంతర సామాజిక చైతన్యం అవసరం. పట్టణ ప్రాంతాలలో, ముఖ్యంగా రద్దీగా ఉండే మురికివాడల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మించడానికి స్థలం లభించకపోవడం ప్రధాన సమస్య. ఇక్కడ సామాజిక మరుగుదొడ్లు అవసరం. కానీ ఈ సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం నాణ్యత, నిర్వహణ లోపాలు కారణంగా అవి తరచుగా అపరిశుభ్రంగా, పనికిరాకుండా పోతున్నాయి. పట్టణ ప్రణాళికలో పారిశుద్ధ్య వ్యవస్థకు తగిన ప్రాధాన్యత లభించకపోవడం వలన, సమస్య మరింత జటిలమవుతోంది. మరుగుదొడ్ల ఉపయోగాలు పూర్తిగా అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వం, సమాజం ప్రజలు కలిసి పనిచేయాలి. ప్రభుత్వం నీటి సంరక్షణ మురుగునీటి శుద్ధిపై దృష్టి సారించాలి. ప్రతి ఇంటి మరుగుదొడ్డిని ఒక చిన్నవ్యర్థ శుద్ధి కేంద్రంతో అనుసంధానం చేసే స్థిరమైన టెక్నాలజీని ప్రోత్సహించాలి. సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ బాధ్యతను పారదర్శకతతో కూడిన స్థానిక మహిళాస్వయం సహాయక బృందాలు లేదా సామాజికసంస్థలకు అప్పగించి,వారికి ఆర్థిక మద్దతు అందించాలి. విద్య,ఆరోగ్య కార్యకర్తల ద్వారా చైతన్యం కలిగించాలి. పాఠశాలల్లో విద్యార్థులకు,ఆశా కార్యకర్తల ద్వారా గ్రామాలలో మహిళలకు పరిశుభ్రత తాలూకా శాస్త్రీయ, ఆర్థిక ప్రయోజనాలపై చైతన్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలి. బహిరంగ మల విసర్జన వలన కలిగే ప్రమాదాలు, మరుగుదొడ్లు వాడటం వలన కలిగే సామాజిక, ఆరోగ్య ప్రయోజనాలను స్పష్టంగా వివరించాలి. ప్రవర్తనా మార్పు అనేది ఒక రాత్రిలో జరిగేది కాదు, దీనికి దీర్ఘకాలిక కృషి అవసరం. ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం సందర్భంగా భారతదేశం మరుగుదొడ్ల నిర్మాణాన్ని విజయవంతంగా పూర్తి చేసినప్పటికీ,వినియోగ అలవాట్లు, నిర్వహణ అనే రెండు ముఖ్యమైన సవాళ్లను అధిగమించవలసి ఉంది. పరిశుభ్రతను ఒక సామాజిక బాధ్యతగా భావించి, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, పౌరులు కలిసి పనిచేసినప్పుడే ఈ ప్రయోజనాలు పూర్తి స్థాయిలో సమాజానికి అందుతాయి. ఈ నిరంతర సంకల్పం ద్వారానే భారతదేశం ఆరోగ్యవంతమైన, సుస్థిరమైన, గౌరవప్రదమైన భవిష్యత్తు వైపు సాగగలదు. పరిశుభ్రతలో విజయం సాధించడంఅనేది దేశ సమగ్రాభివృద్ధికి అనివార్యమైన తొలి మెట్టు. ●

మనవి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)



# బంగ్లాలో రేగిన హింస

## పలు ప్రాంతాల్లో పేలుళ్లు, వాహనాల ధ్వంసం

## ఇద్దరు మృతి, పలువురికి గాయాలు

## బంద్‌కు అవామీలీగ్ పిలుపు

**ఢాకా, నవంబరు 18:** బంగ్లాదేశ్ మరోమారు హింసాకాండతో రగిలిపోతోంది. మాజీ ప్రధాని షేక్ హసీనాకు అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ మరణశిక్ష విధించడంతో బంగ్లాదేశ్‌లో మళ్లీ హింసాకాండ చెలరేగింది. ఐసిటి తీర్పును నిరసిస్తూ బంగ్లాదేశ్ బంద్‌కు హసీనా పార్టీ అవామీ లీగ్ పిలుపునిచ్చింది. సోమవారం మొదలైన హింసాత్మక ఘర్షణలు మంగళవారం కూడా కొనసాగాయి. విద్యార్థి ఉద్యమాలతో సంబంధమున్న వ్యక్తులు కొందరు బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడు షేక్ ముజిబుర్ రెహమాన్ ఇంటికి నిప్పుపెట్టడానికి ప్రయత్నించగా, హసీనా మద్దతుదారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఘర్షణ చెలరేగింది. దాదాపు ఐదారు జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలకు నిప్పుపెట్టారు. కార్యాలయాల్లోకి చొరబడి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. రెండు విద్యాసంస్థల్లోకి ఆందోళనకారులు చొరబడి బీభత్సం సృష్టించారు. అనేక చోట్ల బాంబులు పేలాయి. కోట్లిపారాలో జరిగిన బాంబు పేలుడులో ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. ఇద్దరు మృతి చెందారు. పలువురు ఆందోళనకారులు కూడా గాయపడినట్లు అధికారులు తెలిపారు. నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. లాఠీచార్జ్ చేశారు. అనేక సౌండ్ గ్రనేడ్లను ఉపయోగించారని డిప్యూటీ పోలీస్ కమిషనర్ మసూద్ ఆలం తెలిపారు. అవామీ లీగ్ బంద్ పిలుపు నేపథ్యంలో దేశవ్యాప్తంగా ప్రజారవాణ నిలిచిపోయింది. వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేశారు. సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఐసిటి తీర్పు పక్షపాతంతో కూడినది, రాజకీయంగా ప్రేరేపించబడిన ప్రతీకారం అని అవామీ లీగ్ పార్టీ అగ్రనేత జహంగీర్ కబీర్ నానక్ అభివర్ణించారు. బంగ్లాదేశ్ ప్రజలు ఈ నిర్ణయాన్ని ఎప్పటికీ అంగీకరించరని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో వీడియో విడుదల చేశారు. ఐసిటి తీర్పు నేపథ్యంలో యూనస్ అవామీ లీగ్‌ను నిషేధించడం గమనార్హం.

# షేక్ హసీనాను భారత్ అప్పగిస్తుందా?

## - బంగ్లా వినతిపై ఇంకా స్పందించని వైనం
## - ప్రస్తుతం భారత్ ఆశ్రయంలో ఉన్న హసీనా



**ఢాకా, నవంబరు 18:** బంగ్లాదేశ్‌లో మరణశిక్ష పడిన షేక్ హసీనాను ఆ దేశానికి అప్పగిస్తారా లేదా అనేది ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. షేక్ హసీనాను దోషిగా తేల్చిన ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ ఆమెకు మరణశిక్ష విధించింది. దీంతో ఆమెను తక్షణమే తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ భారత్‌కు విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలోనే ఆమె మరణశిక్షపై స్పందించిన భారత్ ఆమెను అప్పగించాలన్న విజ్ఞప్తిపై మాత్రం ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాకు ఆ దేశ కోర్టు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతుండగా షేక్ హసీనాకు ఆ దేశ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ మరణశిక్ష విధించినందున ఆమెను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం భారత్‌ను కోరింది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు షేక్ హసీనా అప్పగింత అంశం భారత్‌బంగ్లాదేశ్ దౌత్య సంబంధాల్లో కీలక మలుపుగా మారింది. ప్రస్తుతం భారత్‌లో ఉంటున్న హసీనాను వెంటనే తమకు అప్పగించాలని ఢాకాలోని తాత్కాలిక ప్రభుత్వం న్యూఢిల్లీని కోరింది. 2024 జూలైలో బంగ్లాదేశ్‌లో చెలరేగిన విద్యార్థుల తిరుగుబాటును అణచివేసేందుకు అప్పటి ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినందుకు గాను హెలికాప్టర్లు, డ్రోన్‌లు, మారణాయుధాలను ఉపయోగించి విద్యార్థి నిరసనకారులను చంపడానికి ప్రయత్నించారనే ఆరోపణలపై షేక్ హసీనాకు ట్రిబ్యునల్ మరణశిక్ష విధించింది. భారత్‌బంగ్లాదేశ్ మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం శిక్ష పడిన షేక్ హసీనా, అసదుజ్జమాన్ ఖాన్‌లను అప్పగించడం న్యూఢిల్లీకి తప్పనిసరి బాధ్యత అని పేర్కొంది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడిన వీరిద్దరికీ ఆశ్రయం కల్పించడం స్నేహపూర్వకం కాని చర్యగా పరిగణిస్తామని హెచ్చరించింది. షేక్ హసీనాకు విధించిన మరణశిక్ష తీర్పుపై స్పందించిన భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తాము తీర్పును గమనించామని తెలిపింది. అయినప్పటికీ షేక్ హసీనాను అప్పగించాలనే ఢాకా డిమాండ్‌పై మాత్రం స్పందించలేదు. పొరుగు దేశంగా బంగ్లాదేశ్ ప్రజల ప్రయోజనాల కోసం శాంతి, ప్రజాస్వామ్యం, స్థిరత్వం ఉండేలా చూస్తామని తెలిపింది. ఈ లక్ష్యాలను సాధించడానికి తామను నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తామని స్పష్టం చేసింది. ఒప్పందం ప్రకారం అభ్యర్థనలను సాధారణంగా గౌరవించినప్పటికీ షేక్ హసీనాను బంగ్లాదేశ్‌కు భారత్ అప్పగించే అవకాశం చాలా తక్కువగా ఉందని తెలుస్తోంది. భారత చట్టాలు, ద్వైపాక్షిక ఒప్పందం రెండూ మన దేశానికి చాలా వెసులుబాటును కల్పిస్తున్నాయి. ఒప్పందంలోని ఆర్టికల్ 8 ప్రకారం నిందితుడిపై ఉన్న అభియోగాలు అన్యాయమైనవి లేదా అణచివేతకు గురిచేసేవి అని నిరూపించగలిగితే అప్పగింత అభ్యర్థనను తిరస్కరించే అవకాశం ఉంటుంది. షేక్ హసీనాపై ఉన్న ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవి కావచ్చనే కారణంతో భారత్ ఈ విజ్ఞప్తిని తిరస్కరించే అవకాశం ఉంది. ఆర్టికల్ 6 ప్రకారం హత్య, ఉగ్రవాదం వంటి తీవ్రమైన నేరాలు మినహా రాజకీయ స్వభావం ఉన్న నేరాలకు నిందితులను అప్పగించడాన్ని తిరస్కరించవచ్చు. షేక్ హసీనాపై ఉన్న కొన్ని ఆరోపణలు దీని పరిధిలోకి రాకపోవచ్చని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది.

పరస్పర అప్పగింత ఒప్పందం 1962లోని సెక్షన్ 29 భారత ప్రభుత్వానికి రాజకీయ ప్రేరేపిత అభ్యర్థనలను న్యాయ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న అభ్యర్థనలను తిరస్కరించే అధికారాన్ని ఇస్తుంది.

# ఇవిఎంలలో పోలింగ్‌కు ముందే 25 వేల ఓట్లు

## స్పందించిన ఇసి

**పాట్నా, నవంబరు 18:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌కు ముందే ఈవీఎంలలో 25 వేల ఓట్ల చొప్పున ఓట్లు పడ్డాయన్న ఆర్జేడీ సీనియర్ నేత జగదానంద సింగ్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. ఆయన ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపింది. బీహార్ తీర్పు ప్రజల అభీష్టాన్ని ప్రతిబింబించ లేదని, ఈవీఎంలలో అవకతవకలు జరిగినందున న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం లేకపోలేదని ఆర్జేడీ సోమవారం పేర్కొంది. పోలింగ్ ప్రారంభానికి ముందే ప్రతి ఈవీఎంలలో 25 వేల ఓట్లు పడ్డాయని, అయినప్పటికీ తాము 25 సీట్లు సాధించామని జగదానంద సింగ్ అన్నారు. ఈ ఆరోపణలపై స్పందించిన ఎన్నికల సంఘం, ఇది సాంకేతికంగా అసాధ్యమని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియలో అనుసరించిన నిబంధనల ప్రకారం ఇవి తప్పుడు ఆరోపణలని పేర్కొంది. పోలింగ్‌కు ముందు 25 వేల ఓట్లు ఉండటం అనేది అసాధ్యమని తెలిపింది. ఈవీఎంలకు బ్లూటూత్, ఇంటర్నెట్, ఇతర కనెక్షన్లు ఏవీ ఉండవని గుర్తు చేసింది. బయటి నుంచి ఈవీఎంను యాక్సెస్ చేయడం లేదా డిజిటల్ ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని తెలిపింది. పోలింగ్‌కు ముందు ఈవీఎంలలో ప్రతి అభ్యర్థికి సున్నా ఓట్లు కనిపిస్తాయని తెలిపింది. పార్టీల ఏజెంట్ల సమక్షంలోనే మాక్ పోలింగ్ నిర్వహిస్తారని తెలిపింది. ఆ తర్వాత మాక్ పోల్ ఓట్లను కూడా తొలగిస్తారని వెల్లడించింది. ఈవీఎంల పంపిణీ కూడా ర్యాండమ్‌గా ఉంటుందని, కాబట్టి ఏ ఓటింగ్ యంత్రం ఏ పోలింగ్ కేంద్రానికి వెళుతుందో ఎవరూ చెప్పలేరని స్పష్టం చేసింది. పోలింగ్ ప్రక్రియ ప్రతి దశలో పార్టీల ఏజెంట్లు ఉంటారని తెలిపింది. రెండు విడతల్లోనూ ఆర్జేడీ ఒక్కసారి కూడా అభ్యంతరాలు చెప్పలేదని ఎన్నికల సంఘం తెలిపింది.

# డ్రగ్స్ మాఫియా కట్టడికి సైనిక చర్యలు చేపట్టాల్సిందే



## వెనిజులా, మెక్సికో, కరీబియన్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్, నవంబరు 18:** వెనిజులాతోపాటు మెక్సికో ఇతర సమీపదేశాలు కేంద్రంగా పెచ్చుమీరిన డ్రగ్ దందాలను కట్టడిచేసేందుకు అవసరమైతే సైనిక చర్యలుసైతం ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ హెచ్చరించారు. ఈ డ్రగ్స్‌మాఫియాలవల్లనే నేరాలు, ఘోరాలు పెరిగిపోతున్నాయని ఆయన అన్నారు. అలాగే వెనిజులా కేంద్రంగా కూడా డ్రగ్స్ మాఫియాలు రెచ్చిపోతున్నాయని, అవసరమైతే సైనిక చర్యను ఎంతమాత్రం సందేహించబోమని ఆయన అన్నారు. ఓవల్ ఆఫీసులో మాట్లాడిన ట్రంప్ వెనిజులా, మెక్సికో దేశాలతోపాటు ఇతర కరీబియన్ దేశాల్లో అమెరికా సైనికదళాలు మొహరింపు, వైమానిక విన్యాసాలకు కారణం కేవలం డ్రగ్ అక్రమ రవాణాయేనని ఆయన అన్నారు. డ్రగ్స్‌ను కట్టడిచేసేందుకు మెక్సికోపైనా సైనిక చర్యకు వెనుకాడేది లేదనానన్నరు. అయితే వెనిజులా అధ్యక్షుడు నికొలాస్‌మదురోతో చర్చలు జరిపేందుకు తాను ఏక్షణం అయినా సిద్ధమేనని స్పష్టంచేసారు. అయితే అమెరికాతో సహా మరెవ్వరితోనూ కూడా తాను ముఖాముఖి చర్చలు జరిపేదిలేదని టివిషోలో స్పష్టం చేసారు. అమెరికాలో ఉన్న ఏ ఒక్కరితోనూ తాను చర్చలుజరిపేందుకు ఇష్టంలేదని అన్నారు. అమెరికా తమ ప్రాంతంలో మిలిటరీని మొహరిస్తోందని, ఇపుడు ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లు, అనేక యుద్ధనౌకలు, యుద్ధ విమానాలుఅనేకం వచ్చాయని ఆయన ఆరోపించారు. అయితే ట్రంప్ మాత్రం వెనిజులా అధ్యక్షుడు ఉగ్రవాద డ్రగ్ సిండికేట్‌ను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అయితే నికొలస్ కుటుంబం తీవ్రంగా వనయతిరేకించింది. సెప్టెంబరునుంచి అమెరికా దళాలు అంతర్జాతీయ జలాల్లో వైమానిక దాడులునిర్వహించింది. ఈదాడుల్లో 83 మంది చనిపోయారు. వీరంతా డ్రగ్ అక్రమరవాణా చేస్తున్నట్లు అమెరికా ఆరోపిస్తోంది. అలాగే ట్రినిడాడ్‌లో కూడా అమెరికా నావికాదళాలు మిలిటరీ కవాతులు నిర్వహించాయి. ట్రినిడాడ్‌టొబాగోలో నెలలో రెండుసార్లు కవాతులు చేయడంపై ఆదేశం మండిపడుతోంది.

# ట్రంప్ గాజా శాంతి ప్రణాళికకు భద్రతా మండలి ఆమోదం



**న్యూయార్క్, నవంబరు 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన గాజా శాంతి ప్రణాళికకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఆమోదం తెలిపింది. రెండేళ్లుగా సాగుతున్న ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి ముగింపు పలికేందుకు 20 సూత్రాల ప్రణాళికను డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ బలగాల నియోగం, యుద్ధ విరామం, పునర్నిర్మాణం, పాలనకు మార్గదర్శకాలు ఇందులో ఉన్నాయి. ఈ ఒప్పందంపై ఇజ్రాయెల్-పాలస్తీనా తీవ్రవాద గ్రూపు హమాస్ గత నెల 10న సంతకాలు చేశాయి. ఐక్యరాజ్య సమితిలో సోమవారం జరిగిన ఓటింగ్‌లో అమెరికా, యుకె, ఫ్రాన్స్, సోమాలియా సహా మొత్తం 13 దేశాలు గాజా శాంతి ప్రణాళికకు మద్దతు పలికాయి. వీటో అధికారం ఉన్న రష్యా, చైనా ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. గత నెలలో యుద్ధ విరామం, బందీల విడుదల ఒప్పందంతో ప్రణాళిక మొదటి దశను అమలు చేసిన సంగతి తెలిసిందే. బోర్డ్ ఆఫ్ పీస్ అనే తాత్కాలిక సంస్థను ఏర్పాటు చేసి.. గాజా పునర్నిర్మాణాన్ని పర్యవేక్షించాలన్నది గాజా ప్లాన్ ఉద్దేశం. కాగా, ఈ తీర్మానాన్ని హమాస్ ఖండించింది. ఇది గాజా ప్రజల స్వతంత్రతను హరించడమేనని మండిపడింది. పాలస్తీనా ప్రజల స్వాతంత్ర్యం, స్వయంపాలన హక్కులను ఈ తీర్మానం గౌరవించడం లేదని, ఇక్కడి ప్రజల రాజకీయ ఆకాంక్షలను పక్కనపెట్టి తాత్కాలిక పాలనా సంస్థ పేరుతో ఇతర దేశాల నిర్ణయాలను రుద్దే ప్రయత్నంగా కనిపిస్తున్నదని విమర్శించింది. గాజా భవిష్యత్తును గాజా ప్రజలే నిర్ణయించాలని, విదేశీ బలగాలు, పాలనా సంస్థలు తమ అభిప్రాయాలను రుద్దకూడదని పేర్కొంది. రెండేళ్ల క్రితం ఇజ్రాయెల్‌పై హమాస్ అనూహ్య దాడితో యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపు దాడికి దిగింది. దాదాపు 1,200 మందిని హతమార్చి, 250 మందికిపైగా బందీలుగా చేసుకుంది. హమాస్ దాడికి ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల్లో 67,000 మందికిపైగా పాలస్తీనా పౌరులు మరణించారు. ఇజ్రాయెల్ దాడుల్లో వేలాది ఇళ్లు నేలమట్టం కాగా లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులై టెంట్లలో తలదాచుకుని జీవిస్తున్నారు.

## ఐదు కోర్టు కాంప్లెక్స్‌లు, విద్యాసంస్థలకు బాంబు బెదరింపులు!

**న్యూఢిల్లీ, నవంబరు 18:** ఢిల్లీలో ఐదు కోర్టు కాంప్లెక్స్‌లకు బాంబు బెదింపు ఇమెయిల్స్ వచ్చాయి. దీనితో అన్ని జిల్లాకోర్టుల్లోను బందోబస్తును పెంచారు. అదనపు దళాలను నియమించారు. బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌ప్రుతం అన్ని కోర్టులను తనిఖీలుచేస్తోంది. ముందుగా సాకేత్‌కోర్టు ఆవరణలో తనిఖీలుచేపట్టింది. మధ్యాహ్నం వరకూ ఈ కోర్టులో విచారణలు నిలిపివేసారు. అంతేకాకుండా ఈ కోర్టు ఆవరణలన్నింటినీ హైరిస్క్ ప్రాంతాలుగా ప్రకటించారు. అదనపు బలగాలను తక్షణహే అక్కడకు పంపించారు. జైషే మహ్మద్ పేరిట ఐదు జిల్లా కోర్టులు, పాటియాలా కోర్టు, సాకేత్ కోర్టు, రోహిణి కోర్టు, ద్వారక కోర్టు వీటన్నింటిని బాంబులతో పేల్చివేస్తామని ఈమెయిల్ పంపించారని పోలీసులు చెప్పారు. ఉదయం 11 గంటలకు బాంబులతో పేల్చేస్తామని తమకు వార్నింగ్ వచ్చిందని ఒక న్యాయవాది చెప్పారు. అలాగే లాయర్స్ ఛాంబర్ బ్లాక్‌నుపేల్చివేస్తామని చెప్పడంతో వెంటనే ఖాళీచేయించామన్నారు. జైషే మహ్మద్‌పేరిట ఈ మెయిల్ వచ్చినట్లు నిర్ధారించారు. న్యాయాధికారులు, బార్ అసోసియేషన్‌లకు కూడా ఈ సమాచారం వచ్చింది. తక్షణమే ఆ ప్రాంతాలను ఖాళీ చేయించామని బార్ అసోసియేషన్ తెలిపింది. అలాగే సిఆర్‌పిఎఫ్ స్కూళ్లకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. ద్వారకా, ప్రశాంత్ విహార్‌లలో ఉన్న స్కూళ్లను బాంబులతో పేల్చేస్తామన్నారు.

# నా తల్లిదండ్రుల పరిస్థితిపై దర్యాప్తు చేయండి

## కేంద్రాన్ని కోరిన లాలూ ప్రసాద్ పెద్ద కుమారుడు తేజప్రతాప్ యాదవ్



**పాట్నా, నవంబర్ 18:** బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూప్రసాద్ యాదవ్ కుటుంబంలో చీలికలు ఏర్పడిన విషయం తెలిసిందే ఈ నేపథ్యంలో లాలూ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ తన కుటుంబ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. తేజస్వి యాదవ్ సహాయకులు తమ కుటుంబాన్ని, పార్టీని ముక్కలు చేస్తున్నారని ఆరోపించారు. అటువంటి ద్రోహుల వల్ల తమ తల్లిదండ్రులు కూడా మానసిక వేధింపులకు గురవుతున్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయంపై దర్యాప్తుకు ఆదేశించాలని ప్రధాని నరేంద్ర మోడీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ముఖస్తుతి చేసేవారి కుట్రపూరిత రాజకీయాల వల్ల ఆర్జేడీని బలమైన పార్టీగా మార్చడానికి ఎన్నోఏళ్లు కష్టపడిన వారిని విస్మరిస్తున్నారు. దురాశ, అహంకారంతో విర్రవీగుతున్న తేజస్వీ సహాయకులు నా తల్లిదండ్రులు లాలూప్రసాద్, రబ్రీదేవిలను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు తెలిసింది. నా తండ్రి ఇప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వారు ఒత్తిడిని తట్టుకోలేరు. ఈ విషయంపై దర్యాప్తుకు ఆదేశించాలని ప్రధాని నరేంద్ర మోడీని, కేంద్ర మంత్రి అమిత్ షా, బీహార్ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాను అని తేజ్‌ప్రతాప్ పేర్కొన్నారు. తాను రాజకీయాల నుంచి వైదొలుగుతున్నానని, కుటుంబంతోనూ సంబంధాలను తెంచుకుంటున్నానని లాలూప్రసాద్‌కుమార్తె రోహిణి ఆచార్య ప్రకటించిన విషయం తెలిసిందే. ఆర్జేడీ ఎంపి సంజయ్‌యాదవ్, తేజస్వి మిత్రుడు రమీజ్‌ఖాన్ కారణంగానే పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. అనంతరం లాలూ మరో ముగ్గురు కుమార్తెలు కూడా పాట్నాలోని ఆయన ఇంటి నుంచి ఢిల్లీకి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో తన కుటుంబంలో జరుగుతున్న గొడవలకు తేజస్వీ సహాయకులే కారణమని తేజ్ ప్రతాప్ యాదవ్ ఆరోపిస్తున్నారు. కాగా ఈ విషయంపై లాలూప్రసాద్ స్పందిస్తూ తమ కుటుంబంలోని అంతర్గత విషయాలను తామే పరిష్కరించుకుంటామని వ్యాఖ్యానించారు.

# సంక్షిప్తంగా..

## ఎన్ఐఎ కస్టడీలో 'ఎర్రకోట' నిందితుడు

**న్యూఢిల్లీ, నవంబరు 18:** ఢిల్లీ లాల్‌ఖిలా బాంబు పేలుడులో పాల్గొన్న ఆత్మాహుతి బాంబు ఉమర్‌నబీ సన్నిహితుడు జసీర్ బిలాల్ వానికి ఢిల్లీకోర్టు పదిరోజులు ఎన్ఐఎ కస్టడీకి అనుమతించింది. 15 మంది మృతిచెందిన ఢిల్లీ పేలుడు కేసులో ఉమర్‌నబీకి అత్యంత సన్నిహితంగా బిలాల్‌వాని ఉన్నట్లు ఎన్ఐఎ గుర్తించి అదుపులోకి తీసుకుంది. ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి అంజుబజాజ్ చందనా ఎన్ఐఎ అభ్యర్థనను స్వీకరించింది. నిందితుడిని కస్టడీ విచారణచేసుకోవచ్చని ఆమోదించారు. ఈ విచారణ మొత్తం ఇన్‌కెమేరా వ్యవస్థలో జరిగింది. మీడియాను కూడా అనుమతించలేదు.



పోలీస్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను కోర్టు ఆవరణలో మొహరించారు. ఎలాంటి దాడులు జరిగినా ఎదుర్కొనేందుకు వీలుగా అదనపు దళాలు అక్కడ సిద్ధంగా ఉన్నాయి. జసీర్ ఉమర్‌నబీకి సాంకేతిక సహకారం అందించినట్లు విచారణలో తేలింది.

## బస్సుపై విరిగిపడిన కొండచరియలు, వియత్నాంలో ఆరుగురి మృతి

**హనోయ్, నవంబరు 18:** వియత్నాం ఆర్థిక రాజధాని హోచిమిన్‌లో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు పర్వత మార్గంలో ప్రయాణిస్తున్న బస్సుపై కొండచరియలు విరిగిపడి ఆరుగురు మృతి చెందినట్లు స్థానిక మీడియా పేర్కొంది. మరో 19 మంది గాయపడ్డారు. హోచిమిన్ సిటీ నుంచి 32 మంది ప్రయాణికులతో బయలుదేరిన బస్సు తీరప్రాంత నగరమైన న్హాట్రంగాకు వెళ్తుండగా ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సెంట్రల్ హైల్యాండ్స్‌లోని ఖాహ్ లె పాస్ గుండా పర్వత మార్గంలో ప్రయాణిస్తుండగా కొండచరియలు విరిగిపడి



బస్సు ముందు భాగాన్ని ఢీకొట్టాయి. ఈ ఘటనలో ఆరుగురు మరణించారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు.

## సరిహద్దుల్లోకి చొచ్చుకువచ్చిన 235 పాక్ డ్రోన్లు కూల్చివేత

**చండీఘర్, నవంబరు 18:** పాకిస్తాన్ భారత్ సరిహద్దుల్లోకి చొరబడిన 235 డ్రోన్లను ఈ ఏడాది కూల్చివేసామని సరిహద్దుభద్రతా దళం ఫ్రాంటియర్ అధికారులు వెల్లడించారు. డ్రగ్స్, ఆయుధాలను రవాణాచేస్తున్నట్లుగా గుర్తించిన ఈడ్రోన్లను ఎక్కడికక్కడ కూల్చివేసామన్నారు. సరిహద్దుల్లో స్మగ్లింగ్ కార్యకలాపాలను కట్టడిచేసే నిఘాలో భాగంగానే వీటిని కూల్చివేసామని చెప్పారు. అమృత్‌సర్‌లో మీడియాతో మాట్లాడుతూ బిఎస్ఎఫ్ ఐజి అతుల్ ఫుల్జేలే మంచుకకురిసే రోజుల్లో కొంతమేర దృశ్యవీక్షణం కష్టం అవుతున్నదని అయితే అయినప్పటికీ




స్మగ్లర్ల ఆటలు కట్టడిచేసినట్లు తవె లిపారు. ఇందుకోసం ప్రత్యేక నిఘా సామగ్రిని రప్పించామని, మంచుకురిసే రోజుల్లోకూడా వీటిని వినియోగించవచ్చని ఆయన అన్నారు. అలాగేసరిహద్దుల్లోకి వస్తున్న వ్యక్తులపైనా నిఘా పెంచామన్నారు.

## మరోసారి మోడీని ప్రశంసించిన కాంగ్రెస్ నేత శశిథరూర్

**న్యూఢిల్లీ, నవంబర్ 18:** మోడీ సర్కార్ పట్ల అనుకూల వ్యాఖ్యలు చేస్తూ సొంత పార్టీ నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ మరోసారి ప్రధానిని ప్రశంసించారు. ఢిల్లీలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి తనను ఆహ్వానించారని ఆ కార్యక్రమంలో ప్రధాని మోడీ భారత్ నిర్మాణాత్మక అభివృద్ధి గురించి ప్రసంగించారని అన్నారు. ఎప్పుడూ ఎలక్షన్ మోడ్‌లో ఉంటానని అందరూ అంటారని తన ప్రసంగంలో మోడీ వెల్లడించిన అంశాన్ని థరూర్ గుర్తు చేశారు. కానీ ప్రజల సమస్యల విషయంలో ప్రధాని ఎప్పుడూ ఎమోషనల్ మోడ్‌లో ఉంటారని కితాబిచ్చారు. దేశంలో విద్యపై వలసవాదం ప్రభావం ఏ విధంగా ఉందనే విషయం గురించి మోడీ చెప్పిన మాటలను ఆయన గుర్తు చేసుకున్నారు. వలసవాద ఆలోచనా విధానం నుంచి బయట పడాలంటే భారతదేశ వారసత్వం, భాషలు, విజ్ఞాన వ్యవస్థలను తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరముందని ఆయన చెప్పారన్నారు.

# రేపు సిఎంగా నితీశ్ ప్రమాణం

## - ప్రధాని మోడీ, అమిత్‌షా, కేంద్ర మంత్రులురాక - ఎన్‌డిఎ పాలిత సిఎంలకు ఆహ్వానం
## - ప్రతిపక్ష నేతగా ఉండలేను: తేజస్వి - ఓటమికి నాదే బాధ్యత: ప్రశాంత్ కిశోర్



**పాట్నా, నవంబరు 18:** బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఈ నెల 20వ తేదీ గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. సిఎంగా నితీశ్ బాధ్యతలు చేపట్టడం ఇది పదోసారి. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి పాట్నాలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జెపి నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, ధర్మేంద్ర ప్రధాన్‌తోపాటు పలువురు కేంద్ర మంత్రులు, ఎన్‌డిఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులను ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానించారు. ఇటు మంత్రివర్గ కూర్పుపై ఎన్‌డిఏ నేతలతో సిఎం నితీశ్‌కుమార్ సమాలోచనలు జరుపుతున్నారు. ఆరుగురు ఎమ్మెల్యేలకు ఒక మంత్రి చొప్పున బిజెపికి 15 లేదా 16, జెడియుకు 14, ఎల్‌జెపికి 3, హెచ్‌ఏఎం 1, ఆర్‌ఎల్‌ఎంకు 1 మంత్రి పదవి దక్కనున్నట్లు సమాచారం. జెడియు వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝూ మీడియాతో మాట్లాడుతూ.. "నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని బీహార్ ప్రజలు ఇటీవల ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఆశీర్వదించారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి కృషి చేస్తాం. గురువారం నితీశ్ నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం కొలువుదీరనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ప్రధాని మోడీ, బిజెపి సీనియర్ నాయకులు, కేంద్ర మంత్రులు హాజరవుతున్నారు" అని తెలిపారు. నితీశ్‌తోపాటు ఎంత మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయబోతున్నారని మాత్రం ఖచ్చితంగా చెప్పలేనని సంజయ్ కుమార్ ఝూ తెలిపారు. ఎన్‌డిఏ కూటమిలోని అన్ని పార్టీలకు కేబినెట్‌లో ప్రాతినిధ్యం ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు నేడు జరుగనున్న బిజెపి లెజిస్లేటివ్ పార్టీ నాయకుడి ఎన్నిక కోసం కాషాయ పార్టీ పార్లమెంటరీ బోర్డు కేంద్ర పరిశీలకులను నియమించింది. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి అర్జున్ సఇంగ్, ఉత్తర్‌ప్రదేశ్ డిప్యూటీ సిఎం కేశవ్ ప్రసాద్ మౌర్యలను నియమించింది. అటు కాంగ్రెస్ పార్టీ 43 మంది నేతలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇటీవల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారని, అలాగే పార్టీ నిబంధనలు అతిక్రమించారని తాఖీదులిచ్చింది. ఆర్‌జెడి శాసనసభాపక్ష నేతగా ఎన్నికైన తేజస్వి యాదవ్, ప్రతిపక్ష నేతగా కొనసాగలేనని పార్టీ అధిష్టానానికి తెలియ జేశారు. విపక్ష నేతగా మరో సీనియర్ నాయకుడిని ఎన్నుకోవాలి, ఏకాభిప్రాయంతో నియమించాలని లాలూప్రసాద్‌కు స్పష్టంగా చేసారు.

# ఒడిశా ప్రముఖ గాయకుడు హుమేన్‌సాగర్ కన్నుమూత



**భువనేశ్వర్, నవంబరు 18:** ఒడియాలో ప్రముఖ గాయకుడు హుమేన్‌సాగర్ 35వ ఏట అస్వస్థతతో కన్నుమూసారు. స్థానిక ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న సాగర్ బహుళ అవయవాలు విఫలం చెందడంతో అత్యవసర వార్డులోనే చికిత్స పొందుతూ చనిపోయినట్లు ఎయిమ్స్ వైద్యులు శ్రీకాంత్ బెహెరా వెల్లడించారు. ఈనెల 14వ తేదీ ఎయిమ్స్‌లో చేరారని బైలేటరల్ న్యుమోనియా, అక్యూట్ క్రానిక్ లివర్ ఫైయిల్యూర్, డైలేటెడ్ కార్డియోమైయోపథి, తీవ్రస్థాయి ఎల్వీ సిస్టోలిక్‌డిస్‌ఫంక్షన్, మల్టీ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ సింద్రోమ్ మోడ్స్, రిఫ్రాక్టరీషాక్, తీవ్రస్థాయిలో శ్వాసకోస ఇబ్బందులు, అనూరిక్ అక్యూట్ కిడ్నీ గాయాలు, ఎన్‌సెఫలోపతి, హెపటోపథీ, థ్రంబోసైటోపేనియా, కోగ్యులోపతి వంటి రుగ్మతలు ఆయన్ను చుట్టుముట్టాయి. చికిత్సకు కూడా స్పందించడం లేదని, వ్యాధులు తీవ్రస్థాయికి చేరుకున్నాయని ఆయన వివరించారు. ఆయన్ను అత్యవసర ఐసియులోనే ఉంచి నిపుణులైన వైద్యబృందం ఆయన్ను 24 గంటలపాటు పర్యవేక్షించిందని సోమవారం రాత్రి కన్నుమూసినట్లు తెలిపారు.



ఆలయం రెండో ప్రాకారం డిజైన్

## అమరావతిలో వెంకటేశ్వరస్వామి ఆలయానికి రెండో ప్రాకారం - 27న సిఎం శంకుస్థాపన

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి రాజధాని ప్రాంతం వెంకటపాలెంలో టిటిడి నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయానికి రెండో ప్రాకారం నిర్మించాలని టిటిడి నిర్ణయించింది. ఈ నెల 27న సిఎం చంద్రబాబు చేతుల మీదూ ఈ పనులకు శంఖుస్థానన చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం 11.30 గంటల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. తిరుమల మాదిరిగా ఇక్కడ కూడా రెండో ప్రాకారం రూపుదిద్దుకోనుంది. పడమర,ఉత్తరం, దక్షిణం,దిక్కుల్లో 5 అంతస్థులో గాలి గోపురాలు...తూర్పు వైపున 7 అంతస్థులతో మహా రాజగోపురం నిర్మించనున్నారు. అంతర్భాగంలో మహా రాజగోపురానికి అభిముఖ్యంగా ఆంజనేయ స్వామి ఆలయం,ఉత్స వ మండపం, కోనేరు మొదలైనవి రానున్నాయి. వెంకటపాలెం వెంకటేశ్వరాల యానికి అతి తక్కువ కాలంలోనే విశేష ప్రాచుర్యం లభించింది.ఈ ఆలయానికి శనివారంతో పాటు ఇతర దినాల్లోను వేర్వేరు ప్రాంతాలను భారీగా భక్త జనం తరలివస్తుంటారు.ఆలయంలో స్వామివారి మూలవిరాట్ సందర్శనానికి భక్తులకు టీటీడీ నేరుగా అవకాశం కల్పించింది.

## రెండోఘాట్‌లో ద్విచక్రవాహనదారుడిపై పడిన బండరాయి

తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తోడు మంగళవారం వేకువజాము నుండి బలమైన వర్షం కురవడంతో తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో బండరాయిజారి ద్విచక్రవాహన దారుడిపై పడింది. ప్రమాదవశాత్తు అతను హెల్మెట్ ధరించి ఉండటంతో ప్రాణాలు దక్కాయి. తిరుమలలోని లగేజీ కౌంటర్‌లో బాయ్‌గా పనిచేస్తున్న లోకేశ్(40)గా గుర్తించారు. తిరుపతి నుండి తిరుమలకు విదులకు వెళుతున్న సమయంలో రెండోఘాట్‌లో ఉన్నఫళంగా బండరాయిజారి తలపై పడింది. ఈ సంఘటనతో అతను రోడ్డుపై కుప్ప కూలాడు. తీవ్రరక్తస్రావం కావడంతో అపస్మారకస్థితిలో చేరాడు. తోటి భక్తులు విజిలెన్స్‌కు సమాచారం అందించడంతో 108 అంబులెన్స్‌లో తిరుమల అశ్విని ఆస్పత్రికి తరలించి ప్రథమచికిత్స చేశారు.అనంతరం స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. వర్షం కురుస్తుండటంతో ఘాట్‌లో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అలిపిరి టోల్‌గేట్‌లో విజిలెన్స్ సిబ్బంది జాగ్రత్తలు చేసి పంపుతున్నారు. వర్షం కురుస్తుండటంతో బండరాళ్ళు జారిపడు తున్నాయి.

## రైలు ఢీకొని ఇంజనీరింగ్ విద్యార్థిని మృతి

**కావలి (నెల్లూరు), నవంబర్ 18, ప్రభాతవార్త :** రైలు ఢీకొని పూండ్ల అవిలాష్ రూన్ (19) ఇంజినీరింగ్ విద్యార్థిని మృతి చెందిన సంఘటన కావలి పట్టణంలో జరిగింది.కొండాపురం, మండలం సాయి పేట గ్రామానికి చెందిన పూండ్ల సురేష్, అనిత దంపతుల కుమార్తె పూండ్ల అవిలాష్ రూన్ రైలు ఢీకొని మంగళవారం అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది.జిఆర్పి పోలీసుల, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు అవిలాష్ రూన్ అనే విద్యార్థిని పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం కళాశాల హాస్టల్‌లో ఉంటూ చదువుతుందని తెలియజేశారు. ఇటీవల అనారోగ్య కారణంగా స్వగ్రామం నుంచి కళాశాలకు వచ్చి వెళుతుండదని తెలియజేశారు.మంగళవారం యధావిధిగా వారి గ్రామం నుంచి కళాశాలకు రావడం జరిగిందని తెలియజేశారు. నేడు పరీక్షలు ఉన్నందున రికార్డ్స్ కొరకు రైల్వే ట్రాక్ దాటుకొని వెళుతున్న క్రమంలో కాన్పూర్ నుండి బెంగళూరుకు వెళుతున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్ప్రెస్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందడం దిగిందని తెలియజేశారు.మృతదేహం వద్ద లభించిన ఆధారాలను బట్టి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడం జరిగింది.

## ప్రమాణ స్వీకారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌ను ఆహ్వానించిన నితీశ్‌కుమార్

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ను ఆహ్వానించారు. ఈ నెల 20వ తేదీన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ బిహార్ వెళ్లనున్నారు. పాట్నాలో జరిగే నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఇరువురు నేతలు హాజరుకానున్నారు. బిహార్ ఎన్నికల్లో వి.దీ.తి. తరపున మంత్రి లోకేష్ ఎన్నికల ప్రచారం చేశారు. బిహార్ పారిశ్రామికవేత్తలతో ఏర్పాటు చేసిన పలు సమావేశాల్లో మంత్రి లోకేష్ పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు కార్మికులపై సిఎం చంద్రబాబు వ్యాఖ్యలుఅభ్యంతరకరం: వైఎస్ షర్మిల



**విజయవాడ,నవంబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:** విశాఖ ఉక్కు కార్మికులపై ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరం మని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల తెలిపారు. ఈ వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా ఖండి స్తోందని " ఎక్స్'న వేదికగా చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, ఉక్కు పరిశ్రమ కార్మికులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పెండింగ్ జీతాలు ఇప్పించాలని, ప్రైవేటీకరణ లేదని ప్రధానితో బహిరంగ ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ఎంత ఉత్పత్తికి అంతే వేతనం అంటూ అధికారులు సర్క్యులర్ జారీ చేయడాన్ని షర్మిల తప్పుబట్టారు. 30 వేల మంది కార్మికులను 18 వేలకు కుదించారని, ఉక్కు ఉత్పత్తికి కావాల్సిన ముడి సరుకు తగ్గించారని, 45 రోజుల పాటు సరిపాడా నిల్వ ఉండాల్సిన ముడి సరుకును కేవలం 5 రోజులకు మించి నిల్వలు పెట్టడం లేదన్నారు. ఐరన్ ఓర్ అందక నెలకు వారం రోజులు ఉత్పత్తి ఆపుతున్నారని తెలిపారు. తప్పులన్నీ యాజమాన్యం దగ్గర పెట్టుకుని కార్మికులపై నిందలు మోపడం సరికాదన్నారు. విశాఖ కార్మికులకు సీఎం చంద్రబాబు తీరని అన్యాయం చేయాలనుకుంటున్నారన్నారు. ఆయన మాటలకు విశాఖ స్టీల్స్ జరుగుతున్న దానికి భిన్నమైన పరిస్థితులున్నాయన్నారు.,సీఎం విశాఖ స్టీల్స్ ప్రైవేటీకరణ జరగదంటారు.కేంద్రం మరో విధంగా వ్యవహరిస్తుందన్నారు.ఈ విషయంలో కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ నిరక్ష్యం దూది రైతుకు దుఃఖం తెచ్చి పెట్టింది. ఏపీ ప్రభుత్వం మక్క రైతుల రెక్కలు విరుస్తుందని షర్మిల ఎక్స్‌వేదికలోనే మరో పోస్టింగ్‌లో ఆరోపించారు. మద్దతు ధర లేక రాష్ట్రంలో పత్తి రైతు చిత్తు అవుతుంటే, మొక్కజొన్న రైతు విలవిలలాడుతున్నాడు అన్నారు. మొంతా తుఫాను ధాటికి దిగుబడి తగ్గి రైతు దిగాలు పడుతుంటే.. చేతికొచ్చిన అరకొర పంటకైనా గిట్టుబాటు ధర పెట్టకుండా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోంది అన్నారు. పొలం మీదే పంటలకు రైతులు నిప్పు పెడుతుంటే రైతు సుభిక్షం లాంటి మాటలు చంద్రబాబు గారు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. క్వింటా పత్తికి కనీస మద్దతు ధర రూ.8110 ఉంటే మార్కెట్ లో గరిష్టంగా రూ.7వేలు పెట్టడం లేదు అన్నారు. వర్షాలకు రంగు మారిందని, తేమ ఉందని, పురుగు సోకిందని కొర్రీలు పెట్టడం దుర్మార్గం అన్నారు. ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టీ పత్తి పండిస్తే 6 క్వింటాలు కూడా దిగుబడి రాలేదని అన్నారు మార్కెట్ ధరతో పోల్చితే ఇంకా రూ 10 వేలు నష్టమేనన్న రైతుల బాధలు వర్ణనాతీతం అన్నారు. మొక్కజొన్నలకు కనీస మద్దతు ధర రూ. 2400 ఉండగా మార్కెట్ లో ధర రూ. 1400 కూడా ఇవ్వకపోవడం అన్యాయం అన్నారు. తుఫాను ప్రభావంతో ఎకరాకు దిగుబడి 10 క్వింటాలకు తగ్గితే, రూ.35వేలు పెట్టిన పెట్టుబడికి వచ్చే రాబడి రూ.20వేల కన్నా ఎక్కువ లేకపోవడం ఆందోళనకరం అన్నారు. పత్తి, మొక్కజొన్నే కాదు.. చంద్రబాబు గారి ఏడాదిన్నర పాలనలో ఏ పంటకు మద్దతు ధర లేదు అన్నారు. మిరపకు రూ.12 వేలు మద్దతు ధర ఉంటే రైతుకి దక్కింది రూ.6వేలే అన్నారు. వేరుశెనగకు రూ.8వేలు ఉంటే రైతుకి ఇచ్చింది రూ.4వేలు. కంది పంటకు మద్దతు ధర మీద రూ.2వేలు నష్టం అన్నారు. పెసరకు రూ. 3500 నష్టం. మినుములకు క్వింటాకు రూ. 14 వందల నష్టం. పొగాకు పంట క్వింటాకు రూ.13వేల నష్టానికి, ఉల్లి గడ్డ కిలో 4 రూపాయలకు

# రాజధాని వరద ముంపు నివారణకు రెండో పంపింగ్ స్టేషన్‌కు టెండర్లు

**- 595 కోట్ల వ్యయంతో నిర్మాణం,8,400 క్యూసెక్కుల సామర్థ్యం - కొండవీటి వాగు వరద నీటిని ఎత్తిపోసేందుకు పథకం - గుంటూరు ఛానల్‌పై రెండు వరసల బ్రిడ్జి**

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని వరద నివారణ ప్రణాళికలో భాగంగా రెండో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ)సోమవారం టెండర్ ప్రకటన విడుదల చేసింది. మొత్తం రూ.595 కోట్ల వ్యయంతో(పన్నులతో కలిపి) 8400 క్యూసెక్కుల సామర్థ్యంతో ఈ పంపింగ్ స్టేషన్‌ను నిర్మిస్తారు. ఉండవల్లి వద్ద 2014-19 మధ్య నిర్మించిన మొదటి పంపింగ్ స్టేషన్‌కు పక్కనే దీన్ని నిర్మిస్తారు. పంపింగ్ స్టేషన్‌ను గుత్తేదారు సంస్థే 15 ఏళ్ళ పాటు నిర్వహించేలా టెండర్ నిబంధన రూపొందించారు.ఇప్పుడు కట్టబోయే పంపింగ్ స్టేషన్‌లో ఒక్కొక్కటి 6వేల హార్స్‌పవర్ సామర్థ్యం గల 13 మోటార్లు ఉంటాయి.కొండవీటి వాగు రాజధాని అమరావతి మీదుగా వెళ్ళి ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. అమరావతికి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షంతో పాటు,పాలవాగు వంటి ఇతర చిన్న వాగులు,వంకలు కూడా కొండవీటి వాగులో కలుస్తాయి. కృష్ణా నదికి వరద లేనప్పుడు...కొండవీటి వాగు కూడా ఉధృతంగా ప్రవహిస్తే ఆ నీను కృష్ణానదిలో కలవకుండా వెనక్కి తన్నుతుంది. అలాంటి పరిస్థితి తలెత్తినప్పుడు రాజధాని ప్రాంతం ముంపునకు గురి కాకుండా ఉండేందుకు వరద నివారణ ప్రణాళికను సీఆర్‌డీఏ తయారు చేసింది. కొండవీటి వాగుకు తీవ్ర స్థాయిలో వరద పోటెత్తితే గరిష్టంగా 23 వేల క్యూసెక్కుల జలాలు వస్తాయని అంచనా.వాటిని కృష్ణానది లోకి ఎత్తిపోసేందుకు మూడు పంపింగ్ స్టేషన్లు అవసరమవుతాయని ప్లాన్ చేశారు. ఈ మేరకు మొదటిది ఉండవల్లి వద్ద 5,000క్యూసెక్కుల సామర్థ్యంలో 2019కి ముందే నిర్మించారు. ఇప్పుడు 8,400 క్యూసెక్కుల సామర్థంతో రెండో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. మూడో పంపింగ్ స్టేషన్‌ను వైకుంఠపురం వద్ద 8,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసే సామర్థంతో నిరి మ్మస్తారు.ప్రకాశం బ్యారేజి సమీపంలో కొండవీటి వాగు,గుంటూరు ఛానల్‌పై ప్రస్తుతం ఉన్న బ్రిడ్జికి సమాంతరంగా...రెండు వరసల బ్రిడ్జి,షిప్‌లాక్ నిర్మాణానికి రూ.55.85 కోట్ల అంచనా వ్యయంతో ఏడీసీ టెండర్లు పిలిచింది. కృష్ణా కరకట్ట మీదుగా రాజధాని లోకి రాకపోకలు ప్రస్తుతం ఈ బ్రిడ్జి మీదుగానే సాగుతున్నాయి. కరకట్ట రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించాలన్నది ప్రతిపాదన.దానికి తగ్గటుట్టగా నాలుగు వరుసల బ్రిడ్జిపలు కూడా అవసరం. ఇందులో భాగంగా తొలుత రెండు వరుసల బ్రిడ్జి నిర్మిస్తారు. అది అందుబాటులోకి వచ్చాక... ప్రస్తుతం ఉన్న సన్నటి బ్రిడ్జిని తొలగించి..అక్కడ రెండు వరుసలతో బ్రిడ్జి నిర్మిస్తారు. రాజధానిలో అభివృద్ధి చేస్తున్న కాలువల్లో జల విహారానికి కూడా సీఆర్‌డీఏ ఏర్పాటు చేస్తోంది.రాజధాని లోని కాలువల్లోంచి బోట్లు కృష్ణానదిలోకి వెళ్ళేందుకు వీలు గా..ఇప్పుడు నిర్మించనున్న బ్రిడ్జికి షిప్‌లాక్ ఏర్పాటు చేయనున్నారు.

## మాజీ సిఎం జగన్ అక్రమాలస్తుల కేసు బ్యాంకు గ్యారంటీతో స్థిరాస్తి పత్రాల విడుదల

**విజయవాడ,నవంబరు 18,ప్రభాత వార్తప్రతి నిధి:**వైసిపి అధినేత జగన్ అక్రమాలస్తుల కేసు దర్యాప్తులో భాగంగా సిబిఐ స్థంభింపచేసిన జగతి పబ్లికేషన్స్,ఇందిరా టెలివిజన్ కరెంట్ ఖాతాల నిర్వహణ నిమిత్తం హామీగా సమర్పించిన రేవన్ ఇన్‌ఫ్రాకు చెందిన స్థిరాస్థి పత్రాలను రూ.4.95 కోట్లకు బ్యాంకు గ్యారంటి తీసుకుని విడుదల చేయాలంటూ సిబీఐ కోర్టును తెలంగాణ హైకోర్టు నిన్న ఆదేశించింది. బెంగుళూరు సమీపంలో నల్లూరు లోని రేవన్ ఇన్‌ఫ్రాకు చెందిన రూ.6.30 కోట్ల విలువైన 9 ఎకరాల స్థిరాస్థి పత్రాలకు బదులుగా నింది తులుగా ఉన్న కంపెనీల నుంచి బ్యాంకు గ్యారంటీ తీసుకోవాలని ఆదేశాలిచ్చింది. 2012 లో ఇదే కోర్టు ఆదేశాలతో హామీగా సమర్పించిన రేవన్ ఇన్‌ఫ్రాకు చెందిన మూడు స్థిరాస్థులను విడుదల చేయాలంటూ జగతి పబ్లికేషన్స్,జనని ఇన్‌ఫ్రా,ఇందిరా టెలివిజన్‌లు పిటీషన్లు వేశాయి. వీటిపై జస్టిస్ జె.శ్రీనివాస రావు విచారించారు. పిటీషనర్ల తరపు న్యాయవాది జి.అశోక్‌రెడ్డి వాదిస్తూ తమ ఖాతాలకు రేషన్ ఇన్‌ఫ్రా ఇచ్చిన హామీ ఉపసంహరించుకుంటున్నందున ప్రత్యామ్నా యంగా బ్యాంకు గ్యారంటీ లేదంటే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లను గ్యారంటీగా ఇస్తామన్నారు. సిబీఐ ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదిస్తూ సండూర్ కంపెనీ నుంచి క్లాసిక్ రియాల్టీ,దాన్నుంచి రేవన్ ఇన్‌ఫ్రాకు నిధులు వచ్చాయన్నారు. అందువల్ల ఇది జగన్ అక్రమాస్థుల కేసులో నేరపూరిత సొమ్మేనని,కేసు విచారణ పూర్తయ్యేదాకా ఆస్థుల పత్రాలను విడుదల చేయరాదని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి రేషన ఇన్‌ఫ్రా ఆస్థులకు ప్రత్యామ్నాయంగా పిటీషనర్ కంపెనీలు బ్యాంకు గ్యారంటీ సమర్పిస్తున్నందున దర్యాప్తు సంస్థకు ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. పిటీషనర్ల నుంచి బ్యాంకు గ్యారంటీ తీసుకొని రేవన్ ఇన్‌ఫ్రా స్థిరాస్థి పత్రాలు విడుదల చేయాలని ఆదేశించారు.

## హిడ్మా ఎన్కౌంటర్ పై న్యాయ విచారణ జరిపించాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ

**విజయవాడ, నవంబర్ 18:** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు హిడ్మా, అతని భార్య, మావోయిస్టులను ఎన్కౌంటర్ చేయడంపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కె రామకృష్ణ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో ఈరోజు మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు హిడ్మాను, అతని భార్యతో సహా ఆరుగురిని పోలీసులు ఎన్కౌంటర్ చేసి చంపటం దుర్మార్గం. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టు నేతలు ప్రకటించినప్పటికీ కేంద్రం దమనకాండ కొనసాగించటం గర్హనీయం. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వం చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాల్సింది పోయి, ఎన్కౌంటర్ల పేరుతో నిర్ధాక్షి ణ్యంగా చంపటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆంధ్ర, తెలంగాణ బోర్డర్లో ఈరోజు జరిగిన ఎన్కౌంటర్ పై న్యాయ

## సామాజిక పరిస్థితుల రీత్యా క్రైస్తవ సంఘాలన్ని ఐక్యంగా ఉండాలి : రాష్ట్ర యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నేతలు




ఏపి యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ లోగో ఆవిష్కరణ దృశ్యం

**విజయవాడ,నవంబరు18,ప్రభాతవార్తప్రతినిధి:** సమకాలీన సామాజిక పరిస్థితుల రీత్యా క్రైస్తవ సంఘాలన్ని ఐక్యంగా ఉండాలని ఏపీ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ నేతలు పిలుపునిచ్చారు. పాస్టర్లు, దైవజనులంతా సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.రాష్ట్రంలో తీవ్ర సమస్యగా మారిన క్రైస్తవ స్మశానవాటికలరు స్దలాల కేటాయింపు, రాష్ట్ర ప్రభుత్వ ఆర్దిక సంస్ద నుండి చర్చిల నిర్మాణం, క్రిస్టియన్ సామాజిక భవనాలు నిర్మాణం, జెరుసలేం యాత్ర తదితరాల నిమిత్తం రూ.500కోట్లు ఏడాదికి కేటాయించవలసి ఉందని వారన్నారు.

ఈ దిశలో ఏపీ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ పనిచేస్తుందని స్పష్టం చేసారు.

అర్హత కలిగిన పాస్టర్లుకు ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టర్ల ద్వారా మ్యారేజీ రిజిస్ట్రేషన్ లైసెన్స్ ఇచ్చే విధంగా కృషి చేస్తామన్నారు.ఏపీ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ కాల్‌సెంటర్ 9398185701 ద్వారా పాస్టర్లుకు వైద్యసేవ లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్‌లోగోను నేతలంతా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ఫెలోషిప్ వ్యవస్దాపక అధ్యక్షులు బిషప్ జయప్రకాశ్ గంజికుంట అధ్యక్షత వహించారు.

దహించి అగ్ని మినిస్ట్రీస్(రాజమండ్రి) వ్యవస్దాపకులు డాక్టర్ థామస్,విశిష్ట అతిధులుగా ఎపియుపిఎఫ్ రాష్ట్ర చీఫ్ అడ్వైజర్(క్రిస్టియన్ ఎఫైర్స్) రెవ.పాదర్ ఇన్నయ్య బెల్లంకొండ.స్టేట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ వడ్లమూడి,ఈ కార్యక్రమంలో ఎపియుపిఎఫ్ ఉపాధ్యక్షుడు బిసప్ పి.సుందరరావు,బిషప్ నతానియేల్, ప్రధాన కార్యదర్శి పాస్టర్ ప్రకాశ్, కార్యదర్శి రెవరెండ్ పి.యోహుషవా, కోశాధికారి కె.మోజేస్.ముఖ్య సలహాదారు డాక్టర్ పి.మాణిక్యాలరావు,.రెవరెండ్ డి దేవసహాయం, బ్రదర్ గాంధీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి సర్కిల్ క్యాజువల్ లేబర్ సిబ్బందిని కొనసాగించాలి

### కేంద్ర పురావస్తు శాఖ

**విజయవాడ,నవంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఉమ్మడి కడపలోని గండికోట, సిద్ధవటం, ఒంటిమిట్ట, పుష్పగిరి గ్రూప్ ఆఫ్ టెంపుల్స్, దానవలపాడు, పెద్దముడియం తదితర ప్రాంతాల్లో 11 మంది పనిచేస్తున్నా సర్కిల్ క్యాజువల్ సిబ్బందికి న్యాయస్థానం ఆదేశాల మేరకు 1/30 స్టేటస్ ఇవ్వాలని కేంద్ర పురావస్తు శాఖకు ఆదేశాలు ఇచ్చింది.రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలైన లేపాక్షి ,గండికోట నాగార్జునకొండ, అమరావతి, గండికోట, శాలిగుండం, తదితర ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యదుబీర్ సింగ్ రావత్ కు, కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షె కావత్ కు ఢిల్లీలో మంగళవారం వినతి పత్రాన్ని అందించిన అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు మరియు అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు.రాష్ట్రంలోని ప్రముఖ స్మారకాలు కట్టడాలు అయిన అమరావతి, నాగార్జున కొండ,బ ట్టిప్రోలు, గుంటుపల్లి,గండికోట, లేపాక్షి , గుత్తి కోట, చంద్రగిరి పోర్టు, శాలిగుండం,శంకరం లాంటి ప్రముఖ చారిత్రక

# తిరుమల సమాచారం

## టిటిడి బర్డ్‌ట్రస్ట్‌కు భారీ విరాళం



**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి బర్డ్ ట్రస్ట్‌కు ఓ దాత భారీ విరాళం అందించాడు. మంగళవారం రాత్రి హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ ఛైర్‌పర్సన్ రోషిణినాడార్ బర్డ్ ట్రస్ట్‌కు 2కోట్ల రూపాయలు డిడిని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి ఆలయంలోపల అందజేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో వచ్చే వేసవిలో సద్గమయ



**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** విద్యార్థుల్లో నైతిక విలువలు, మానవీయధర్మాలు వ్యక్తిత్వవికాసం నిర్మాణానికి శిక్షణనిర్వహించేందుకు వచ్చే వేసవిలో సద్గమయ కార్యక్రమం నిర్వహించాలని టిటిడి హిందూ ధర్మప్రచారపరిషత్ కార్యనిర్వాహక కమిటీ నిర్ణయించింది. తెలుగురాష్ట్రాల్లో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈ శిక్షణ నిర్వహించేందుకు నిర్ణయించారు. తిరుమలలో అఖండహరినామసంకీర్తనకు 7,856 భజన బృందాలు రిజిష్టర్ అయ్యాయని, వాటి నైపుణ్యాన్ని పరిశీలించి జిల్లా స్థాయిలో భజనప్రదర్శనలను ఏర్పాటుచేసి వాటినిక్రమ బద్ధీకరించేందుకు నిర్ణయించారు. టిటిడి హిందూ ధర్మప్రచారపరిషత్ కార్యనిర్వాహక కమిటీసమావేశం మంగళవారం సాయంత్రం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌తో కలసి బోర్డు సభ్యులు జానకిదేవి, మహేందర్‌రెడ్డి, హెచ్‌డిపిపి కార్యదర్శి శ్రీరామ్‌రఘునాథ్ పాల్గొన్నారు.

## వడ్డీకాసుల వెంకన్నకు వజ్రాలు పొదిగిన యజ్ఞోపవీతం



**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి ప్రియభక్తుడు వజ్రాలుపొదిగిన బంగారు యజ్ఞోపవీతం బహుకరించారు. నీలోఫర్‌కేఫ్ యజమాని బాబురావు కుటుంబం గతంలో తిరుమలకు వచ్చి ఇష్టదైవాన్ని దర్శించుకున్న సమయంలో సాక్షాత్తు స్వామివారే తనకు యజ్ఞోపవీతం కావాలని కోరినట్లు మనసులో తోచింది. దీంతో దాదాపు కిలో బంగారం ,కోటి రూపాయలు వజ్రాలతో తయారుచేయించిన ఈ అమూల్యమైన విరాళం యజ్ఞోపవీతాన్ని బాబురావు కుటుంబం టిటిడికి అందజేసింది. గతంలో దర్శనానికి వచ్చినపుడు స్వామివారు అడగటం తన భక్తితో ఆ దేవునికి ఇప్పుడు సమర్పించుకోవడం జరిగిందని దాత తెలిపారు. ఆలయ అధికారులు ఈ విరాళాన్ని అందుకున్నారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి : ప్రముఖులు



**తిరుమల,నవంబర్ 18ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రముఖులు ఆకాంక్షించారు. మంగళవారం ఉదయం విఐపి బ్రేక్‌లో తెలంగాణ మంత్రి పొన్నంప్రభాకర్, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, సినీనిర్మాత నాగవంశీ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. జోరువాన కురుస్తున్నా భక్తులు స్వామివారిని దర్శించుకోవడం విశేషం.

## మరింత లోతుగా అప్పన్నకు సిట్ ప్రశ్నలు



**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి కల్తీనెయ్యితో సరిపెట్టుకున్నారని బలమైన ఆరోపణలపై సిబిఐ సిట్ అధికారులు మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పిఎ చిన్నఅప్పన్నను కస్టడీలో విచారణ చేశారు. రెండవరోజు మంగళవారం అలిపిరి సిట్ కార్యాలయం మరికొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టినట్లు తెలిసింది. టిటిడి వ్యవహారాల్లో ఎవరు కలగజేసుకోమన్నారు, నెయ్యి సరఫరా చేసిన డెయిరీలతో పిఎగా నీకు ఎలాంటి అర్హత ఉంది, భారీగా నగదు ఎలా వచ్చింది అనే కోణంలో వివరాలు రాబట్టారని, కొన్నిటికి సమాధానాలు దాటవేశాడనేది తెలుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో నలుగురు ప్రధాన నిందితులు తమిళనాడు ఏఆర్ డెయిరీ ఎండి రాజశేఖరన్, నెయ్యిసరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌లోని పరాగ్‌డెయిరీ,ప్రీమియర్ అగ్రిఫుడ్స్,అల్ఫామిల్క్‌ఫుడ్స్, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబాడైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పెనుబాక)సిఇఒఅపూర్వవినయ్‌కాంత్‌చావ్డాలను సిట్ నాలుగునెలల క్రిందటే అరెస్టుచేసిన విషయం విదితమే. వారినుండి రాబట్టిన కీలక సమాచారంతో అప్పన్న వైవి సుబ్బారెడ్డి చెబితే కల్తీనెయ్యి వ్యవహారంలో తలదూర్చాడనేది సిట్ వద్ద ఆధారాలు. కొందరు టిటిడి మార్కెటింగ్ ,కొనుగోళ్ళ ఉద్యోగులను సిట్ అధికారులు లోతుగా విచారణ సాగించినట్లు తెలిసింది. 2020-24 మధ్య కాలంలో వైవి వ్యవహారాలను చక్కబెట్టడం, లావాదేవీలు,ఆర్థికపరమైన అంశాల్లో కీలకంగా వ్యవహరిచాడనేది సిట్ వద్ద ఉన్న సమాచారం. దానిమేరకు ఇప్పుడు పలుకోణాల్లో విచారణలో కొన్ని వాటికి సమాధానం చెప్పడంలేదనేది తెలిసింది. అప్పన్న ఖాతాలో పెద్దమొత్తంలో ఆర్థికలావాదేవీలపై ప్రధానంగా దృష్టి సారించింది. కల్తీనెయ్యి కొనుగోలుచేసిన వ్యవహారంలో ప్రస్తుతం మాజీలుగా ఉన్న టిటిడిలో పనిచేసిన కీలక నేతలు, అధికారులను నేటి నుండి విచారణ చేయనుంది. త్వరలోనే సిట్ అధికారులు గత బోర్డులో కొనుగోళ్ళకమిటీ సభ్యులను విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది.సిబిఐ డిఐజి మురళీరాంభా నేతృత్వంలోని తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, డిఎస్పీలు, సిఐలు అసలు సూత్రధారులను పట్టుకునే దిశగా సిద్ధమవుతున్నారు. త్వరలోనే ఈ కేసు క్లైమాక్స్‌కు తీసుకురానున్నారు.

## కేసులోని వారందరికీ భద్రత కల్పించాలి

### పరకామణి కేసులో హైకోర్టు కీలక ఆదేశాలు

**తిరుమల,నవంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** సంచలనం కలిగించిన తిరుమల పరకామణి భవనంలో చోరీ కేసు విచారణ తుదిదశకు చేరుకోవడంతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి విచారణకు హాజరై రెండోసారి విచారణకు వస్తున్న పూర్వ ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయాన్ని న్యాయస్థానం పరిగణనలోనికి తీసుకుంది. ఈ కేసులో నిందితులు, సాక్షుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేసులో కీలకనిందితుడు రవికుమార్‌తో బాటు సాక్షులు అందరికీ పూర్తిస్థాయి భద్రత కల్పించాలని రాష్ట్ర సిఐడి డిజి రవిశంకర్‌అయ్యన్నార్‌ను మంగళవారం ఆదేశించింది. కేసు విచారణ ముగిసేంత వరకు వారికి ఎలాంటి హానికలగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. విచారణ సమయంలో కూడా అనవసర ఇబ్బందులు తలెత్తకుండా ,సాక్షుల భద్రతకు ప్రాధన్యాతనివ్వాలని సూచించింది. పరకామణి చోరీ కేసు విచారణ వేగంగా సాగుతున్న సమయంలో ఇటీవల పూర్వ ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ అసహజంగా మరణించడం తీవ్ర కలకలం రేపింది. మొదట అనుమానాస్పదమృతిగా కేసు చూసినా ఆ తరువాత హత్యగా నమోదైంది. ఈ పరిణామాల నేపథ్యంలో సాక్షుల భద్రతకు ప్రాధాన్యత నివ్వాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిం.ది తదుపరి డిసెంబర్ 2వతేదీకి విచారణ వాయిదా వేసింది. ఇప్పటికే సిఐడి అధికారులు ఈ కేసులో దర్యాప్తును కూడా హైకోర్టుకు తెలిపినట్లు తెలిసింది.



# శ్రీధనమ్మతల్లి ఆలయం వద్ద ఘనంగా కోటి దీపాల మహోత్సవం



**కాకినాడ రూరల్, నవంబర్ 18 ( ప్రభాతవార్త ) :**

కార్తీక మాసం పురస్కరించుకుని జగన్నాధపురం 17వ డివిజన్ కోటి స్తంభంపేటలో వేంచేసియున్న శ్రీధనమ్మతల్లి గుడి వద్ద సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోటి దీపాల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి బడే వెంకట కృష్ణ ఆధ్వర్యంలో నిర్వ హించిన కోటి దీపాల మహోత్సవ కార్యక్రమానికి సానా సతీష్ బాబు ఫౌండే షన్ చైర్మన్ హరీష్ స్పోర్ట్స్ అధినేత తలాటం హరీస్ ముఖ్యఅతిధిగా పాల్గొని శ్రీధనమ్మతల్లి అమ్మ వారిని దర్శించి ప్రత్యేక పూజలు చేసారు.అనంతరం వేదపండితులు వేదాశీర్వ చనం అందించగా బడే వెంకటకృష్ణ అమ్మవారి కండువా వేసి ఘనంగా సత్కరించారు.అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ తలాటం హరీష్ కోటి దీపాల మహోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంబించారు. ఈసందర్భంగా తలాటం హరీష్ మాట్లాడుతూ ప్రతిఏటా కార్తీక మాసం ఆఖరి సోమ వారం దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ సభ్యులు పిడకా శేషు, రామశేషు, పినిశెట్టి సురేష్, సతీష్, , తెలప్పల సత్తిబాబు, మల్లాడి రామలక్ష్మణ్, సూరాడ శ్రీకాంత్, చోడిపల్లి తాతాజీ, సూరాడ తాతాజీ, సురేష్, శిరీషా, అప్పారావు పెద్ద సంఖ్యలో అమ్మ వారి భక్తులు పాల్గొన్నారు.

# పిఠాపురం శాఖా గ్రంథాలయంలో అలరించిన దేశభక్తి గేయాల పాటలు



**పిఠాపురం , నవంబర్ 18 ( ప్రభాతవార్త ) :**

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఐదవ రోజు పిఠాపురం శాఖ గ్రంథాలయంలో దేశభక్తి గేయాలు పాటలు పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలకు న్యాయ నిర్ణయితలుగా ఆర్. ఆర్. బి. హెచ్. ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సంస్కృత అధ్యాపకులు పి . రామచంద్ర రావు మరియు ప్రముఖ సంగీత ఉపాధ్యాయులు డాక్టర్ ఎస్. చక్రవర్తి వ్యాపారించడం జరిగింది. అనంతరం రామచంద్ర రావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశం పట్ల, భారత మాత పట్ల భక్తి, విశ్వాసాలు కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరు దేశానికి మనం ఏమి ఇస్తున్నామనే ఆలోచనలు ఉండాలని, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో పుట్టినందుకు ప్రతి ఒక్కరు గర్వపడాలి అని తెలిపారు, తదుపరి పిఠాపురం పట్టణంలో గల వివిధ పాఠశాలల విద్యార్థులు దేశభక్తి గేయాలను పాడి తమ ప్రతిభను చాటుకున్నారు, ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్, వెంకట రాము, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**కొత్తపేట, నవంబర్ 18 ( ప్రభాతవార్త ) :**

: కొత్తపేట ప్రధాన పంట కాలువ లోమంగళవారం, ర్యాలీ నుంచి పలివెల మీదుగా అమలాపురం వైపుగా పోవు ప్రదాన పంట కాలువలో కొత్తపేట మండలం గోగివారి పేట వంతెన దగ్గరలో సుమారు 40 – 45 సంవత్సరాలు వయస్సు కలిగిన గుర్తుతెలియని మగ వ్యక్తి శవము కొట్టుకు వచ్చినది. అతని కుడి చేతిపై అనంతపవన్ కుమార్ అని పచ్చబొట్టు వ్రాయబడి ఉన్నది. చనిపోయిన వ్యక్తి నీలం రంగు పై బిస్కెట్ కలర్ గళ్ళు కలిగిన చొక్కా మరియు బిస్కెట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. జుట్టు నల్లగా గడ్డం మెరిసి ఉన్నాడు.ప్రస్తుతం శవము కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి నందు మార్చురీలో భద్రపరచబడి ఉన్నది. ఆచూకీ తెలిసినవారు 9440904842,9440796527 నెంబర్లకు ఫోన్ చేసి, సమాచారము అందించగలరని ఎస్సై తెలిపారు.

# హార్వెస్టర్ల కొరతతో నిలిచిపోయిన వరికోతలు



**యు.కొత్తపల్లి, నవంబర్ 18 ( ప్రభాతవార్త )**

కోతదశకు చేరుకున్న వరిపంటను కోయడానికి తగినన్ని హార్వెస్టర్లు (వరికోత యంత్రాలు) అందుబాటులో లేకపోవడంతో వరికోతలు ఆలస్యం అవుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మోంథా తుఫాను ప్రభావంతో పంటలు దెబ్బ తిన్నాయి. మిగిలిన పంటయినా దక్కుతుందో లేదోనంటూ ఎదురు చూస్తున్నారు. మండలంలోని ఉన్న 18గ్రామాలతో పాటు శివారు గ్రామాల్లో వరిపంట అధికంగా సాగవుతుంది. మోంథా తుఫాను ప్రభావంతో అన్ని గ్రామాల్లో వరిపంట కోతలు అలస్యం అయ్యాయి. వరి కోతలు ఒకేసారి ప్రారంభమవడంతో యంత్రాలు తగినన్ని లభించక రైతులు వాటికోసం ఎదురు చూస్తున్నారు.

దీంతో హార్వెస్టర్లకు డిమాండ్ పెరగడంతో కోత రేటు పెంచేసారంటూ రైతులు వాపోతున్నారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి జోగిరాజును వివరణ కోరగా ఇటీవల సంభవించిన మోంథా తుఫాను కారణంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వరికోతలు ఒకేసారి ప్రారంభమయ్యాయి. దీంతో హార్వెస్టర్ల కొరత రావడం జరిగింది. హార్వెస్టర్ల యజమానులతో చర్చించడం జరిగింది. ఒకటి, రెండు రోజుల్లో తగినన్ని హార్వెస్టర్లు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వాడపల్లి దేవస్థానం అభివృద్ధి పనులు
# పరిశీలించిన ఆర్డీవో పి. శ్రీకర్, డిప్యూటీ కమిషనర్ చక్రధరరావు



**ఆత్రేయపురం, నవంబర్ 18 ( ప్రభాతవార్త )**

ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిలుతున్న కోనసీమ తిరుమలగా వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం. మంగళవారం వేలాది మంది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడువారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ, పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారి దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఆలయం నందు జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆర్డీవో పి శ్రీకర్, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు తో కలిసి మంగళవారం పరిశీలించారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణం, కోనేరు అభివృద్ధి పనులతో పాటుగా క్యూ లైన్ల ఏర్పాటు పరిశీలించడంతో పాటుగా, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కోసం స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి కే ఎస్ ఎస్ వెంకటరామన్, తహసీల్దార్ టి ఆర్ రాజేశ్వరావు ఆలయ ఇంజనీరింగ్ అధికారులు, ఆర్టీసీ డిఎం వై.వి.వి.ఎన్. కుమార్, ఆర్ ఐ.ఎం. భాను, పాలూరి సత్యానందం, రెవెన్యూ సిబ్బంది, టెంపుల్ ఇన్స్పెక్టర్, వై, శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు నందీశ్వ రుడు ,కనకయ్య, ప్రసాద్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

# ఐదు సెంట్లు స్థలాన్ని విలేజ్ హెల్త్
# క్లినిక్ నిర్మాణానికి దానం..దాతలను అభినందించిన గ్రామస్తులు



**ఆత్రేయపురం, నవంబర్ 18 ( ప్రభాతవార్త ) :**

విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ నిర్మాణం కోసం 5-1/2 సెంట్ల స్థలాన్ని దానంచేసిన దాతలను పలువురు అభినందించారు. నంబూరి ఎర్రతాత రాజు జ్ఞాపకార్థం వారి కుమారుడు సూర్యనారాయణ రాజు వారి జ్ఞాపకార్థం వారి కుమారులు యం.వి.ఎస్.ఎస్.ఎన్. రాజు (దొర మాస్టారు) ఎన్.వి. సుబ్బరాజు (శ్రీను) నంబూరి అప్పలరాజు (చిన్నదొర) వారు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, బి కె ఎస్ ఎస్ వెంకట రామన్ సొసైటీ అధ్యక్షులు తోటకూర సుబ్బరాజు, మాజీ సర్పంచ్ ఉర్రింకల త్రిమూర్తులు వారి సమక్షంలో మంగళవారం ఐదు సెంట్లు స్థలాన్ని ఉచ్చిలి గ్రామ పంచాయితీ కి విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి దానం చేశారు. గ్రామ పంచాయితీ వారు, గ్రామ ప్రజలు ఈ దాతృత్వాన్ని హర్షాతిరేకాలతో స్వాగతించి గ్రామ అభ్యున్నతికి చేసిన ఈ సేవను కొనియాడారు.

# భారతదేశం అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర ఎంతో ఉంది

## 72వ అఖిల భారత సహకార సంఘాల వారోత్సవ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి



**అంబాజీపేట, నవంబర్ 18 ( ప్రభాతవార్త ) :**

భారతదేశం అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర ఎంతో ఉందని,120 ఏళ్ళ క్రితం బ్రిటిష్ కాలంలో ఏర్పడిన సహకార వ్యవస్థ నేటికీ నిర్వి రామంగా కొనసాగడానికి కారణం రైతులేనన్నారు. అంబాజీపేట వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో సంఘ చైర్మన్ అరిగెల సూర్యనారాయణమూర్తి (సూరిబాబు) అధ్యక్షతన అఖిలభారత 72వ సహకార వారోత్సవ సభ మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో ఎంతో సారవంతమైన భూమి ఉందని, ఏ కాలంలోనైనా ఏ పంట వేసినా పండుతుందని, దానికి కావలసింది కేవలం సాగునీరేనన్నారు. రైతుల కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘాలు రైతుల సహకారంతోనే అభివృద్ధి చెందుతుందన్నారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఆదేశాలతో పి.గన్నవరం నియోజకవర్గంలో ఉన్న 26 సహకార సంఘాలకు పారదర్శకంగా ఎంపిక చేసిన త్రిసభ్య కమిటీ చైర్ పర్సన్ లను నియమించానని, వారు అంతే నిజాయితీగా రైతులకు సేవలందించాలన్నారు. రైతులు చెల్లించే షేర్ క్యాపిటల్ గురించి శాసనసభలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. నియోజవర్గ టిడిపి కో-ఆర్డినేటర్లు మోకా ఆనందసాగర్, దాసరి వీర వెంకట సత్యనారాయణలు మాట్లాడారు. అలాగే జిల్లా సహకార అధికారి ఎ. రాధాకృష్ణారావు,జిల్లా ఆడిట్ అధికారి డి.విజయలక్ష్మి, ఆర్డీసీఎల్ ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసరావు లు సహకార సంఘాల బలోపేతం,రుణాల మంజూరు, సంఘాల ద్వారా నిర్వహించే వ్యాపారాలు గురించి వివరించారు. అంతకుముందు సహకార జెండాను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆవిష్కరించి, సహకార ప్రతిజ్ఞను చేశారు. అనంతరం ముఖ్య అతిథులను సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార వారోత్సవాల అధికారి ఆదిమూలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఈవో కుంపట్ల అయ్యప్ప నాయుడు, డైరెక్టర్లు ఉందుర్తి సత్యనారాయణ, పితాని వెంకట సత్యప్రసాద్, డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ బి. నాగేశ్వరరావు,రాష్ట్ర కార్పోరేషన్ల డైరెక్టర్లు శిరిగినీడి వెంకటేశ్వరరావు ,మట్టపర్తి బాల భారతి, సర్పంచి నాగాబత్తుల శాంతకుమారి, ఏఎంసి వైస్ చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ, రైతులు ముత్యాల జమ్మిలు, కొర్లపాటి కోటబాబు, కొర్లపాటి గోపి,పత్తి దత్తుడు, మైపాల తాతాజీ, నాగాబత్తుల సుబ్బారావు,దొమ్మేటి సాయి కృష్ణ, శీలం మోహన్రావు, పితాని వెంకటేశ్వరరావు, వివిధ సొసైటీల చైర్మన్లు పాల్గొన్నారు.

# కార్తికేయునికి నక్షత్ర హారతి



**శంఖవరం, నవంబర్ 18 ( ప్రభాతవార్త )**

మండలంలోని కత్తిపూడిలో పంతం వారి మెట్టపై కొలువైన శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కార్తికేయునికి నక్షత్ర హారతి ఘనంగా నిర్వహించారు. కార్తికేయునికి ప్రీతికరమైన మంగళ వారం పురస్కరించుకొని ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించి, విశేష అలంకరణ చేపట్టారు. సాయంత్రం ఆలయ ఆవరణలో గల ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీప పూజలను ఆలయ నిర్వహించారు. అనంతరం పురోహితులు సత్యనారాయణ శర్మ త్రినాధ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు గావించి, నక్షత్ర హారతి ఇచ్చారు. నక్షత్ర హారతుల వెలుగులో స్వామివారు బంగారు వర్ణంలో దేదీప్యమానంగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని స్వామివారి దర్శించుకున్నారు. స్వామి వారి నిజరూపంగా భావించే పాము ఆలయ ఆవరణలో సంచరించారు గత కొన్ని సంవత్సరాలుగా సుబ్రమణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి ముందు ఆలయంలో స్వామివారు సంచరించడం జరుగుతుందని, ఆలయ పురోహితులు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్



**అమలాపురం టౌన్, నవంబర్ 18 ( ప్రభాతవార్త )**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజల నుండి ఇంటి స్థలములు, హౌసింగ్ లోన్లు, పింఛన్లు, రోడ్లు, డ్రైన్లు స్మశానవాటికల అభివృద్ధి పనులకు సంబంధించిన 115 వినతులను ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నందు స్వీకరించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## ఆఖరికి గింజ వరకు కొనుగోలు చేస్తాం : ఎమ్మెల్యే గిడ్డి



**అంబాజీపేట, నవంబర్ 18 ( ప్రభాతవార్త ) :**

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వరి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని చిరతపూడి సొసైటీ కార్యాలయం వద్ద రైతు సేవా కేంద్రం ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రమును ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుండి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాలో డబ్బు జమవుతుందన్నారు. ధాన్యం సేకరణ పారదర్శకంగా చేపడతామని, కొనుగోలు ప్రక్రియలో దళారులకు ఎటువంటి అవకాశం ఇవ్వబోమని తెలిపారు. రైతు ప్రయోజనాలే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సత్యనారాయణ చెప్పారు. అనంతరం సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్ పర్సన్ రంపం సత్యనారాయణ,సభ్యులు బండారు కామరాజు,కొత్తలంక సుబ్బారావు, సీఈవో పెచ్చెట్టి నారాయణమూర్తి, నియోజవర్గ టిడిపి కో-ఆర్డినేటర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, సర్పంచి కోట బేబీరాణి,వైస్ ఎంపీపీ నేతలు నాగరాజు, కూటమి నాయకులు అయ్యగారి సూరిబాబు,రంపం వీరభద్రరావు,బొడ్డు రాంబాబు, సరెళ్ల వెంకటేశ్వర్లు, పేరాబత్తుల సుబ్బరాజు, మండల వ్యవసాయ అధికారి ఎం.ధర్మ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కార్తిక వన సమారాధనలు ఐక్యతను చాటుతాయి



**అంబాజీపేట, నవంబర్ 18 ( ప్రభాతవార్త ) :**

కార్తీక వనసమారాధనలు ఐక్యతను చాటుతాయని అమలాపురం తాలూకా రజక సంఘ అధ్యక్షులు పేట ఏడుకొండలు, అంబాజీపేట మండల అధ్యక్షులు నేదునూరి కళ్యాణ్, టిడిపి నాయకురాలు పులపర్తి సుజాత లు అన్నారు. గంగలకుర్రు రజక నగర్ రామాలయం వద్ద కార్తీక వనభోజనాలను మంగళవారం నిర్వహించారు. తొలుత దామోదర, శ్రీ రమా సత్యనారాయణ స్వామి వార్లకు ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు, చిన్నారులు వివిధ పోటీలు, ఆట పాటలతో ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో గ్రామ రజక సంఘం అధ్యక్షులు అధికారపు శ్రీనివాసరావు, పసుపులేటి రాము, అధికారపు బాజ్జి, కమిడి అబ్బు,కుళ్ల పనసరామయ్య, నేదునూరు గురుప్రసాద్, అధికారపు గురుప్రసాద్, ఉప్పలగుప్తం సురేష్, దాసరి శ్రీను, ఓలేటి వెంకటరావు, కాగితాపల్లి సాయిరామ్, కాగితాపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# చించినాడ బ్రిడ్జిపై నుండి గోదావరిలో దూకి ఆత్మహత్య


## మూడు మృతదేహాలు లభ్యం..లక్కవరంలో విషాదఛాయలు




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, నవంబర్ 18 (ప్రభాతవార్త ) :**

ఏం జరిగిందో ఏమో ఎంతో భవిష్యత్తు ఉన్న తన ఇద్దరు పిల్లలతో సహా గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడో వ్యక్తి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మల్కిపురం మండలం లక్కవరం గ్రామానికి చెందిన శిరిగినీడి దుర్గాప్రసాద్ (43) ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడని తెలిపారు. వ్యాపారంలో వచ్చిన నష్టాలో ఏమో తెలియదు గానీ జీవితంపై విరక్తి చెంది తనతో పాటు కుమార్డు మోహిత్ (14), కుమార్తె చిట్టి (11)లను అనంత లోకాలకు తీసుకుపోయాడు. సోమవారం సాయంత్రం సమయంలో ఆధార్ కార్డులు అప్డేట్ చేయించే నిమిత్తం తన మోటార్ సైకిల్ పై ఇద్దరు పిల్లలను ఎక్కించుకొని ఇంటి నుండి వెళ్లినట్లు సమాచారం. చించినాడ బ్రిడ్జి పై దుర్గాప్రసాద్ మోటార్ సైకిల్ తో పాటు, ముగ్గురి పాదరక్షలు అక్కడ ఉండడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేశారు. మోటార్ సైకిల్ కవర్లో దుర్గాప్రసాద్ పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఫోన్ నెంబర్ కలిగిన కాగితం లభించడంతో వారే నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు భావించారు. మంగళవారం ముగ్గురి మృతదేహాలు లభ్యమైనట్లు సమాచారం. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. దీంతో లక్కవరం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# కోనలో వైభవంగా నృసింహుని స్వర్ణ గరుడోత్సవ సేవ



రాపూరు(నెల్లూరు), నవంబరు 18, ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారికి మంగళవారం స్వర్ణ గరుడోత్సవ సేవ నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా తెల్లవారుజామున స్వామి వారి మూల మూర్తికి అభిషేకం, చందనాలంకారం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు స్వామి వారికిశాంతి హోమం నిర్వహించిన అనంతరం స్వామి వారి నిత్యకళ్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి అత్యంత ప్రీతిప్రాతమైన స్వర్ణ గరుడవాహనంపై వుంచి స్వామివారికి క్షేత్రోత్సవం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, గిరిజన వాయిద్యాల మధ్య నిర్వహించిన స్వామివారి స్వర్ణ గరుడవాహన క్షేత్రోత్సవంలోపెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావల్సిన భోజన, వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకట సుబ్బయ్య, తదితరులున్నారు. స్వామి వారి పూజా కార్య క్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు గుండ్లూరు శశి స్వామి, మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.





# జలసంరక్షణలో ఎపికి జాతీయ అవార్డులు

**కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా అవార్డులందుకున్న నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు**

## నీటి సంరక్షణలో నెల్లూరు టాప్

నెల్లూరు, నవంబరు 18 ప్రభాతవార్త: దేశ స్థాయిలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రత్యేక గుర్తింపు పొందింది. జల్ సంచయ్ జన్ భగీదారీ కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాల పెంపుతో పాటు జల సంరక్షణలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నేతృత్వంలో అధికారుల పనితీరుకు జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని కూడా అవార్డు స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. నీటి సంరక్షణ కార్యక్రమాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చిన నెల్లూరు జిల్లాకు దేశ స్థాయిలో జల్ సంచయ్ జన్ భగీదారి 1.0 జాతీయస్థాయి అవార్డు లభించింది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకమైన జల్ సంచయ్ జన్ భగీదారీ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేసినందుకు, నీటి భద్రతతో కూడిన భవిష్యత్తు కోసం నీటి సంరక్షణ సమర్థవంతంగా అమలు చేసిన నేపథ్యంలో సౌత్ జోన్‌లో జిల్లాకు ఈ పురస్కారం లభించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో నెల్లూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద ఫారం పాండ్లు 856, ఇంకుడు గుంటలు 3,495, ఊట చెరువులు 112, చెక్ డ్యామ్‌లు 166, డగౌట్ పాండ్లు, వాటర్ హార్వెస్టింగ్ పాండ్లు 512, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు 54, రింగ్ ట్రెంచులు 12, సరిహద్దు కందకాలు 34, నీటి నిల్వ కందకాలు 14, చెరువుల పూడికతీత పనులు 247, మొత్తం 5,502 భూగర్భ జలాల రీఛార్జ్ పనులు చేపట్టడం ద్వారా ఈ అవార్డును సాధించారు. జల్ సంచయ్ జన్ భగీదారి అంటే ప్రభుత్వ యంత్రాంగం సమష్టిగా పనిచేసి ప్రతి నీటి చుక్కను సంరక్షించడం, భవిష్యత్తు తరాల కోసం నీటి భద్రతను కాపాడడానికి నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యంగా జరిగిన ఈ కార్యక్రమాల ద్వారా వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జ్, నీటి కొరత నివారణ, ప్రజల్లో నీటి ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించడం జరిగింది.

## వాటర్ షెడ్ పనుల్లో ప్రకాశం భేష్

ఒంగోలు, నవంబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి: వాన నీటిని ఒడిసిపట్టడములో జిల్లా యంత్రాంగం చేసిన కృషి ఫలించింది. అడుగంటిన భూగర్భ నీటి మట్టాన్ని తిరిగి ఆశవాహస్థితికి తీసుకురావడంలో సఫలీకృతమైంది. ఏకంగా కేంద్ర ప్రభుత్వమే మెచ్చి... ప్రశంసా పత్రం ఇచ్చి... శభాష్ అంటూ వెన్నుతట్టి అభినందించింది. ఔను... వాటర్ షెడ్ పనులలో భాగంగా ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో చేపట్టిన నీటి సంరక్షణ పనులకు కేంద్ర జలశక్తి శాఖ మురిసిపోయింది. జిల్లా యంత్రాంగం చేసిన కృషికి గుర్తింపుగా ద్వితీయ జాతీయ ఉత్తమ నీటి పురస్కారం అవార్డును ప్రకటించింది. మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఈ అవార్డు అందుకున్నారు. ఆరవ జాతీయ ఉత్తమ జల పంచాయతీ అవార్డుకు కనిగిరి నియోజకవర్గం, పెదచెర్లోపల్లి మండలం, మురుగమ్మి గ్రామ పంచాయతీ ఎంపికైంది. 2022- 23 సంవత్సరంలో జిల్లాలో డ్వామా ఆధ్వర్యంలో వాటర్ షెడ్ పథకంలో భాగంగా నీటి సంరక్షణ పనులను చేపట్టారు. ఉత్తమ నీటి యాజమాన్య పద్ధతులు పాటించారు. ఇందులో భాగంగా రిడ్జ్ టు వ్యాలీ విధానంలో వివిధ రకాలైన సహజ వనరుల యాజమాన్యపు పనులు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టడంలో మరియు భూగర్భ జలమట్టాలను పెంపొందించడంలో ఉత్తమ పద్ధతులను పాటించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూన్ నెలలో కేంద్ర బృందం వచ్చి క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించింది. భౌగోళికంగా భిన్న పరిస్థితులు ఉన్న ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నీటి సంరక్షణ పనులలో సాధించిన పురోగతిని అభినందిస్తూ జిల్లాకు జాతీయస్థాయిలో రెండో ఉత్తమ పురస్కారాన్ని ప్రకటించింది. జిల్లా కలెక్టరుకు ఒక ట్రోఫీ, ప్రశంసాపత్రం, రూ.1.5 లక్షల నగదును అందించింది. ఈ పథకం అమలులో జిల్లాకు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చేలా పనులను పర్యవేక్షించిన డ్వామా పిడి జోసెఫ్ కుమారును కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, వివిధ శాఖల ఉన్నతాధికారులు అభినందించారు.

# నేడు కడప జిల్లాకు సిఎం చంద్రబాబు

- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



పెండ్లిమర్రి, నవంబరు 18, ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 19న కడప జిల్లా పర్యటన సందర్భంగా మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, అధికారులతో కలిసి పెండ్లిమర్రి మండలంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకంలో 194047 మంది రైతులకు రూ.131.37 కోట్ల లబ్ధి మొత్తాన్ని రైతులకు పంపిణీ చేసి రచ్చబండ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంపిక చేసిన పలు ప్రాంతాలను మంత్రి, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరు పరిశీలించారు. చిన్నదాసరిపల్లె పంట పొలాలు, భైరవ గుట్ట వద్ద ఏర్పాటు చేసే రచ్చబండ కార్యక్రమం, వెల్లటూరులోని గ్రోమోర్ ఫర్టిలైజర్, సీడ్స్ ఫెస్టిసైడ్ సెంటర్‌ను, వెల్లటూరులోని పీఎం జడ్పీ హైస్కూలు ప్రాంగణంలో హెలీప్యాడ్ ఏర్పాట్లను మరియు పనులను పరిశీలించి అధికారులకు సూచనలను మంత్రి చేశారు. భద్రతా ఏర్పాట్లపై జిల్లా పోలీసు యంత్రాంగం, సిఎంఒ భద్రతా అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ కృపాదాస్, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రా నాయక్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సతీష్‌కుమార్, డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు ఆదిశేషారెడ్డి, రాజ్యలక్ష్మి, కిరణ్‌కుమార్ నాయకులు పుత్తా నరసింహారెడ్డి, రెడ్డప్పగారి శ్రీనివాసులురెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎండిఎంఎ కేసులో కీలక పరిణామం వైఎస్సార్సీ నేత కొండారెడ్డి ప్రమేయం?

విజయవాడ, నవంబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి: ఎండీఎంఏ కేసులో అరెస్టు అయి నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న లోహిత్ యాదవ్‌ను మాచవరం పోలీసులు విచారించినట్లు కీలక సమాచారం. వైఎస్సార్సీపీ నేత కొండారెడ్డి, మరికొంత మంది కలిసి తరచూ డ్రగ్స్, మత్తు పదార్థాలను తీసుకునే వాళ్లమని లోహిత్ వెల్లడించాడు అని పోలీసుల వర్గాల సమాచారం. దాదాపు 20 మంది వరకు విశాఖలో తరచూ కలుస్తుంటాం. దొరికితే ఎండీఎంఏతో పార్టీ చేసుకుంటాం. లేని పక్షంలో గంజాయి, మద్యం తీసుకుంటాం అని, బెంగళూరు నుంచి మధుసూదన్ అలియాస్ మ్యాడీ నుంచి డ్రగ్స్‌ను తెప్పించుకునే వారమని చెప్పాడు. తన పుట్టిన రోజు వేడుకలో డ్రగ్స్‌ను వినియోగించేందుకే బెంగళూరు నుంచి శ్రీవాత్సవ్, హవీలా ద్వారా తెప్పించుకుంటుండగా వారు విజయవాడలో పోలీసులకు పట్టుబడ్డారని వివరించినట్లు కథనం. బెంగళూరులో ఉంటున్న మ్యాడీ ఎలా పరిచయం అయ్యాడని పోలీసులు లోహిత్ యాదవ్‌ను ప్రశ్నించినప్పుడు తనకు సన్నీ, హరీష్ ద్వారా పరిచయం అయ్యాడని చెప్పాడు. నెల్లూరుకు చెందిన హరీష్ విశాఖపట్నంలో చదువుతున్నాడు. శ్రీవాత్సవ్‌కు విశాఖలో పరిచయమై స్నేహితుడిగా మారాడు. నెల్లూరుకు చెందిన సన్నీకి హరీష్‌తో గతంలో పరిచయం ఉందని విచారణలో చెప్పాడు. ఎండీఎంఏను మ్యాడీ సరఫరా చేస్తుంటాడని సన్నీ ద్వారా హరీష్ తెలుసుకున్నాడు. ఇలా పలుసార్లు శ్రీవాత్సవ్ బెంగళూరు వెళ్లి ఎండీఎంఏ తీసుకొచ్చేవాడని సమాధానమిచ్చాడు. తాను విశాఖ నుంచే యూపీఐ ద్వారా మ్యాడీకి డబ్బులు బదిలీ చేసేవాడినని, తర్వాత బెంగళూరు నుంచి తెప్పించేవారమన్నాడు. గతంలో చాలాసార్లు తెప్పించామని, తొలిసారిగా దొరికిపోయింది ఇప్పుడే అని విచారణలో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పాడు. ఇటీవల బెంగళూరులో పోలీసులు వీరికి డ్రగ్స్ సరఫరా చేసిన మ్యాడీని అరెస్టు చేయడంతో పలు కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో మరింత లోతుగా విచారించేందుకు కోర్టు అనుమతితో లోహిత్ యాదవ్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకు నెల్లూరు జైలులో పోలీసులు ప్రశ్నించారు. ఈ విచారణలో మరికొన్ని కీలకమైన అంశాలను కూడా వెల్లడించినట్లు సమాచారం. మరికొందరి పాత్ర గురించి బయటకు వచ్చినట్లు తెలిసింది. ఇటీవల ప్రైవేట్ ట్రావెల్స్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారనే పక్కా సమాచారంతో ఈగల్ బృందం నిఘా పెట్టింది. ఈ క్రమంలో నగరంలోని మహానాడు జంక్షన్ వద్ద తనిఖీలు చేపట్టింది. బెంగళూరు నుంచి విశాఖ వెళ్తున్న బస్సులో శ్రీవాస్తవ, హవిలా అనే ఇద్దరు వ్యక్తుల నుంచి 18 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను ఈగల్ బృందం స్వాధీనం చేసుకున్నది, ఈ క్రమంలో విశాఖపట్నం నగర యువతీ,యువకులు బెంగళూరు నుంచి 19.1 గ్రాములు డ్రగ్స్‌ను తరలిస్తుండగా దొరికారు. ముందస్తు సమాచారంతోనే వారిని పోలీసులు పట్టుకుంటున్నారు. ఆఫ్రికా నుంచి వచ్చి చదువుతున్న విద్యార్థుల్లో కొందరు దీనిని ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఆర్థిక అవసరాలకు దీనిని సరఫరా చేస్తున్నారు. వీరు బాగా నమ్మకస్తులకే అందిస్తారు. ఫోన్ చేస్తే చాలు రెక్కలు కట్టుకుని వచ్చి వాలిపోతున్నారు. నిఘా కళ్లుగప్పి తెస్తున్నారు. బస్సులు, రైళ్లలో విజయవాడకు తెస్తున్నారు.



# ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఆలయాలు

- రూ.603 కోట్లతో 498 ఆలయాల అభివృద్ధి
- అధికారులందరూ చిత్తశుద్ధితో పనిచేయాలి
- దేవాదాయశాఖ సమీక్షలో మంత్రి రామనారాయణరెడ్డి

నెల్లూరు(వైద్యం), నవంబరు 18 ప్రభాతవార్త: భక్తులకు దేవాదాయ శాఖపై నమ్మకం, భగవంతునిపై ప్రగాఢ విశ్వాసం కలిగించేలా దేవాదాయ శాఖ అధికాఉలందరూ భగవంతుని సేవలో చిత్తశుద్ధితో పని చేస్తూ, ఆలయాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో నెల్లూరు జిల్లాలోని దేవాదాయశాఖ అధికారులు, ఇంజనీర్లు, స్తపథులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఆలయాల పునర్నిర్మాణ పనులు, ధూపదీప నైవేద్యం పథకం అమలు, గ్రామ దేవతల ఆలయాల నిర్మాణాలపై చర్చించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ... కాశీ బుగ్గ తరహా ఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ప్రైవేటు ఆలయ నిర్మాణాలపై దేవాదాయవాఖ అధికారుల పర్యవేక్షణ ఉండేలా త్వరలోనే చట్టం తీసుకొస్తున్నట్లు మంత్రి చెప్పారు. భగవంతుని ఆరాధ కేంద్రాలైన ఆలయాల్లో ఎవరు ఎటువంటి తప్పులు చేసిన శిక్షలు తప్పవని మంత్రి ఆనం రామానారాయణరెడ్డి అన్నారు. ఆగమశాస్త్ర విషయాల్లో కేవలం వేదపండితులు, ఆలయ అర్చకులకే పూర్తి నిర్ణయాధికారాలు ఉంటాయని, అధికార యంత్రాంగానికి స్థానం లేదని, కేవలం పరిపాలనా పరమైన అంశాల్లో మాత్రమే అధికారుల ప్రమేయం ఉండేలా చట్టం తీసుకొచ్చినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు.

### ఆలయాల పునర్నిర్మాణ పనులకు నిధులు మంజూరు

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పురాతన, చారిత్రాత్మక ఆలయాల పనర్నిర్మాణాలకు కోట్లాది రూపాయలను మంజూరు చేసినట్లు చెప్పారు. తమ ప్రభుత్వం కేవలం ఈ నెల 18 నెలల పాలనలో 288 ఆలయాలకు 221 కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. గతంలో ఉన్న పాతవి, తాము మంజూరు చేసినవి అన్నీ కలిపి సుమారు 498 ఆలయాల అభివృద్ధికి 603 కోట్ల రూపాయలను దేవాదాయశాఖ, దాతల సహకారంతో ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు జిల్లాలో 58 ఆలయాల పునర్నిర్మాణ పనులు చేపడుతున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ఆలయాలను అభివృద్ధి చేస్తూ, సనాతన హింధూధర్మం, ఆలయాల పవిత్రతను కాపాడుతూ భక్తుల జయజయధ్వానాలతో ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు దేదీప్యమానంగా వెలుగొందేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పునరుద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా దేవాదాయశాఖ అధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి, అన్ని ఆలయాల ఈవోలు, ఇంజనీర్లు స్తపథులు తదితరులు పాల్గొన్నారు.



# తాడిపత్రి బుగ్గ రామలింగేశ్వర స్వామి సేవలో మెగా ఎండి కృష్ణారెడ్డి

అనంతపురం, నవంబరు 18 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం జిల్లా తాడిపత్రిలో వెలసిన బుగ్గ రామలింగేశ్వర స్వామిని ప్రముఖ నిర్మాణ సంస్థ అయిన మెగా ఇంజనీరింగ్ సంస్థ (మెయిల్) మేనేజింగ్ డైరెక్టర్ మెగా కృష్ణారెడ్డి మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా తెలుగుదేశం నాయకుడు జెసి పవన్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త విష్ణువర్ధన్ రెడ్డి, తాడిపత్రి శాసనసభ సభ్యులు జేసీ అస్మిత్‌రెడ్డి తదితరులు బుగ్గ రామలింగేశ్వర స్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేసిన వారిలో ఉన్నారు. మెగా సంస్థ ఎండి మెగా కృష్ణారెడ్డి తాడపత్రికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే జేసి అస్మిత్ రెడ్డి దగ్గరుండి అతిథి మర్యాదలు చేశారు.

# వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి మా లక్ష్యం

## వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి. నారాయణ



తిరుపతి హెల్త్, నవంబరు 18 ప్రభాతవార్త: మెట్ట ప్రాంతాలైన రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు సాగునీరు, త్రాగునీరు లేక మిట్ట ప్రాంతాల ప్రజలు ఇంకా ఇబ్బందులు పడుతూనే ఉన్నారని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు బి. నారాయణ అన్నారు. ప్రాజెక్టులు ప్రారంభించి 40 సంవత్సరాలు గడుస్తున్న కొందరు చేసిన పరిపాలన వ్యవహార శైలితో ఇంకా వెనకబాటుతనాన్ని చూస్తున్నామన్నారు. పరిశ్రమలు లేక ఉద్యోగ అవకాశాలు లేక యువత బయట దేశాలకు ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ... అభివృద్ధి చెందిన ప్రాంతాలకి సాగునీరు, పరిశ్రమలు మెట్రో రైల్వే లైన్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్స్, వైద్య ఆరోగ్య కేంద్రాలు లక్షల కోట్లు ఖర్చు చేయడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి వికేంద్రీకరణకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం మెట్ట ప్రాంతాల సాగునీటి ప్రాజెక్టులు అయిన హంద్రీనీవా, తెలుగు గంగ, ఎస్ఆర్‌బిసి పూర్తి చేస్తే 20.76 లక్షల ఎకరాలకు సాగునీరు, 2 కోట్ల మంది ప్రజలకు త్రాగునీరు ఇవ్వచ్చని, రాబోయే బడ్జెట్లో సంవత్సరానికి 10వేల కోట్లు చొప్పున 3 సంవత్సరాలలో మెట్ట ప్రాంతాల సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని అభివృద్ధి వేదిక డిమాండ్ చేస్తున్నదన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ రెడ్డి మాట్లాడుతూ అన్ని పార్టీలు పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ కేంద్రముతో కుమ్మక్కై ప్రజలకు అన్యాయం చేస్తుందన్నారు. మేధావులు, ప్రజలు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థి, యువజన నాయకులను కలుపుకొని అందరి సహకారంతో ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎంవి శ్యాంప్రసాద్, ఉపాధ్యక్షులు కే కుమార్ రెడ్డి, ఆర్ఎస్‌యు అఖిల భారత అధ్యక్షులు వి.రవిశంకర్ రెడ్డి, ఏఐసీసీ కోఆర్డినేటర్ ఎస్ ఏ సత్తార్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు సగిలి గుర్రప్ప, వ్యాన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైవి శివ, సిఆర్‌వి ప్రసాద్ రావు, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు జయవర్ధన్, పిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# లారీని ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు



విజయవాడ, నవంబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై నందిగామ శివారు అనాసాగరం వద్ద మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని ఢీకొంది. ఈ ఘటనలో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. నందిగామ శివారు అనాసాగరం బైపాస్ వద్ద లారీని ట్రావెల్స్ బస్సు ఓవర్‌టేక్ చేస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఈ బస్సులో మొత్తం 20 మంది ప్రయాణీకులున్నట్లు సమాచారం. క్షతగాత్రులను శ్రీకాకుళం, ఒడిశా ప్రాంతాలకు చెందిన ప్రయాణీకులుగా గుర్తించారు. పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి వెళ్లి క్షతగాత్రులను నందిగామ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు పంపించారు. బసు , లారీని క్రేన్‌తో తొలగించి జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.



# వందేమాతరం చిత్రరూప ప్రదర్శన అద్భుతం

## ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ

విజయవాడ, నవంబరు 18 ప్రభాతవార్త ప్రతినిధి: వందేమాతరం గేయానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటుచేసిన చిత్ర రూప ప్రదర్శన అద్భుతంగా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో వందేమాతరం చిత్ర రూప ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర సమరానికి స్ఫూర్తినిచ్చిన వందేమాతర గేయాన్ని చిత్రరూపంలో తీసుకురావటం అభినందనీయమన్నారు. భారతజాతికి స్వాతంత్ర నినాదమైన "వందేమాతరం" సారాంశాన్ని చిత్రరూపం ద్వారా యువతకు సులభంగా తెలియజేయవచ్చన్నారు. వందేమాతరంలోని భావం మన సంస్కృతిని ప్రతిబింబిస్తుందని, నిత్య స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. సృజనాత్మకతతో చిత్రాలను రూపొందించిన భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావును కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమాధికారి యు.శ్రీనివాసరావు, ఇతర అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# నశాముక్త భారత్ అభియాన్' ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించిన ఎస్.పి



**కోనసీమ బ్యూరో, నవంబర్ 18 (ప్రభాతవార్త) :** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు 'నశాముక్త భారత్ అభియాన్' (మాదకద్రవ్యాల రహిత భారతదేశ ఉద్యమం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, ఎస్పీ పోలీస్ సిబ్బంది, పోలీస్ కార్యాలయ సిబ్బంది, విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అనంతరం, వారందరితో కలిసి 'నశాముక్త భారత్' ప్రతిజ్ఞ చేయించారు. ఈ ప్రతిజ్ఞ ద్వారా జిల్లాను, దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు కట్టుబడి ఉంటామని అందరూ సంకల్పం తీసుకున్నారు. ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, సమాజంలో ఈ చెడు అలవాట్లను నిర్మూలించడానికి తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు., నశాముక్త భారత్ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహించిన భారీ ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో ఎస్పీ స్వయంగా పాల్గొని, మాదకద్రవ్యాల వ్యతిరేక నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యపరిచారు. పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.

# మిత్రబృందం ఆధ్వర్యంలో వేలాదిమందితో ఘనంగా కార్తీక వనసమారాధన

**అన్నవరం, నవంబర్ 18 (ప్రభాతవార్త) :** వీరందరూ ప్రాణస్నేహితులు. కష్టసుఖాలలోనే కాకుండా ఎదుటివారికి చెయ్యూతనివ్వడంలో కూడా అంతా సమిష్టిగా కలిసిమెలిసి చేస్తారు. ప్రతీ సంవత్సరం కార్తీకమాసంలో వనసమారాధన ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటుతోపాటు వేలాదిమందికి విందు ఏర్పాట్లు చేస్తారు. వీరి స్నేహంతో పాటు వీరి భావాలు కూడా ఎంతో ఉన్నతంగా ఉంటాయని పలువురు అభినందిస్తున్నారు. కూచిమంచి శ్రీనివాస్ (వాసు), దొమ్మేటి కృష్ణ, దొమ్మేటి పెదకాపు, చెన్న నగేష్, సిద్ధాంతం నాగేశ్వరరావు, సిద్ది బాబురావు, గుండుబిల్లి సత్తిబాబు, నంబారు ముసలయ్య, శ్రీపాద సుబ్రహ్మణ్యం, ఉప్పలపరపు మల్లికార్జున రావు(శ్రీశైలం) వీరంతా కలిసి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతీ ఏడాది వలె మంగళవారం కార్తీకవనసమారాధన ఈ స్నేహితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. మండపం రోడ్డునందుగల దొమ్మేటి పెదకాపుకు చెందిన తోట నందు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుండే వివిధ



ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా బృందం ఆధ్వర్యంలో ఉసిరిచెట్టు వద్ద కార్తీక దామోదరునికి పూజలు నిర్వహించారు. మారేడు వృక్షం వద్ద భజన బృందంవారిచే భక్తిగీతాలాపనలు, భజనలు, కీర్తనలు నిర్వహించారు. అన్నవరం గ్రామస్తులు,దేవస్థానం సిబ్బంది, మండపం గ్రామస్తులు వేలాదిగా కార్తీక వనసమారాధనకు తరలిరాగా వీరందరికీ స్నేహితుల బృందంవారు ఎంతో రుచి,శుచికరమైన విందుభోజనాలు ఏర్పాటు చేసారు. ఈకార్యక్రమానికి విచ్చేసినవారంతా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉల్లాసంగా గడిపారు.

# అయ్యప్ప అన్నాభిషేకాన్ని కనులారా తిలకించండి ఆంధ్ర శబరిమలై చైర్మన్ శ్రీనివాసరావు



**శంఖవరం , నవంబర్ 18 (ప్రభాతవార్త) :** హరిహర సుత అయ్యప్ప స్వామివారి అన్నాభిషేకాన్ని కనులారా తిలకించాలని ఆలయ చైర్మన్ శ్రీనివాస్ గురుస్వామి పేర్కొన్నారు మండలంసిద్ది పుణ్యక్షేత్రంలోగలఆంధ్ర శబరిమలై ఆలయంలో మంగళవారం కోటి బిల్వార్చన ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 30 నుండి 18 రోజులపాటు ఆలయ ఆవరణలో కోటి బిల్వార్చన కార్య క్రమం అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగిందని ఈ పూజ కార్యక్రమం నేటితో ముగించడం జరిగిందని పేర్కొన్నారు కోటి బిల్వార్చన ముగింపు కార్తీకమాసం ఆఖరి బుధవారం పురస్కరించు చుకుని స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించడం జరుగుతుందని అత్యంత నియమ నిష్టలతో తెల్లవారిజాం నుండి అన్నాన్ని వండి గర్భాలయంలో స్వామివారి మునిగే విధంగా ఈ అభిషేక నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు అభిషేక పూజ అనంతరం అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేయడం జరుగుతుందని ఈ మహోత్తర కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని కనులారా దర్శించుకోవాలని కోరారు.

# అపెక్మా సంయుక్త కార్యదర్శిగా బీవీసీ చైర్ పర్సన్ ఏకగ్రీవ ఎన్నిక

**అమలాపురం రూరల్, నవంబర్ 18 (ప్రభాతవార్త) :** అమలాపురం లోని బోనం వెంకట చలమయ్య ఇంజనీరింగ్ కళాశాల చైర్‌పర్సన్ డా. బోనం కనకదుర్గ ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాల సంఘం సంయుక్త కార్యదర్శి గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కళాశాల సెక్రటరీ బోనం కనకయ్య ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల అభివృద్ధి, విధానాల రూపొందింపు, నాణ్యత పెంపు, ప్రభుత్వ సంస్థలతో సమన్వయం వంటి కీలక వ్యవహారాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్న యాజమాన్యాల సంఘంలో ప్రతిష్టాత్మక పదవికి డా. కనకదుర్గ ఎన్నిక కావడం బీవీసీ గ్రూప్‌కు విశేష గౌరవం గా భావిస్తున్నట్లు కనకయ్య అన్నారు.ఈ సందర్భంగా బీవీసీ ఎడ్యుకేషనల్ సొసైటీ తరఫున బోనం కృష్ణ సతీశ్ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆమెకు విజయవంతమైన పదవీకాలం ఉండాలని ఆకాంక్షించారు. తమ కళాశాల చైర్ పర్సన్ ఈ పదవికి ఎన్నిక కావడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ డా. డి. మహేశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా డా. బోనం కనకదుర్గ మాట్లాడుతూ తాను సంఘ తొలి మహిళా కార్యవర్గ సభ్యురాలిగా ఎన్నిక కావడం, జాయింట్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించడం తనకు దక్కిన గౌరవంగా, ఒక సదవకాశంగా భావిస్తున్నాననీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టెక్నికల్ ఎడ్యుకేషన్ నాణ్యత అభివృద్ధి, ఇండస్ట్రీలతో అనుసంధానం, విద్యార్థుల



కోసం స్కిల్ డెవలప్‌మెంట్, సభ్య కళాశాలల సమష్టి అభివృద్ధి కోసం పనిచేయటానికి కట్టుబడి ఉంటాననీ అన్నారు. అలాగే అపెకమా వికాసానికి తన వంతు కృషిని బాధ్యతగా, నిష్ఠగా అందిస్తానన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా. ఎ. ప్రవీణ్, కార్య నిర్వహణాధికారి ఎ.వై. ఆర్. వి. ప్రసాద్, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులు డా. బోనం కనకదుర్గకు అభినందనలు తెలిపారు.

# ప్రకృతి ఆరాధనయే సమారాధన..రామానుజ భారతి స్వామి



**కోనసీమ బ్యూరో, నవంబర్ 18 (ప్రభాతవార్త) :** కార్తీక వన సమారాధన సందర్భంగా అయినవిల్లి మండలం లోనిమాగం లో శ్రీ శ్రీ శ్రీ స్వామి మారుతి చరణ్ ఆశ్రమంలో ఆధ్యాత్మిక మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.సుమారు నలభై రెండేళ్లుగా బ్రహ్మచారి మారుతి చరణ్ స్వామి నేతృత్వంలో ఆధ్యాత్మిక సేవా పరంపర కొనసాగిన ఈ ఆశ్రమం 2001లో శ్రీరామ జయరామ జయజయ రామ నామ మంత్రంతో నూరు కోట్ల జప జ్ఞాన మహాయజ్ఞం 120 రోజుల పాటు నిర్విరామంగా నిర్వహించిన అరుదైన పుణ్యక్షేత్రంగా నిలిచింది.వేలాది మంది భక్తులు దేశ విదేశాల నుండి విచ్చేసి ఆ మహాయజ్ఞానికి సాక్ష్యులయ్యారు.ప్రస్తుతం వైకుంఠప్రాప్తి పొందిన బ్రహ్మచారి మారుతి చరణ్ స్వామి వారి ఆధ్యాత్మిక వారసత్వాన్ని వారి శిష్య పరంపర శ్రీ రామానుజ భారతి స్వామి భక్తి, సేవ,సత్సంగాలతో సమర్థంగా ముందుకు తీసుకెళుతున్నారు.వన సమారాధన సందర్భంగా శ్రీ రామానుజ భారతి స్వామి సత్సంగంలో వన సమారాధన విశిష్టతను విశదీకరించారు.వనం అంటే ప్రకృతి,సమారాధన అంటే దేవతత్వాన్ని ఆహ్వానించడం అని పేర్కొంటూ ప్రకృతితో మనసు ఏకమై చేసే ఆరాధన ద్విగుణ ఫలితాలను ఇస్తుందని వివరించారు.పాదరసమై ఉన్న వాతావరణంలో సుమధురంగా జపించిన శ్రీరామ నామం మనసును నిర్మల పరుస్తుందని,వన సమారాధనలో పాల్గొనడం ద్వారానే మనసుకు ప్రశాంతి కలుగుతుందని భక్తులకు తెలియజేశారు.అనంతరం ఆంజనేయ స్వామి మహిమలను స్మరించిన ఆయన ఆంజనేయుడు శ్రీరాముని నామాన్ని శ్వాసలోనూ,నిశ్వాసలోనూ జపిస్తూ జీవించిన పరమ భక్తుడు అని,ఆయన జీవితం స్వయంగా ఒక నామజప యజ్ఞమే అని పేర్కొన్నారు.శ్రీరాముని సేవలో అహర్నిశలు ఉన్న ఆంజనేయుడి శక్తి ఆయన భక్తి ఫలితమే అని చెబుతూ శ్రీరామ నామం జపించిన ప్రతి ఒక్కరి జీవితంలో ఆశ్చర్యకర మార్పులు తప్పకుండా సంభవిస్తాయని ఉదాహరణలతో వివరించారు.వన సమారాధనలో శ్రీరామ నామం జపించడం ఆధ్యాత్మిక శక్తిని పెంచడమే కాదు అగోచరంగా మన చిత్తాన్ని పవిత్రత వైపు తీసుకెళ్తుందని స్వామి భక్తులకు ఉపదేశించారు.కార్యక్రమంలో అమలాపురం శ్రీ గాయత్రీ పీఠం నిర్వహకులు ఆకుల శ్రీదేవి,వేటుకూరి ఆబురాజు, సూర్యకాంతం,మునుకోటి నాగబాబు,నాగమణి దంపతులు,ఓలేటి సుందర శివరావు,కొమ్మిరెడ్డి నారాయణరావు, వేటుకూరి బంగారి,ఎరుబండి దొరబాబు,గంగుమళ్ళ శ్రీనివాస్, యర్రంశెట్టి శ్రీను,గాలిదేవర సతీష్ తదితరులు పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన వందలాది మంది భక్తులతో కలిసి పాల్గొని వన సమారాధన మహోత్సవానికి ఆధ్యాత్మిక భక్తి గంభీరతను మరింతగా చేకూర్చారు.

# గో ఆధారిత ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆత్రేయపురం, నవంబర్ 18 (ప్రభాతవార్త) :** గో ఆధారిత ప్రకృతి సేద్యంతో తయారైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యం సాధ్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం అంకంపాలెంలో గ్రామ వికాస్ ఆంధ్రప్రదేశ్, వ్యవసాయ శాఖ, ప్రకృతి రైతు కుదప కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల అవగాహన సదస్సులో ఎమ్మెల్యే, బండారు సత్యానంద రావు, శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ శావల దేవదత్తు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే ముందుగా రైతులు ఏర్పాటు చేసిన గో ఆధారిత సేంద్రీయ ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు. గో ఆధారిత ఉత్పత్తులతోనే పంటలు పండిస్తున్నామని, మంచి రాబడి వస్తోందని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడుతూసేంద్రీయ పంటలే ఆరోగ్యానికి పునాది అని తెలిపారు.దేశంలో ధాన్యం కొరత లేకపోయినా, రసాయన ఎరువులు అధికంగా వాడిన ఆహారం వల్ల ఆరోగ్య సమస్యలు



పెరుగుతున్నాయని, ముఖ్యంగా క్యాన్సర్ ముప్పు ఎక్కువవుతోందని పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయం, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం తప్పనిసరి అవసరమైందని అన్నారు."మన ఆరోగ్యం మన ఆహారంపై ఆధారపడింది... మంచి ఆహారం అందించడం రైతుల చేతుల్లోనే ఉంది" అని ఎత్తిచూపారు .సేంద్రియ వ్యవసాయానికి సీఎం చంద్రబాబు ప్రోత్సాహం.దేశవ్యాప్తంగా గో ఆధారిత వ్యవసాయం చర్చనీయాం శమైందని, సీఎం నారా చంద్రబాబు నాయుడు సేంద్రీయ వ్యవసాయానికి విస్తృతంగా ప్రోత్సాహం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వమే ప్రత్యేకంగా ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని వివరించారు. నియోజకవర్గంలో విస్తరణ చర్యలు రైతులకు అవగాహన కల్పించేందుకు నాలుగు మండలాల్లో ఇలాంటి సదస్సులను నిర్వహించే యోచన ఉందని చెప్పారు. కుదప కృష్ణమూర్తిని నియోజకవర్గ స్థాయి కమిటీ చైర్మన్‌గా నియమించి, ప్రతి మండలంలో కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రావులపాలెం, కొత్తపేటల్లో గో ఆధారిత సేంద్రీయ ఉత్పత్తుల రిటైల్ దుకాణాలు ప్రారంభించే దిశగా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే వెల్లడించారు.వరి, అరటి రైతులు ప్రకృతి విపత్తులతో నష్టపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిపెట్టాలని సూచించారు. ఇప్పటికే కొందరు రైతులు కోకో, పామాయిల్, ఉద్యాన పంటల సాగు వైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, ప్రకృతి వ్యవసాయ సలహాదారులు బొప్పన సీతారామదాసు, ఏపీసీఎన్ఎఫ్ పీఎం లు కొత్తపల్లి శ్రీనివాస్, బొర్రా తాతారావు, జె. ఎలియాజరు, కృశివల కోకోనట్ ఫార్మ్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈవో. అడ్డాల గోపాలకృష్ణ, గ్రామ సర్పంచ్ ముత్తబత్తుల రాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, మండల తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్, కాయల జగన్నాథం, ముక్కమల్లి రాము, మద్దూరు సుబ్బారావు, పి ఎస్ రాజు,పేరిచర్ల పుల్లమ్మ రాజు వర్మ, పెండం వెంకన్న, బ్రహ్మనందం, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామభద్రరాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, తోటకూర సుబ్బరాజు, నరాల శెట్టి వెంకన్న, దండు సీతారామరాజు, జగన్మోహిని కేశవ స్వామి దేవస్థానం చైర్మన్ నాగేశ్వరరావు, మద్దింశెట్టి సత్యనారాయణ, ముత్యాలు బాబ్జి, ధర్నాల రామకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ఢీ వ్యక్తి మృతి



**జగ్గంపేట , నవంబర్ 18 (ప్రభాతవార్త) :** జగ్గంపేట మండలం మామిడాడ గ్రామ శివారున బస్సు ఢీకొని ఒక వ్యక్తి మరణించాడు జగ్గంపేట పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మంగళవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో మామిడాడ గ్రామ శివారున ఇటుక బట్టి నిర్వహిస్తున్న మొదలువలస సాయి వయసు 27 సంవత్సరాలు తిరుగుడు మెట్ట గ్రామం తాళ్లపూడి మండలం అను అసామి,అతని చిన్నాన్న అతని బట్టిలో పనిచేసే మరో అసామి వేరువేరుగా రెండు మోటార్ సైకిళ్ల పై అప్పన్నపాలెంలో గల వారి చిన్నాన్న ఇటుకుల బట్టి చూడడానికి సాయి తన యొక్క ఎ పి 05 డి ఎక్స్ 2872 మోటార్ సైకిల్ మీద మిగిలిన ఇద్దరు మరొక మోటార్ సైకిల్ మీద వారి యొక్క బట్టీ నుండి అప్పన పాలెం బయలుదేరగా మామిడాడ గ్రామ శివారు చేపల చెరువు వద్దకు వచ్చే సరికి ముందు వెళ్తున్న సాయి మోటార్ సైకిల్ కు ఎదురుగా మామిడాడ గ్రామం వైపు నుండి నరేంద్ర పట్నం గ్రామం వైపు వెళ్తున్న ఏపీ 39 యు ఎక్స్ 0388 నెంబర్ గల ఆదిత్య యూనివర్సిటీ బస్సు డ్రైవర్ తన యొక్క బస్సును అతివేగంగా నిర్లక్ష్యంగా హారను కొట్టకుండా నడిపి ముందు వెళ్తున్న సాయి యొక్క మోటార్ సైకిల్ ఢీకొట్టాడు సాయి మోటార్ సైకిల్ పై నుండి రోడ్డుపై పడిపోయి సాయికి ముఖము నుజ్జు అయ్యి బలమైన రక్తగాయాలు తగిలి అక్కడికక్కడే చనిపోయినాడు. జరిగిన ఈ రోడ్డు ప్రమాదంపై సాయి యొక్క చిన్నాన్న వడిసి సూరిబాబు జగ్గంపేట పోలీస్ స్టేషన్ లో రిపోర్ట్ ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ బి. మాణిక్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియ చేసారు.

# సత్యవాడలో పశువుల దాణ పంపిణీ కార్యక్రమం



**కె గంగవరం, నవంబర్ 18 (ప్రభాతవార్త) :** మండలంలోని సత్యవాడ గ్రామసొసైటీ కి వచ్చిన పశువుల దాణను ఎం ఆర్ పి ధరలకే విక్రయించాలన్న కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు శ్రావణి,స్వచ్చా ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్ , పి. ఏ. సి. ఎస్ చైర్మన్ సలాది సీతారాం, గ్రామ సర్పంచ్ సలాది సూర్య కళ వెంకన్న , కూటమి నాయకులు, వెటర్నరీ అసిస్టెంట్ వీరబాబు,ఆహ సింధుబాబు తదితరులు పాల్గొన్నారు. రైతులు అందరు ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవాల్సిందిగా తెలియజేసారు.

### పెళ్లి పేరుతో యువతీని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు..అరెస్ట్ చేసిన రౌతులపుడి పోలీసులు

**రౌతులపూడి , నవంబర్ 18 (ప్రభాతవార్త) :** రౌతులపూడి గ్రామానికి చెందిన 25 సంవత్సరాల యువతని ,సుమారు 7 సంవత్సరాల నుండి రౌతులపూడి గ్రామానికి చెందిన గెడ్డం లోవ ప్రసాద్ ప్రేమ పేరుతో నమ్మించి సుమారు రెండు సంవత్సరాల నుండి పెళ్లి చేసుకుంటానని శారీరకంగా వాడుకొని అంతా అయ్యాక, ఆ యువతీ ని పెళ్లి చేసుకోకపోవడం తోఈనెల 7న బాధిత అమ్మాయి ఫిర్యాదు చేశారు. దీనిపై రౌతులపూడిఎస్. ఐ. క్రైమ్ నం: 331/2025 U/S 68, 88, 318(2) r/w 3(5) బి. ఎన్. ఎస్ కేసు నమోదు చేసి, కేసు లో త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేశారు. ఈ కేసు లో ముద్దాయి అయిన గెడ్డం లోవప్రసాద్ ను రౌతులపూడి గ్రామ శివారు శివాలయం దగ్గర మంగళవారంఅరెస్ట్ చేశారు.ముద్దాయి ని జ్యూడిషల్ రిమాండ్ నిమిత్తంతుని జె. ఎఫ్. సి. ఎం కోర్ట్ లో హాజరు పరుస్తామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

# కుమారుని పార్థివ శరీరాన్ని కిమ్స్ వైద్య కళాశాలకు దానం చేసిన తల్లి

**- పార్థివ శరీర దానం వైద్య విద్యార్థుల శిక్షణకు వెలకట్టలేని కానుక : కిమ్స్ చైర్మన్ చైతన్య రాజు**

**అమలాపురం టౌన్, నవంబర్ 18 (ప్రభాతవార్త) :** అయినవిల్లి లంక కు చెందిన 80 సంవత్సరాల వయస్సు గల చిట్టూరి సీతా రత్నం తన మరణానంతరం తన పార్థివ శరీరాన్ని కిమ్స్ వైద్య కళాశాలకు దానం చేయమని తన కుమారుని కోరారు. దురదృష్ట వశాత్తూ ఆమె 45 సంవత్సరాల కొడుకు చిట్టూరి అచ్యుత రామన్న చౌదరి (గోపి) నవంబర్ 5 వ తేదీన మరణించారు. ఆ తల్లి తన కుమారుని పార్థివ శరీరాన్ని కిమ్స్ వైద్య కళాశాలకు దానం చేశారు. "జీవితకాలంలో వైద్యులు నా కొడుకుకు సేవ చేశారు. మరణానంతరం అతను వైద్య విద్యకు సేవ చేయాలి. అది అతని ఆత్మకు శాంతిని అందిస్తుంది," అని ఆమె చెప్పిన మాటలు వినువారిని కదిలించాయి. "భవిష్యత్ వైద్యులకు అవసరమైన అనుభవాన్ని ఇవ్వడం, వారికి మానవ శరీర నిర్మాణంపై నిజమైన అవగాహన కల్పించడయఅది ఆమె దృష్టిలో అతని జీవితానికి ఇచ్చే అత్యుత్తమ అర్థం. మరణం తర్వాత కూడా సమాజానికి ఉపయోగపడే పార్థివ శరీర దానం ద్వారా ఆమె ఒక శాశ్వత సేవకు రూపం ఇచ్చారు" అని కిమ్స్ అనాటమీ విభాగాధిపతి డా. బి. నారాయణ రావు అన్నారు . ఆ గొప్ప తల్లి చూపిన అపారమైన మానవతా భావాన్ని కిమ్స్ మెడికల్ కాలేజ్ డీన్ భావోద్వేగంతో ప్రశంసించారు. "ఇలాంటి తల్లులు సమాజానికి మార్గదర్శకులు. ఆమె చేసిన శరీరదానం భవిష్యత్ తరాల వైద్యులకు వెలకట్టలేని కానుక," అని ఆయన అన్నారు. ఈ నిర్ణయం మరెందరికో శరీరదానం అనే మహత్తర సేవ వైపు ప్రేరణగా నిలుస్తుందని కూడా ఆయన ఆశాభావం వ్యక్తం



శ్రీమతి చిట్టూరి సీతారత్నం గారు (తల్లి)



కిమ్స్ డీన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న బంధువులు

చేశారు. ఆమె సేవలను గుర్తిస్తూ ఆమె బంధువులు కోడూరి లక్ష్మణ రావు, చిట్టూరి వీర వెంకట సత్యనారాయణ మూర్తి (చౌదరి) లకు ప్రశంసా పత్రము అందచేశారు.మానవతా మాధుర్యంతో మెరిసే ఆ తల్లి చేసిన త్యాగం, సమాజానికి చూపిన ప్రేమ, భవిష్యత్తు వైద్యుల శిక్షణ కోసం ఆమె చేసిన ఈ అమూల్యమైన సహకారంఅనిర్వచనీయమని, అత్యంత మహత్తరమైనదని కిమ్స్ చైర్మన్ కె.వి.వి.సత్యనారాయణ రాజు, ఎం.డి. రవి కిరణ్ వర్మ ప్రశంసించారు.

# కాలుష్యరహిత వాతావరణం, ఆరోగ్యకరమైన జీవన విధానం

## క్లీన్ అండ్ గ్రీన్ పై అవగాహన : ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకటరామన్

**ఆత్రేయపురం, నవంబర్ 18 (ప్రభాతవార్త) :** కాలుష్యరహిత వాతావరణంతో ఆరోగ్యకరమైన జీవన విధానం ఏర్పడుతుందని ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకటరామన్ పేర్కొన్నారు. ఆత్రేయపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో "క్లీన్ అండ్ గ్రీన్" పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ వెంకటరామన్ మాట్లాడుతూ, సూర్యకాంతి, గాలి, నీరు, మట్టి, ఖనిజాలు, అడవులు, మొక్కలు, వన్య ప్రాణులు వంటి సహజ వనరులను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణాన్ని పరిశుభ్రంగా, పచ్చగా ఉంచడం ద్వారా: స్వచ్ఛమైన గాలి, సహజ వనరుల స్థిరమైన వినియోగం, గ్రామీణ అభివృద్ధికి దోహదపడే ఉపాధి అవకాశాలు, అందుబాటులోకి వస్తాయని ఆయన వివరించారు. "గ్రీన్ అంటే కేవలం పచ్చదనం కాదుబీ నదులు, సముద్రాలు, అడవులు,



భూమి వంటి సహజ వనరులను సంరక్షిస్తూ దశాబ్దాల పాటు నిలబెట్టే స్థిరమైన అభివృద్ధి మార్గం" అని ఎంపిడిఓ అన్నారు.పరిశుభ్రత ఉద్యమాలు, చెట్ల నాటకం, వ్యర్థాల నిర్వహణ, గ్రామ సంస్కరణకు సంబంధించిన పథకాల అమలులో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ పి.వి.ఆర్.కె.రాజు, గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు,పంచాయితీకార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవుని అనివేటిమండపంలో వైభవంగా సహస్ర మహా జ్యోతిర్లింగార్చన..పూజలలో పాల్గొన్న ఇఓ దంపతులు



**అన్నవరం, నవంబర్ 18 (ప్రభాతవార్త) :** పవిత్ర కార్తీకమాసంలో మాస శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మంగళవారం రాత్రి సత్యదేవుని అనివేటి మండపంలో సహస్ర మహా జ్యోతిర్లింగార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అనివేటి మండపంలోగల స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు దేవస్థానం ఇఓ వీర్ల సుబ్బారావు దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేధపండితులు వివిధ వైధిక కార్యక్రమాలు, నిర్వహించారు.అనంతరం శివలింగాకృతిలో జ్యోతులు వెలిగించి పరమేశ్వరున్ని ఆరాదించారు. ప్రతీఏటా కార్తీక మాసంలో బహుళ చతుర్ధశి రోజున ఈకార్యక్రమం నిర్వహణ ఎంతో శుభప్రదమని, లింగాకృతి జ్యోతిర్లిం గార్చన దర్శణంఎన్నో జన్మల పుణ్యఫలమని,సకల పాపహరమని పండితులు తెలియజేస్తున్నారు. ఈకార్యక్రమాన్ని భక్తులు వీక్షించి తరించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న ఎస్సై జానీ బాషా

**కె.గంగవరం, నవంబర్ 18 (ప్రభాతవార్త) :** గంగవరం గ్రామంలో ఎస్సై జానీబాషా ఆధ్వర్యంలో మదకద్రవ్యాల వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు. డ్రగ్స్ కు బానిసైనవారు తమ అమూల్యమైన భవిష్యత్తును, జీవితాన్ని కోల్పోయి, విచక్షణ రహితంగా, సంఘ విద్రోహులుగా మారతారని, కుటుంబాలు నాశనం అవుతాయని, వాటికి దూరంగా ఉ



ండాలని సూచించారు. డ్రగ్స్ వల్ల బాల్యాన్ని బలి తీసుకోవడమే పిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని తెలిపారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

### ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌కు
# సాత్విక్, చిరాగ్ జోడీ



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025 సాత్విక్‌చిరాగ్ జోడీ రెండో రౌండ్‌కు చేరుకుంది. ఇదే సమయంలో ట్రీసా, గాయత్రి జోడీ నిష్క్రమించింది. మంగళవారం సిడ్నీలో జరిగిన బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 500 ఈవెంట్ అయిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి దూసుకెళ్లారు. టాప్ సీడ్ భారత ద్వయం చైనీస్ తైపీకి చెందిన చాంగ్ కో‌చి-పో లివీలను 48 నిమిషాల్లో 25-23, 21-16 తేడాతో ఓడించి, చైనీస్ తైపీకి చెందిన మరో జంట సు చింగ్ హెంగ్ మరియు వు గువాన్ జున్‌తో రౌండ్ ఆఫ్ 16 పోరుకు సిద్ధమైంది.అయితే, మహిళల డబుల్స్‌లో, నాల్గవ సీడ్ భారత జంట ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ ఇండోనేషియాకు చెందిన ఫెబ్రియానా ద్విపుజి కుసుమ-మెలిసా ట్రియాస్ పుష్పితసరి చేతిలో వరుస గేమ్‌లలో ఓడిపోయారు. ఇండోనేషియాకు చెందిన ఈ మ్యాచ్ 40 నిమిషాల్లో 21-10, 21-14 తేడాతో గెలిచింది. మూడున్నర నెలల తర్వాత భారతీయులకు ఇది మొదటి ఈవెంట్. హాంకాంగ్ సూపర్ 500 మరియు చైనా మాస్టర్స్ సూపర్ 750 లలో వరుసగా ఫైనల్స్ కు చేరుకున్న ప్రపంచ 3వ ర్యాంకర్ సాత్విక్-చిరాగ్, ప్రారంభ గేమ్ ప్రారంభంలో 2-6 తేడాతో వెనుకబడ్డారు, తైవాన్ జంట 16-14 వరకు స్వల్ప ఆధిక్యాన్ని కొనసాగించింది. భారత జోడీ 19-17తో ఆధిక్యంలోకి వెళ్లేందుకు ఆట చివరి వరకు కొనసాగింది.

### మహిళల కబడ్డీ ప్రపంచ కప్‌లో
# విజయంతో భారత్ ఆరంభం

**న్యూఢిల్లీ:** మహిళల కబడ్డీ ప్రపంచ కప్ 2025లో థాయిలాండ్‌పై అద్భుతమైన విజయంతో భారత్ తన ప్రచారాన్ని ప్రారంభించింది. బంగ్లాదేశ్‌లోని మీర్‌పూర్‌లో మంగళవారం థాయిలాండ్‌ను 65-20 తేడాతో భారత్ జట్టు ఓడించింది. 2025 మహిళల కబడ్డీ ప్రపంచ కప్ టోర్నమెంట్‌ను ముందుగా బీహార్‌లోని రాజ్‌గిర్‌లో నిర్వహించాలని నిర్ణయించి, తరువాత అక్కడ నుండి హైదరాబాద్‌కు తరలించారు. మళ్లీ భారత్‌లో పలుమార్లు వాయిదా పడిన తర్వాత టోర్నమెంట్‌ను మీర్‌పూర్‌కు తరలించారు. మీర్పూర్‌కు తరలింపుతో 2025 మహిళల కబడ్డీ ప్రపంచ కప్ భారతదేశం వెలుపల జరిగిన మొట్టమొదటి క్రీడగా నిలిచింది. 13 సంవత్సరాల తర్వాత మహిళల కోసం కబడ్డీ ప్రపంచ కప్ నిర్వహించడం ఇదే మొదటిసారి. 2012లో బీహార్‌లోని పాట్నాలో జరిగిన ఫైనల్‌లో ఇరాన్‌ను ఓడించి, భారత్ మహిళల ప్రపంచ కప్‌ను గెలుచుకుంది. థాయిలాండ్‌ను ఓడించిన తర్వాత, భారత్ ఇప్పుడు రాబోయే రెండు రోజుల్లో తమ గ్రూప్ ఎ మ్యాచ్‌లలో బంగ్లాదేశ్ (నవంబర్ 19), జర్మనీ (నవంబర్ 20), మరియు ఉగాండా (నవంబర్ 21)తో తలపడనుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 11 దేశాలు పోటీపడుతున్నాయి. ఆతిథ్య బంగ్లాదేశ్, చైనీస్ తైపీ, ఇరాన్, కెన్యా, నేపాల్, పోలాండ్ మరియు జాంజిబార్ ఇతర దేశాలు పోటీపడుతున్నాయి.



# వరల్డ్ కప్‌లో జర్మనీకి అర్హత
### 6-0తో స్లోవేకియా ఓటమి

**న్యూఢిల్లీ:** స్లోవేకియాను 6-0 తేడాతో ఓడించి జర్మనీ ఫిఫా ప్రపంచ కప్ 2026 కి అర్హత సాధించింది. చివరి క్వాలిఫైయర్‌లో స్లోవేకియాను ప్లేఆఫ్‌లోకి పంపడం ద్వారా జర్మనీ వచ్చే ఏడాది ప్రపంచ కప్‌కు చోటు సంపాదించుకుంది. నాలుగుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఈ జట్టు గత రెండు ప్రపంచ కప్‌లలో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించి, 15 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది, స్లోవాక్‌లు 12 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచాయి. అగ్రస్థానాన్ని కైవసం చేసుకోవడానికి జర్మన్లు, ఎటువంటి అవకాశాన్ని వదిలిపెట్టకుండా ప్రారంభంలోనే నియంత్రణ సాధించే ప్రయత్నం చేశారు. 18వ నిమిషంలో అన్‌మార్క్డ్ నిక్ వోల్టెమేడ్ జర్మనీ తరపున గత మూడు మ్యాచ్‌లలో వరుసగా నాలుగో గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లాడు.సెర్జ్ గ్నాబ్రీ బాక్స్‌లోకి దూసుకెళ్లే సమయంలో స్లోవేకియా కీపర్ మార్టిన్



దుబ్రావ్కా 25వ స్థానంలో అడ్డుకున్నాడు. నాలుగు నిమిషాల తర్వాత గ్నాబ్రీ లియోన్ గోరెట్జ్కా పాస్‌ను పరిపూర్ణంగా అందుకొని గోల్ చేసి 2-0తో స్కోరునుసాధించాడు.ఫ్లోరియన్ విర్ట్జ్36వ ఆటగాడితో లెరాయ్‌సేన్‌ను దుబ్రావ్కాను దాటించి ఆటనుముగించాడు. ఐదు నిమిషాల తర్వాత విర్ట్జ్ వింగర్‌కు మరో అసిస్ట్ అందించి తన రెండవ గోల్‌ను సాధించాడు. విరామం తర్వాత రిడిల్ బాకు మరియు టీనేజర్ అస్సాన్ ఔద్రాగో ఒక్కొక్కరు గోల్ చేశారు.



# ఉమెన్ క్రికెట్ ఫైర్
### ఆక్షన్‌కు కసరత్తు పూర్తి
## స్మృతి రికార్డు ధర రూ.3.50 కోట్లు

**న్యూఢిల్లీ:** మహిళల క్రికెట్‌కు కొత్త ఊపునిచ్చిన ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్) నాలుగో సీజన్‌కు సిద్ధమవుతోంది. ఈ మెగా టోర్నమెంట్ నాలుగో ఎడిషన్ జనవరి 7 నుంచే ప్రారంభం కానుంది. ఈసారి ఐదు ఫ్రాంచైజీలు తమ రిటెన్షన్ జాబితాలను సమర్పించగా, టోర్నమెంట్ తేదీలు, వేదికలపై నిర్వాహకులు కసరత్తు పూర్తి చేశారు. దీనికి సంబంధించి వేలంలో ఫ్రాంచైజీలు మొత్తం రూ.15 కోట్లు ఖర్చు చేయనున్నారు. స్లాబ్స్ ప్రకారంఒక క్రికెటర్‌కు గరిష్టంగా రూ.3.5 కోట్లు చెల్లించే అవకాశం ఉంది. ప్రపంచ కప్‌లో అద్భుతంగా ఆడిన టీమిండియా సభ్యురాలు స్మృతి మంధానను ఆర్‌సీబీ రికార్డు ధర రూ.3.50 కోట్లకు రిటైన్ చేసుకుంది. వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ దీప్తి శర్మను యూపీ వారియర్స్ విడుదల చేయడం ఆశ్చర్యపరిచింది. ఇక ఒక ఫ్రాంచైజీ ఐదుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకుంటే,వారి పర్స్‌నుంచి రూ.9.75 కోట్లు తీసివేస్తారు. నలుగురిని చేస్తే రూ.8.75 కోట్లు, ముగ్గురిని చేస్తే రూ.7.75 కోట్లు, ఇద్దరిని రిటైన్ చేస్తే రూ.6 కోట్లు కట్ అవుతుంది. ఈసారి వేలంలో ఎక్కువ డబ్బుతో బరిలోకి దిగుతున్న జట్టు యూపీ వారియర్స్. ఈ జట్టు కేవలం శ్వేత షెరావత్‌ను (రూ.50 లక్షలు) మాత్రమే రిటైన్ చేసుకుంది. అందుకే వారి పర్స్‌లో అత్యధికంగా రూ.14.5 కోట్లు మిగిలి ఉన్నాయి. వేలంలో కీలక ఆటగాళ్లను కొనుగోలు చేసే అవకాశం యూపీ వారియర్స్‌కు ఎక్కువగా ఉంది. రెండో స్థానంలో గుజరాత్ జెయింట్స్ నిలిచింది. బెత్ మూనీ (రూ.3.5 కోట్లు), యాష్ గార్డ్‌నర్ (రూ.2.5 కోట్లు)ను రిటైన్ చేసుకొని, తమ పర్స్‌లో రూ.9 కోట్లు మిగుల్చుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ కీలక ఆటగాళ్లను అట్టిపెట్టుకుంది. జెమీమా రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ, మెరైన్ కాప్, అన్నబెల్ సదర్లాండ్‌ను చెరో రూ.2.2 కోట్లకు, అలాగే నిక్కీ ప్రసాద్‌ను రూ.50 లక్షలకు రిటైన్ చేసుకుంది. ఈ రిటెన్షన్ తర్వాత ఢిల్లీ పర్స్‌లో రూ.6.75 కోట్లు మిగిలి ఉన్నాయి. మరోవైపు ఆర్‌సీబీ జట్టు స్మృతితో సహా, రిచా ఘోష్ (రూ.2.75 కోట్లు), ఎలిస్సా పెర్రీ (రూ.2 కోట్లు), శ్రేయాంక పాటిల్‌ను (రూ.60 లక్షలు) రిటైన్ చేసుకుంది. ఆర్‌సీబీ పర్స్‌లో రూ.6.15 కోట్లు మిగిలాయి. ఇక, అన్ని జట్ల కంటే తక్కువ డబ్బుతో వేలంలోకి దిగుతున్న జట్టు ముంబై ఇండియన్స్. ఈ జట్టు నాట్ సీవర్ బ్రంట్, హార్మన్‌ప్రీత్ కౌర్, హేలీ మ్యాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, జి. కమలినితో సహా మొత్తం 5 ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. దీంతో వారి పర్స్‌లో కేవలం రూ.5.75 కోట్లు మాత్రమే మిగిలి ఉన్నాయి.

# వరల్డ్ బాక్సింగ్ కప్‌లో హితేష్, పవన్ సంచలన విక్టరీ



**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో భారత్ బాక్సర్ హితేష్ గులియా సంచలన విజయం సాధించాడు. మాజీ ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించాడు. ఫైనల్స్‌లో తొమ్మిది మంది భారతీయుల్లో తొమ్మిది మంది సెమీఫైనల్‌కు చేరుకున్నారు. పవన్ బార్త్వాల్ (55 కిలోలు) మరియు హితేష్ గులియా (70 కిలోలు) టోర్నమెంట్‌లో రెండు అతిపెద్ద ఫలితాలను అందించారు. ప్రపంచ బాక్సింగ్ కప్ బ్రెజిల్ బంగారు పతక విజేత అల్టిన్‌బెక్ నూర్సుల్తాన్‌ను పవన్ ఓడించాడు. వెయిట్ కేటగిరీలో రెండవ సీడ్ అయిన నూర్సుల్తాన్‌ను నెట్టి క్లీన్ ఓపెనింగ్‌లను ఎంచుకున్నాడు. అలాగే హితేష్ రెండుసార్లు ఒలింపియన్, మాజీ ప్రపంచ ఛాంపియన్ సెవాన్ ఒకజావాను ఓడించి, స్ప్లిట్‌డెసిషన్ బౌట్‌లో విజయం సాధించాడు. వీరిద్దరితో పాటు సుమిత్ (75 కిలోలు), నవీన్ (90 కిలోలు), మరియు జదుమణి సింగ్ (50 కిలోలు) సాధించిన విజయాలు భారతదేశం రెండు సెషన్లలో పతక స్వీప్‌ను పూర్తి చేశాయి. హితేష్, ఒకజావా మధ్య రాత్రి జరిగిన మార్క్యూ బౌట్‌లో అత్యంత నాటకీయ ఫలితాలలో ఒకటిగా 3:2 తేడాతో విజయం సాధించింది. ఇద్దరు బాక్సర్లు ప్రారంభంలోనే జాగ్రత్తగా వ్యవహరించి ఓపెనింగ్‌లను అడ్డుకున్నారు, కానీ 2వ రౌండ్ చివరిలో హితేష్ నుండి వచ్చిన శక్తివంతమైన హుక్ అతనికి ప్రారంభంలోనే ఆధిక్యాన్ని ఇచ్చింది. 3వ రౌండ్‌లో ఒకజావా దూకుడుగా ఎదురుదెబ్బ తగిలింది, కానీ మొదటి రెండు రౌండ్లలో హోమ్ ఫేవరెట్ క్లీన్ వర్క్ అతనికి పతకాన్ని ఖాయం చేసింది. అంతకుముందు 75 కిలోల క్వార్టర్ ఫైనల్స్‌లో సుమిత్ దక్షిణ కొరియాకు చెందిన కిమ్ హ్యోన్‌టేపై 5:0 తేడాతో విజయం సాధించి పవన్ ఆధిక్యాన్ని తెచ్చుకున్నాడు.

# ఆరు రోజుల లాభాలకు బ్రేక్
## నష్టాల్లో ముగిసిన స్టాక్ సూచీలు




**ముంబయి, నవంబరు 18:** వరుసగా ఆరు రోజులు లాభాల్లో ర్యాలీ తీసిన దేశీయ స్టాక్ మార్కెట్లకు మంగళవారం బ్రేకులు పడ్డాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 277.93 పాయింట్లు నష్టపోయి 84,673.02 వద్ద స్థిరపడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ 103.40 పాయింట్లు కోల్పోయి 25,910.05 వద్ద ముగిసింది. ఉదయం సెషన్ ఫ్లాట్‌గా ప్రారంభమైనప్పటికీ, కొద్దిసేపటికే అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మార్కెట్లు నెగెటివ్ జోన్‌లోకి జారుకున్నాయి. ఇటీవల మార్కెట్లు పుంజుకోవడంతో ఇన్వెస్టర్లు లాభాలను స్వీకరించారని, దీనికి బలహీన అంతర్జాతీయ సంకేతాలు తోడయ్యాయని విశ్లేషకులు తెలిపారు. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను డిసెంబర్‌లో తగ్గిస్తుందన్న అంచనాలు క్షీణించడం, డాలర్ బలపడటం వంటి కారణాలతో మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో ఐటీ, మెటల్, రియల్టీ షేర్లు నష్టపోయాయి. అయితే, ప్రైవేట్ బ్యాంకులు కొంతమేర మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. ఈ వారం వెలువడనున్న అమెరికా ఉద్యోగ గణాంకాల కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూసారు. ఫెడ్ పాలసీ నిర్ణయాలపై ఈ డేటా ప్రభావం చూపనుంది. భవిష్యత్తులో ఇండోయూఎస్ వాణిజ్య ఒప్పందంలో పురోగతి, దేశీయ కంపెనీల ఆర్థిక ఫలితాలు మార్కెట్లకు మద్దతునిస్తాయని నిపుణులు భావిస్తున్నారు. ఈరోజు ట్రేడింగ్‌లో దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టపోయాయి. నిఫ్టీ ఐటీ సూచీ అత్యధికంగా 1.10 శాతం పతనం కాగా, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆటో, ఎఫ్ఎంసీజీ రంగాలు కూడా నష్టాలను చవిచూశాయి. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోగా, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక శాతం మేర నష్టపోయాయి.




# దేశాభివృద్ధికి 9,9,6 విధానమే శ్రేష్ఠం
### ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కొత్త లెక్కలు

**బెంగళూరు, నవంబరు 18:** ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్. నారాయణ మూర్తి మరోసారి పని సంస్కృతిపై వ్యాఖ్యలు చేసి దేశవ్యాప్త చర్చకు నాందిపలికారు. గతంలో భారత యువత వారానికి 70 గంటలు పనిచేయాలని చెప్పి సంచలనం సృష్టించిన ఆయన, ఈసారి చైనాలో ఒకప్పుడు అమల్లో ఉన్న 996 పని విధానాన్ని ఉదహరించారు. దేశాభివృద్ధి వేగవంతం కావాలంటే యువత ఎక్కువ గంటలు పనిచేయడం తప్పనిసరి అని ఆయన అభిప్రాయపడ్డారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన 79 ఏళ్ల మూర్తి చైనా అనుసరించిన కఠోర పనివిధానం వల్లే ఆ దేశం ఆర్థికంగా వేగంగా పురోగమించిందని గుర్తుచేశారు. చైనా టెక్ కంపెనీలలో ఒకప్పుడు ప్రాచుర్యంలో ఉన్న 996 విధానం అంటే ఉద్యోగులు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు, వారానికి ఆరు రోజుల పాటు పనిచేయడం. అంటే, వారానికి మొత్తం 72 గంటల పని అన్నమాట. తయారీ రంగంలో భారత్ చైనాను అధిగమించగలదా అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ అది సాధ్యమే కానీ, అందుకు అసాధారణమైన నిబద్ధత అవసరమని స్పష్టం చేశారు. ప్రస్తుతం చైనా ఆర్థిక వ్యవస్థ మనకంటే ఆరు రెట్లు పెద్దది. మనం 6.57 శాతం వృద్ధి రేటుతో పర్వాలేదనిపించినా, వారితో పోటీ పడాలంటే ప్రతి ఒక్కరూ అసాధారణంగా కృషి చేయాలని ఆయన వివరించారు. వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ గురించి ఆలోచించే ముందు యువత తమ కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టాలని మూర్తి పునరుద్ఘాటించారు. ప్రతి పౌరుడు, అధికారి, రాజకీయ నాయకుడు, పారిశ్రామికవేత్త ఇలా ప్రతి ఒక్కరూ తమకు తాము ఉన్నత ప్రమాణాలు నిర్దేశించుకున్నప్పుడే భారత్ చైనాను అందుకోగలదని ఆయన అన్నారు.

# తగ్గిన బంగారం, వెండి ధరలు
## అంతర్జాతీయంగా ఔన్స్ బంగారం 4033 డాలర్లు

**ముంబయి, నవంబరు 18:**అమెరికా ఫెడ్ రిజర్వు వడ్డీరేట్ల తగ్గింపు సమీప కాలంలో ఉండకపోవచ్చని చేసిన వ్యాఖ్యలతో ఒక్కసారిగా బులియన్ మార్కెట్‌లో ధరలు తగ్గాయి. ఐదు రోజుల్లోనే తులం బంగారంలో ఐదువేలు తగ్గాయి. అంతర్జాతీయంగా కూడా ఔన్స్ బంగారం విలువలు 4033 డాలర్లు పెరగకుండా కట్టడి అయ్యాయి. డాలర్ రూపాయి మారకం విలువల్లో డాలర్ పటిష్టం కావడం, ఫెడ్ రిజర్వు రేట్‌కట్‌పై ఆశలు సన్నగిల్లడమే ఇందుకు కారణమని బులియన్ వర్తకులు చెపుతున్నారు. 24 కేరట్ల బంగారందరలు గ్రాముకు 12,366గా నడిచింది. 22 క్యారెట్లు 18 క్యారట్ల ధరలు కూడా అలాగే క్షీణించాయి. ఢిల్లీ, ముంబయి, కోల్‌కత్తా, బెంగళూరు, చెన్నైలలో ఇదేవిధంగా ప్రతిబింబించాయి. చెన్నైలో 24 కేరట్లు 12,437 రూపాయలు, ఇతర మెట్రో నగరాలలో కూడా ఇదే తరహా అటూ ఇటూగా నమోదయ్యాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పదిగ్రాముల బంగారంధర రూ.1.25 లక్షలు పలుకుతుంటే 22 కేరట్లు 1.14 లక్షలువద్ద ఉంది. ఇటు వెండి కూడా కిలో ఒక్కింటికి 1.56 లక్షలరూపాయలు పలుకుతోంది. ఈనెల 13న పదిగ్రాముల పసిడిధరలు 1.30 లక్షలవద్ద ఉంది. ఐదురోజుల్లోనే ఐదువేల మేర తగ్గింది. వెండి కిలో కూడా రూ.1.70 లక్షలవరకూ ఉండేది అప్పటితోపోలిస్తే ఇపుడు రూ.15 వేలు తగ్గింది. ఔన్స్ బంగారం 4200 డాలర్లుంటే ఇపుడు 4033గా నడుస్తోంది. వెండి ప్రస్తుతధర ఔన్స్ ఒక్కింటికి 49 డాలర్లుగా ఉంది.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.